
ఆంధ్ర సచిత్ర వారపత్రిక



14-[illegible]-81
12[illegible]


ప్రకృతి రహస్యం కనుగొనబడింది



ఇది సహజంగా, మృదువుగా మీ వంటి చాయను పెంపొందిస్తుంది

చర్మానికి నలుపుదనం ఎలా సంక్రమిస్తుంది

ఏమిటీ, కాలక్రమేణా మన వళ్లు నెమ్మది నెమ్మదిగా నల్లబడుతుందా ? అవును, ఇది లోపల నుంచీ, బయట నుంచీ కూడా రెండు విధాల జరుగుతుంది. మీ చర్మం లోపల ఒక నల్లని రంగు పదార్థం ఉంది. చర్మపు నలుపు దనానికి ఇదే కారణం. ఇది ఎంత హెచ్చుగా ఉంటే మనుషులు అంత నల్లగా ఉంటారు.



ఇది ఇలా ఉండగా, మీరు ఎండలోకి వెళ్లినప్పుడల్లా సూర్యుని అల్ట్రావయొలెట్ కిరణాలు మీ చర్మంలో ప్రవేశిస్తాయి. దాంతో మీరు మరికాస్త నల్లబడతారు.

వంటి చాయను పెంచడానికి పురాతన పద్ధతి ఏదైనా ఉందా ?

పందలాది సంవత్సరాలుగా ఆడవారు— సెనగపిండి, పాల మీగడ, నిమ్మరసం, గ్లిసరీన్ ఇంకా ఏవేవో ఉపయోగిస్తూ వస్తున్నారు. వీటి మూలంగా చర్మం మెత్తబడి కాస్త మెరవచ్చు. అంతేగాని చర్మాన్ని నిజంగా ఎర్రగా చేయలేవు. మరొక తెగకు చెందినవి బ్లీచింగ్ పదార్థాలు. ఇవి ఎంత హానికరమైనవో వేరే చెప్పనక్కర్లేదు. అపురూపమైన మీ పట్టు బట్టల్ని మీరు బ్లీచ్ చేస్తారా ? మీ చర్మం కూడా పట్టులాగ నాజూకు అయినది. పట్టుకంటె అపురూపమైనది.

విజ్ఞాన విజయం ! ఫెయిర్ అండ్ లవ్లీ సహజంగా, మృదువుగా తన పని చేస్తుంది.



ఫెయిర్ అండ్ లవ్లీ విజ్ఞాన ప్రపంచం సాధించిన విజయం. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా, సహజంగా, మృదువుగా మీ శరీర చాయను ఎర్రబరిచే సాధనం ఇది. ఫెయిర్ అండ్ లవ్లీ క్రీమును మీరు రాసుకున్నప్పుడు, అది మీ చర్మంలోకి ప్రవేశించి పనిచేస్తుంది—సహజంగా, మృదువుగా, సురక్షితంగా. దాంతో, మీ శరీర చాయ ఇతరులు మెచ్చుకొనేలా ఎర్రబడుతుంది.

అంతేకాదు ఫెయిర్ అండ్ లవ్లీ మీ చర్మాన్ని బయటనుంచి కూడా సంరక్షిస్తుంది. దీనిలో సూర్య కిరణాలను వడబోసే పదార్థాల మిశ్రమం ఉంది. ఇది ఎండలోని అల్ట్రావయొలెట్ కిరణాలను వడబోసి మీ చర్మం ఎండ వల్ల నల్లబడకుండా కాపాడుతుంది. అయినప్పటికి సూర్య కిరణాలలోని ఆరోగ్యమంతటినీ మీరు పూర్తిగా పొందగలుగుతారు.


6 వారాలకు మీకే తేడా కనపడుతుంది !

వాడి చూస్తే మీకే రుజువు అవుతుంది. ఫెయిర్ అండ్ లవ్లీని ఆరు వారాలపాటు నియమంగా వాడితే, మీతో పాటు ఇతరులు కూడా మీ వంటి చాయలో మార్పును గుర్తిస్తారు. ప్రకృతి సహజమైన రీతిలో మీ చర్మాన్ని లొంగదీస్తుంది ఫెయిర్ అండ్ లవ్లీ.

ఫెయిర్ అండ్ లవ్లీ క్రీమ్ నల్ల చర్మాన్ని ఎర్రబరచడంతో పాటు ఇంకా చేస్తుంది.



ఫెయిర్ అండ్ లవ్లీ మీ చర్మానికి కోమలత్వం సమకూరుస్తుంది. మనోహరమైన సువాసన చేకూరుస్తుంది. రోజుకు కనీసం ఒకసారి వాడండి. రెండు సార్లు వాడితే మరీ మంచిది. నియమంగా వాడితే, మీ వంటి చాయ పెంపొందుతుంది, అలాగే ఉంటుంది. సహజంగా, మృదువుగా ఎరుపెక్కుతుంది.




ఫెయిర్ అండ్ లవ్లీ — నల్లని చర్మాన్ని ఎర్ర బరచడం కోసం సున్నితమైన తీరు

హిందుస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి.

లింటాస్—FALOV.10 254 TL

లోకం పోకడ * ఊరిమెన్



ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభు ప్రసాద్
సంపాదకుడు
[1938 1972]
శుక్రవారం : 14-8 '81
దుర్మతి నామ సం. శ్రావణ శు. చతుర్దశి
సంపుటము 74 : సంచిక 48

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
పోస్ట్‌లో ఏడాది చందా రు. 67-60
ఆరు మాసాల చందా రు. 33-80
విడి ప్రతి వెల రు. 1-25 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం. విజయవాడ-520 003

విషయానుక్రమణిక

అట్టమీది బొమ్మ :
'కొండవీటి సింహం'లో
ఎన్. టి. రామారావు, శ్రీదేవి

కథలు :

ఇదీ ప్రేమే! ... 14
మధ్య తరగతి బాపతు ... 28
బురద గుంటలు ... 44
డబుల్ డెకర్ ... 50

సీరియల్ కథలు :

నర్సింగ్ హోం ... 6
ఎదురు చూపు ... 20
రాగజ్వాల ... 36

వ్యాసాలు, శీర్షికలు :

లోకం పోకడ—4, ఉత్తరాలు—5, ధర్మపథం — 13, ఎర్ర సముద్రం ఉల్కాపాతంవల్ల ఏర్పడిందా? — 16, సినిమా-30, ఇరుగు పొరుగు — 34, సాహిత్య నిపుణుడు — 42, వారఫలం-48, హైదరాబాద్ నోట్‌బుక్ 54, ప్రశ్నావళి—55, వంటలు—57.

ఉత్తరాలు

ముఖచిత్రం

సూర్యదేవుని రథ చక్రం ముఖచిత్రంతో వెలువడిన 24.7.81 నాటి ఆంధ్రసచిత్రవారపత్రిక, ముఖచిత్రాల విషయంలో మీరు తీసుకుంటున్న శ్రద్ధకి తార్కాణం. ప్రపంచంలోని అత్యద్భుతాలలో ఒకటైన కోణార్క్‌లోని సూర్యదేవుని ఆలయం మన శిల్పుల అపూర్వత్వానికి నిదర్శనం. సినీతారలవే కాకుండా మన భారతీయ శిల్పకళలను చాటే యిలాంటి కళా ఖండాలు ఒరవడిగా వేయగలరని ఆశిస్తున్నాము.

వెమూరి రజనీ అరుణ, శ్రీదేవి (కరీంనగర్)

*   *   *

17.7.81 ఆంధ్రసచిత్ర వార పత్రిక అందమైన కల్పనా అయ్యర్ ముఖ చిత్రంతో మిమ్మల్ని మురిపించింది. కానీ ముఖచిత్రంలో అందం, ఆకర్షణ కంటే 'సెక్స్' పరమైన కవ్వింపు ధోరణి అధికంగా వుంది. పత్రికలో 'ప్రశ్నలు — జవాబులు' శీర్షికలో కె. రామలక్ష్మి గారి సమాధానాలు చూస్తే నవ్వు వస్తోంది. అసలు ఈ శీర్షిక ఎందుకు వేస్తున్నారో కూడా అర్థం కావటం లేదు. కేవలం ఒక వైపు నుంచే ఆలోచించి జవాబులీయటం హాస్యాస్పదమైన విషయం.

'హైదరాబాద్ నోట్‌బుక్' కూడ ఇలాగే తయారయ్యింది. పత్రికలోని ప్రతి విషయం పాఠకునికి అర్థం కావాలి. తర్వాత ఆలోచింప చెయ్యాలి.

ప్రారంభించబడిన రెండు సీరియల్సు పాఠకులను ఒకదానికొకటి విభిన్నంగా ఆకట్టుకుంటున్నాయి.

తెలిసిన విషయాన్నే క్లియర్‌గా పాఠకులకు గుర్తు చేయుటలో 'దొంగ' కథ ద్వారా సఫలీకృతులయ్యారు శ్రీ మంథా వెంకట రమణారావు గారు. మిగిలిన రెండు కథలు కూడా బాగానే వున్నాయి.

'హూమెన్' గారి 'లోకం పోకడ' పత్రికకే హైలైట్. 18వ పేజీలోని 'కాటూరి' గారి 'ఫ్రంట్ సీటు' కార్టూను మమ్మల్ని గిలిగింతలు పెట్టించింది. పత్రిక వచ్చిన రోజే మొత్తం చదివేశాను. మళ్ళీ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాను.

జి. శ్రీనివాసరావు (మేదరమెట్ల)

పై వారమే!
స్వాతంత్ర్య దినోత్సవ సంచిక

సీరియల్

నర్సింగ్ హోం

శ్రీరంగం

(గత సంచిక తరువాయి)

జరిగినకథ - 4: డాక్టర్ రాజా ఎం డి లో గోల్డ్‌మెడల్ సంపాయించుకొంటాడు. ఇప్పుడు అతను తన కుటుంబాన్ని మోయవలసి వున్నది. రాజా, మంజుల ఇరువురూ ఒకరినొకరు పరస్పరం ప్రేమించుకొంటారు. అతను ప్రాక్టీసు పెట్టి, కొంత ఆర్థికస్తోమత చిక్కిన తరువాత పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొంటారు. డా. విశ్వం సహాయంతో ప్రాక్టీస్ పెడతాడు రాజా. ఎం. బి బి.యస్ పూర్తి కాకుండానే కొంతడబ్బు ఖర్చుపెట్టి ఆర్. ఎం. పి. డిగ్రీ తీసుకొని డిస్పెన్సరీ తెరుస్తాడు డా. రాధాకృష్ణ. అతను తన భార్య సుగుణకు కూడా ఓ ఆర్. ఎం. పి డిగ్రీ సంపాయించి ఆమెను తన డిస్పెన్సరీలోనే లేడీ డాక్టర్‌గా వేసుకొంటాడు. డాక్టర్ విశ్వం దగ్గరకు ఓ అమ్మాయి వచ్చి, మీరు లోగడ నా భర్తకు చేసిన 'వేసక్టమీ' ఆపరేషన్ ఫెయిల్ అయిందని అతనితో చెప్పమని, ఫీజు క్రింద తన గాజులు తీసి యిస్తుండగా, విశ్వానికి అహం అడ్డురాగా బయటకు పొమ్మంటాడు. ఆమె పోతుండగా భర్త పేరు అడిగి తెలుసుకొని ఆమెకు సహాయం చేస్తాడు. డా. రాధాకృష్ణ ఎక్స్‌కౌన్సిలర్ సహాయంతో ఓ మందులషాపు పెట్టి, అందులో చదువూ సంధ్యా లేకుండా తిరుగుతున్న తన తమ్ముళ్లకు దొంగ సర్టిఫికేట్‌లు సంపాయించి వాళ్లను అందులో వుంచుతాడు.

'డాక్టరుగారూ! ఈ సంగతి విన్నారా!' అంటూ ఒకరోజు ప్రొద్దున్నే వచ్చేడు ఎక్స్‌కౌన్సిలర్ రాధాకృష్ణ యింటికి.

'ఏ సంగతి?' అన్నాడు రాధాకృష్ణ.

'అదేనండీ, ఆ శెట్టి వెధవ డబ్బు కక్కుర్తి కోసం తన గది డాక్టరుకు అద్దెకు ఇచ్చేడట వోరి వెధవాయ్ నీకేగాని డబ్బు కావాలంటే మరో వెధవని చూసిపెడ్తాము. ఏదో పిల్లరకొట్టో, కిళ్లీల బడ్డీయో పెట్టుకుంటాడు అంతేకాని మా డాక్టరుకు కాంపిటీషనుగా మరో డాక్టర్ని పెట్టకేంఅన్నా వినలేదు. ఈ మధ్య వాడచేతిలో నాలుగు పైసలు ఆడుతున్నాయ్. అందుకే వాడికి కళ్లు నెత్తికెక్కేయ్.'

'పోనీలెండి అతనియిల్లు, అతను యిష్టం వొచ్చినట్టు చేసుకుంటాడు'

'అలా అని మనకు కాంపిటీషనుగా మరొక డాక్టర్ని పట్టుకువస్తాడా'

'వస్తే రానీయండి?'

'అలా అనకండి డాక్టరుగారూ! ఏ పుట్టలోంచి ఏం పాము వస్తుందో చెప్పలేము. మీరు మంచివాళ్లని అందరూ అలానే ఉండక్కర లేదు. ఏమైనా ఒక డాక్టరుకు మరో డాక్టరు పోటీ యింత దగ్గరలో అయితే కాస కాకపోయినా కాస్త అయిన చెడుపే' అని పైకి అని మనస్సులో మాత్రం పూర్తి చెడుపే ఇంక ఏవరైనా ఈ చుట్టుపక్కల డిగ్రీ ఉండీ కాస్త అనుభవం ఉన్న డాక్టరు పెట్టేడంటే నీ చేతికి చిప్పేగతి నిన్ను ఆశ్రయించుకుని బతికే నాకూ దెబ్బే రాధాకృష్ణకు డిగ్రీలేదని యింకా స్టూడెంటే అని కౌన్సిలర్‌కి తెలును. అయినా తెలియనట్టే ప్రవరిస్తాడు. డిగ్రీ ఉన్న డాక్టరు నేటట్లు గౌరవం యిస్తాడు.

'మీరు అనవసరంగా భయపడుతున్నారు.'

'అవసరంగాలేదనీ ఇక్కడ పెట్టబోయే డాక్టరు పేరు చెబితే తెలుసుకుంటావు.'

'ఎవరేంటి?'

'డాక్టర్ రమేష్-గాంధీ కాలేజీ'

రమేష్ తన క్లాస్‌మేట్ తనంటే పడని వాళ్లలో ముఖ్యుడు. తనకు ఎప్పుడూ ఎదురే కాలేజీలో తన ప్రతిభనిని ప్రతిఘటించేవాడు. శ్రద్ధగా చదివేవాడు. డిగ్రీ తీసుకున్నాడు. తనేమో యింకా ... డిగ్రీ లేకుండా యిలా ఉన్నాడు. ఈ రమేష్ నుంచి తనకు చెడుపే. అతనికి ఈపాటికి తెలిసే ఉంటుంది- తన గురించి తన ఆదాయం గురించి తన ప్రాక్టీసు పడగొట్టాలనే ఈ ఊళ్లో ఎన్నో స్థలాలు ఉన్నా ఈ వీధినే ఎన్నుకున్నాడు రమేష్! నీవు మంచివాడివి, బలహీనుడివి. నేనేం చెడ్డవాణ్ని. చెడు మంచిని ఎప్పుడూ జయిస్తూనే వొచ్చింది యిన్నాళ్ల బట్టి. ఈసారి కూడా జయిస్తుంది. నీవు నిజంగా బతుకుతెరువుకు వచ్చిఉంటే నాలుగురాళ్ళు సంపాయించుకుని బ్రతుకు అలా కాకుండా నాకే ఎసరు పెట్ట దలచుకున్నావా, నన్ను దెబ్బగొట్ట దలచుకున్నావా నిన్ను కుక్కను తరిమినట్టు తరుముతాను- అని మనస్సులో అనుకుని రమేష్‌తో నాకు పరిచయం ఉంది. అతను నా క్లాస్‌మేట్

'పరిచయమే కాదు, శతృత్వము కూడా ఉన్నదని విన్నాను.'

'అవును'

'అలాంటివాడు తన ప్రాక్టీసు పెంచుకోవాలని చూస్తాడు నీది దించాలనుకుంటాడు'

'మరి ఏం చేద్దాం' అంటారు.

'ఆలోచించి చెబుతాను' అని 'డాక్టర్! ఇంట్లో పిల్లలందరూ కోడి కూర అంటూ రోజూ అంటున్నారోయ్. రేపు రేపు అంటూ యివాళదాకా సాడిగించేను. ఇక నా నుంచి కాదు, ఏమైనా సహాయం.'

'సుగుణా! మన కౌన్సిలర్‌గారికి మన మూడు కోళ్లలోంచి ఒకదాన్ని యివ్వు' అంటూ భార్యతో అన్నాడు.

'అమ్మా! అదుగో! ఆ పోతులా వుందే దాన్ని యివ్వు. పెద్ద కుటుంబం. అందరికీ తలో ముక్కయినా రావాలి.'

కోడిని అందుకుని దాన్ని పరీక్షగా చూసి

బాగుందమ్మా' అని 'డాక్టర్! ఇక వస్తాను. నువ్వేం బెంగ పెట్టుకోకు' అని బయట పడ్డాడు

'మన ఎక్స్ కౌన్సిలర్‌కి చేతినిండా పని యిక పూటకో సంగతి చెప్పి తన్ను దోచేస్తాడు' అనుకున్నాడు రాధాకృష్ణ.

* * *

డాక్టర్ రమేష్ క్లినిక్ తెరవడాన్ని ఎవరూ ఆపలేకపోయారు ఎక్స్ కౌన్సిలర్ 'పెద్ద వాళ్ళందరితో చెప్పించేను, అయినా లాభంలేక పోయింది' అన్నాడు

సింపుల్‌గా ఆ వీధిలో ఉన్న నలుగుర్నీ పిలిచి టీ కాఫీ లాంటి ప్రయత్నాలే లేకుండా తెరిచేడు రమేష్.

ఇంటి యజమాని చెట్టి చాలా మంచి వాడు. అతను రమేష్‌తో మొదటి రోజే 'రాధాకృష్ణ, అతన్ని ఆశ్రయించుకున్నవారు రోగ్స్. వాళ్ళు డబ్బుసంపాదించే విధానాలు కోకొల్లలు. యీ విధానాలను తీర్చిదిద్దేవాడు ఆ ఎక్స్ కౌన్సిలర్. వీళ్ళందర్నీ దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా మసలుకో' అన్నాడు.

'సరే అండీ' అన్నాడు రమేష్

అతను ఉదయం తొమ్మిది నించి వొంటి గంటదాకా, తిరిగి సాయంత్రం అయిదునించి ఎనిమిది దాకా ఉండేవాడు. రోజులు గడుస్తున్నకొద్దీ అతనికి దినానికి అయిదూ ఆరు పేషంట్సు రాసాగేరు. పెట్టి మూడు వారాలయినా కాలేదు ఇప్పుడే అయిదు ఆరు అంటే అది మంచి ప్రాక్టీసన్నమాట.

రమేష్ వచ్చిన వాళ్ళను రాధాకృష్ణ గురించి అడిగేవాడు.

వొక్కరూ సరి అయిన అభిప్రాయం యివ్వలేదు. 'అతని దగ్గరికి వెళితె జబ్బులు తగ్గవండీ, అతనికి వైద్యం రాదేమో అని పిస్తుంది.'

'ఎలా వస్తుందండీ, యింకా నాలుగో సంవత్సరం అయినా పూర్తి చేయలేదు మెడిసిన్‌లో.'

'అంటే'

'అతను స్టూడెంటండీ!'

'ఆ'

'అవును. రాధాకృష్ణ ప్రాక్టీసుకు చదువు అక్కరలేదు అని పెట్టేసేడు మీరు అంతా అతనికి మద్దతు యిస్తున్నారు.'

'ఇందులో మాదేంలేదండీ'

'అందరూ అలానే అంటారు ఇదే మన దేశ దౌర్భాగ్యం యిక్కడ విద్యకు గుర్తింపు అంటూ లేదు. చదువు రానివాడు కూడా చదువు వొచ్చినవాడిలా నటిస్తూ, అందరి కళ్ళల్లో దుమ్ము కొట్టేస్తూ ధనవంతుడు అయిపోవచ్చు యీ ప్రజ వివేకంతో ప్రవర్తించే దినం ఎప్పుడు వస్తుందో?' అన్నాడు

వొక్కడితో అన్న యీ మాటలు ఆ నాలుగు గోడలు దాటి వెళ్ళేయి.



మర్నాడు ఎక్స్ కౌన్సిలర్ 'డాక్టరూ' అంటూ పరిగెత్తి రాధాకృష్ణ దగ్గరకువచ్చి 'ఎలాంటి ఘోరం జరిగిపోతూందో చూడు డాక్టర్, నీకు డిగ్రీ లేదట నీవింకా స్టూడెంటువట. ఇలాంటి మాటలు మన దగ్గరకి వచ్చేవాళ్ళ చెవిలో పడిందంటే- మన ప్రాక్టీసు దెబ్బతినదూ మనం గట్టిగా ప్రయత్నంచేసి అతని నోరు మూయించకపోతే ముందు ముందు మనం బ్రతకలేం'

రాజకీయాల్లో తిరిగి తిరిగి ఎక్స్ కౌన్సిలర్‌కి అబ్బిందేంటంటే - నోరు మూ[illegible] అన్న ఊతపదం. దాని అర్థం మర్డర్ అన్న మాట యీ చిన్న విషయానికి అంత పెద్ద ఆయుధం ఎందుకు వాడాలి? అన్నాడు రాధాకృష్ణ.

'నువ్వు చిన్నదీ అంటూ ప్రతీదాన్నీ అంటూండు, మన డిస్పెన్సరీ తాళాలు పడేదాకా.'

'అయితే ఏంచేయమంటారు?'

'వొక వందరూపాయలు మనవి కావు అనుకో! రాత్రి మన పిల్లల్ని పంపేద్దాం. వాళ్ళు చూసుకుంటారు మిగతా విషయాలు'

'మీరు రమేష్ గురించి చాలా తక్కువ అంచనా వేసేరు. అతన్ని కొట్టించడం మీరు అనుకున్నంత తేలికైన పనికాదు.'

'ఎందుకని?'

'మనవాడు బాక్సింగ్‌లో కాలేజీ ఛాంపియన్. మన పిల్లలందర్నీ బాగా చితగ్గొట్టేస్తాడు'

నర్సింగ్ హోం

'పోనీ మన దాదాలను యింకొంచెండబ్బు వేసి పిలిపిస్తే'

'అతనూ పిలిపిస్తాడు'

'అయితే యింకేం చేయాలంటావు ?'

'సమయం రానీండి. అప్పటిదాకా ఆగాలి మనం.'

'సరే మవ్వు ఎప్పుడు నన్ను రంగంలోకి దూకమంటే అప్పుడే దూకుతాను' అని 'డాక్టర్ నా భార్యకు రెండురోజుల నించి వికారంగా ఉంది, ఏమైనా మాత్రలు.'

రాధాకృష్ణ తల పట్టుకున్నంత పని చేసేడు.


'అది వికారం కాదు నాయనా నెప్పులు మొదలయేయి. చచ్చేనురా భగవంతుడా' అను కున్నాడు ఎక్స్ కౌన్సిలర్ భార్య ఎప్పుడు కడుపుతో ఉన్నా ఆమెకు ఆగకుండా అలా వాంతులు అవుతూనే వుంటాయి. ఆ వాంతులు నాలుగు నెలలదాకా తగ్గవు. యీ నాల్గు నెలలూ మొగుడూ పెళ్ళాం ఇద్దరూ అతని ప్రాణాలు తోడేస్తారు. పొద్దున్న లేవగానే 'డాక్టర్ యింకా తగ్గలేదయ్యా, ఒక్కసారి యింటికి వస్తే బాగుంటుంది' అంటాడు.

అవసరం లేదంటే వినడు. రోజూ రెండు పూటలా రావాలి అంటాడు. వెళ్ళేదాకా కళ్ళ ముందరనించి కదలడు. వెళ్తే ఆమె గోలని భరించలేడు. 'డాక్టరూ నాకు యింత విషం యిచ్చి చంపేయ్. పేగులు బయటకు వచ్చేటట్లు నేను డోక్కోలేను' అంటూ రెండు పూటలా 'చంపేయ్' అంటూ 'రామ నామస్మరణే' అని అనుకుని ఎక్స్ కౌన్సిలర్‌తో 'మీరు ఒకసారి తీసుకురండి ! ఆమెకు నెల తప్పిన వికారమేనేమో' అన్నాడు

'ఏంటో యిదంతా ఆ పరాత్పరుడి లీల' అంటూ తల పైకెత్తి చూరు వైపు ఒక నమస్కారంపడేసి 'నేను వెళ్తాను. సాయంత్రం తీసుకొస్తాను మా వాళ్ళని' అని 'డాక్టర్ నా రెండోవాడికి కడుపునొప్పి, విరేచనాలూ. ఆఖరి వాడికి కడుపునొప్పి, మలబద్ధకం, రెండు మాత్రలు యివ్వు' అన్నాడు.

రాధాకృష్ణ మందుతీసి యిచ్చి 'యిది వేయండి' అన్నాడు.

సాయంత్రం కలుస్తాను అని 'డాక్టర్



యిప్పుడు మన సికిందరాబాదులో ఎన్నో మందుల కంపెనీలు ఉన్నాయి మనం వొకటి పెడితే ఎలా వుంటుంది? ఆలోచించు' అంటూ వెళ్ళిపోయేడు.

రాధాకృష్ణకు ఈ సలహా చాలా బాగా అనిపించింది

''అవును, యీ కాలంలో ప్రతీ రోజూ ఒక క్రొత్త మందుల కంపెనీ పుట్టుకువస్తూంది. వొక పదివేలు వుంటే చాలు. బి కాంప్లెక్సు ముడి సరుకుని నీళలో కలిపి టానిక్‌గా చేసి అమ్మడం దీనికి కావలసింది ఖాళీసీసాలు ప్యాకింగ్ సామాన్లూ. కుక్క గొడుగుల్లాగ కంపెనీలు లేచే ఈ కాలంలో తనూ వొక గొడుగు ఎందుకు పట్టకూడదు. ఎక్స్ కౌన్సిలర్ తన్ను పిండినా మంచి అయిడియాస్ యిస్తాడు. తన మందులు తను తన మెడికల్ షాపులో అమ్ముకోవచ్చు అందులో రెండు వందల శాతం లాభం ఇక తను ఆ చివర నించి నరుక్కువస్తాడు'' ఆలోచనల వేడితో ఆకలి మొదలయింది వంటింట్లోకి కదిలేడు

* * *

డా. రాజా రోజూ నర్సింగ్‌హోంకి వచ్చి తన గదిలో కూర్చుంటాడు. అతను నర్సింగ్ హోంకి రెండు కిలోమీటర్ల దూరంలో రెండు గదుల పోర్షన్ అరవై రూపాయలకు తీసుకున్నాడు తల్లినీ తండ్రినీ వొచ్చి ఉండమన్నాడు. 'మేం ఎలా వొస్తాంరా ఇక్కడ పిల్లలూ, నా ప్రాక్టీసో' అన్నాడు తండ్రి

'పోనీ యిద్దరు చెల్లెళ్ళనూ పంపించు' అన్నాడు.

ఆదెలా సాధ్యం అవుతుంది, నువ్వు క్లినిక్‌కి వెళిపోతే యిద్దరు ఆడపిల్లలొంటరి అయిపోరూ.'

'పోనీ తమ్ముళ్ళనో...?'

'వాళ్ళా రావడానికి వీల్లేదు. వాళ కష్టంమీద వాళ్ళు బతికేందుకు ప్రయత్నిస్తున్నారు. వాళ్ళను నీ వెంబడి తీసుకెళితే వాళ్ళకు తిని కూర్చోడం తప్పితే మరింకేం అబ్బదు.'

ఎవరికి వారే రామంటే తను వొక్కడే ఉండవలసి వొచ్చింది. మొదటి నాలుగు రోజులూ హోటల్ భోజనం చేసేడు. తర్వాత ఆ భోజనం కంటే ఉపవాసం ఉంటేనే బాగా అనిపించింది. తనకూ డాక్టర్ విశ్వంలా వొంట వచ్చి ఉంటే తిండి గురించి ఇంకొకరి మీద ఆధారపడవలసిన అవసరమే ఉండేది కాదు

హోటలు మీద అసహ్యంకల్గి తనే స్వయంపాకం మొదలుపెట్టేడు ప్రతీ వారం తల్లి పచ్చళ్ళూ, పొడులూ సీసాలో వేసి పంపించేది తమ్ముళ్ళతో తను వెళ్ళినప్పుడు తనే తెచ్చుకొనేవాడు ఇంట్లో యింత అన్నం వొండుకుంటే చాలు ఆపూట గడిచిపోతూంది.

మంజుకు వారం వారం ఖచ్చితంగా ఉత్తరం రాస్తున్నాడు.

తొమ్మిది గంటలకు యింటి తలుపు తాళంవేసి నర్సింగ్‌హోంకు బయలుదేరతాడు తొమ్మిదిన్నరకు అక్కడ చేరి యిక గదిలో కూర్చుంటాడు గంటకో అరగంటకో వొక కేసు వచ్చేది డాక్టర్ విశ్వం వోపీ ముందు జనం తిరపతి క్యూ ప్రమాణంలో ఉంటే తన గది ముందు ఎవరూ ఉండేవారుకారు

అందుకే నర్సింగ్‌హోంలో పేపరు చదివి పారేసేవాడు తర్వాత విశ్వం వోపీ నించి మాగజైన్లు తెప్పించుకొనేవాడు విశ్వం పేషంటు తన గురించి ఎదురు చూస్తున్నప్పుడు వాళ్ళకు పొద్దుపోవాలనీ అన్ని మాగజైన్లూ తెప్పించి ఉంచేవాడు పేషంటు చూసినా చూడకపోయినా రాజా మటుకు చూసేవాడు అక్కడ ఉండేవాళ్ళకు ఎంత అలవాటు అయిపోయిందంటే రాజా తన గదిలో కూర్చోగానే అటెండరు కొన్ని పుస్తకాలూ పేపరూ తెచ్చి అతని టేబిలు మీద పెట్టి వెళ్ళిపోయేవాడు

అవతల బోర్డు వేసేడు. అయినా బోర్డుని చూసి యిప్పటిదాకా వొక్క పేషంటు వొచ్చినట్టులేదు. తన దగ్గరికి వచ్చిన వాళ్ళందరూ డాక్టర్ విశ్వం పంపించినవాళ్ళే. యీ వూరి ప్రజకు బోర్డు చూసి వచ్చే అలవాటు లేనట్టుందే. స్పెషలిస్టు విలువ వీళ్ళకు తెలియదేమో. వీళ్ళకంటే ఆ ఢిల్లీ ప్రజే నయం అనిపిస్తుంది అక్కడవాళ్ళకు చెవి నొప్పి వస్తే ఇ యన్ టి. డాక్టరు దగ్గరికే వెళ్తారు కాని మరి యింకో డాక్టరు దగ్గరికి వెళ్ళరు. ఇక్కడ అలా కాదులా ఉంది. వొకసారి డాక్టర్ విశ్వం చెప్పేడు ఇక్కడ ప్రాక్టీసు పెరగాలంటే గవర్నమెంటు ఆసుపత్రిలో పని ఉండాలనీ, అది లేకుండా ప్యూర్లీగా ప్రయివేట్ ప్రాక్టీసుమీదే మొదట్లో ఆధారపడడం చాలా కష్టం అన్నాడు. రోజులు గడుస్తున్న కొద్దీ తనకు భయం అధికం కాజొచ్చింది మొదటినెలలో ఎనిమిది వందలు వచ్చింది రెండో నెలలో వెయ్యి, మూడోనెలలో కూడా వెయ్యే యీ కూర్చోడం చూస్తూంటే ముందు ముందు తనకు యిదీ వొచ్చేటట్టుగా కనిపించడంలేదు. తను తన యిద్దరి తమ్ముళ్ళనీ, తల్లి తండ్రుల్నీ-తన చెల్లెళ్ళనూ చూసుకోవాలి ఇంకో సంవత్సరంలో తన యిద్దరు చెల్లెళ్ళ పెళ్ళి చేసేయాలి వొక్కొ చెల్లి యింటినించి కదలాలంటే తక్కువలో తక్కువ వొకపదివేలయినా ఉండాలి అంటే యిరవైవేలు తనకు నెలకు నాలుగువేలు సంపాదన ఉంటే నేకాని, యివన్నీ జరగవు. రెండోనెల- తండ్రి అదో విధంగా ముఖం పెటేడు, తను అయిదువొందలు



అతనికి యీయగానే. అంత పెద్ద డిగ్రీ తీసుకున్న డాక్టరు పట్నంలో ప్రాక్టీసు పెట్టేవు అయిదు వొందలా ? వీటితో నా బాధ్యతల్ని నేను ఎక్కడ నెరవేర్చగలను అన్న భావాలు అతని ముఖంలో కదిలేయి. తను ఏంచెప్పగలడు.

ఆలోచనలు మనస్సును బరువెక్కిస్తూంటే పేపరు తీసేడు. అందులోని విడ్వర్టయిజ్ మెంట్సు అతను రోజూ చూస్తూన్నా-యీరోజు అమితంగా ఆకర్షించేయి వొకడు కాన్సర్ క్యూర్ కంటూ విడ్వటయిజ్ చేస్తే, మరొకడు ఆస్త్మాకని అంటాడు. ఇంకొకడు సెక్సు జబ్బులకు అంటాడు. మరొకడు పైల్సుకి అంటాడు.

వొక్కొక్క విడ్వటయిజ్ మెంటు కనీసం మూడువందలయినా ఉంటుంది అవి ప్రతి దినం కనిపిస్తాయి. అంటే తొమ్మిదివేలు ఖర్చు పెడ్తారు వొక్కొక్కరూ నెలకు. తొమ్మిదివేలు కాకపోయినా నాలుగువేలకు తక్కువ కాదు. దీనికి తోడు వీళ్లకు బ్రాంచీలు. ప్రతీ బ్రాంచీలో ఫోనూ. ఇంత మెయిన్ టెనెన్స్ విలా తట్టుకుంటున్నారు ? దీన్ని తట్టుకోవాలంటే వీళ్లకు నెలకు ఎంత రావాలి ? అంటే ప్రజల దగ్గరనించి ఎంత రాబట్టాలి ?

కాన్సరుకు క్యూర్ అంటూ లేదు. ఆ సంగతి అందరికీ అక్షరికి చదువు రానివాడికి కూడా తెలుసు. అయినా కాన్సరు పేషంట్సు వీళ్ల దగ్గరకు వెళుతున్నారంటే, బతకాలనే మనిషి ఆశ మీద యీ క్యూర్ చేస్తాం అనేవాళ్లు సౌధాలు కడ్తున్నారు. అలాగే ఆస్త్మా ! దుమ్మూ, వాతావరణంలో మార్పూ, పూలలో ఉండే పుప్పొడి యివి కొన్ని కారణాలు యీ వ్యాధికి. ప్రతీ ఆస్త్మా పేషంటుకీ ఆస్త్మా టాబ్లెట్లూ, యింజక్షన్లూ తెలుసు. అవి తాత్కాలికంగా ఉపశమింపజేస్తాయి అని తెలుసు. అయినా జనం పరిగెత్తుతారు. ఏ మారుమూల పల్లెలోనో ఎవరో పసరు పోస్తున్నారంటే, ఏదో ఆశ. జరగొచ్చేమో అన్న ఆశ వీళ్లను పరిగెత్తింప చేస్తుంది.

'సార్, సార్' అన్నాడు అటెండరు.

'ఏంటీ ?' అన్నాడు తను ఆలోచనలను ప్రక్కకు నెట్టేస్తూ.

'మన మేనేజరు ఎలానో చేస్తున్నారు.

నర్సింగ్ హోం

వెంటనే రావాలి మీరు' అన్నాడు అటెండరు కంగారుగా.

'పద' అంటూ లేచేడు.

మేనేజరు గదిలోకి వెళ్లేడు అప్పటికే విశ్వం అక్కడ ఉన్నాడు. అతను మానేజరు నాడి పట్టుకుని చూస్తున్నాడు

రాజా రాగానే చేతిని వదిలేసి 'పరీక్ష చేయండి డాక్టర్' అన్నాడు.

మానేజర్ కళ్లు వొకవైపు తిరిగి మూతి వొక ప్రక్కకు యీడ్చబడి ఉంది అతని నోటినుండి నురగవస్తూంది. అతన్ని పిలిచినా పలకటంలేదు.

కోరిక

నా కెప్పుడూ కలలో కనపించి
కరుణిస్తున్నావు-కాదనడంలేదు,
కాని నాకో కోరిక మనసులో
ఉండిపోయింది ప్రభూ !
నేను నీ పాదాలు పట్టి విడువనట్టు
ఒకసారి నీ కలలోకి రావాలనివుంది,
కాని నీ బిడ్డల పోషణలో
వ్యవధిలేని నీ కంటికి కునుకెక్కడ ?

— గోవిందరాజా రామకృష్ణారావు

మొదట వార్డుబాయి సహాయంతో అతన్ని కుర్చీలోంచి ఎత్తి బెడ్ మీద పడుకోబెట్టి బీపీ చూసేడు. రెండువందలుంది. చాలా ఎక్కువ ఉందే అనుకుని యితర పరీక్షలు చేసేడు తను పరీక్షలు పూర్తిచేసేటప్పటికి మేనేజర్ చాలా మటుకు కోలుకున్నాడు. అతని కనుగుడ్లు మామూల్గా అయేయి. మూతి కూడా మామూలు స్థితికి వచ్చేసింది.

డాక్టర్ రాజా ''ఏంటి అయింది ?'' అంటూ అడిగేడు. ''ఏంలేదండీ కాస్త వొళ్లు తూలింది'' అన్నాడు మేనేజర్.

'నీకు బ్లడ్ ప్రెషర్ ఉందని తెలుసా ?' అంటూ అడిగేడు.

'తెలుసండీ'

'అయితే ఏం మందువాడ్తున్నావు ?'

'ఆయుర్వేదం'

'నువ్వు యిక్కడ నర్సింగ్ హోంని మేనేజరు హోదాలో నడుపుతూ ఆయుర్వేదం మందు వాడ్తావా ! బాగుంది !'అని అనుకుని అతన్ని పూర్తిగా పరీక్షించి 'నీవు యీరోజు నర్సింగ్ హోంలో అబ్జర్వేషన్ లో ఉండు' అన్నాడు.

మేనేజరు తలూపేడు

రాజా విశ్వంతో 'పెరాలసిస్ వొచ్చే సిమ్టంప్సు ఉన్నాయి సార్. మా మామూలు రొటీన్ పరీక్షలు మొదలు చేద్దాం ! ట్రీట్ మెంట్ కూడా మొదలుపెడ్దాంసార్' అన్నాడు.

'నాకు చెప్పేది ఏముంది డాక్టర్, యిది మీ ఫీల్డు'

కాయితం మీద మందులు రాసిచ్చి అటెండరుతో తీసుకురమ్మనిచెప్పి తన గదిలోకి వచ్చి కూర్చున్నాడు. అరగంట అయింది అటెండరు పత్తాలేడు. గంట అయింది 'వీడు యింకా రాడేంటి ?'అని అరుచుకుంటూ అసహనంతో సిస్టర్ ని కేకేసి అటెండరు గురించి అడిగేడు.

'అతను వచ్చేసి చాలా సేపయింది సార్. ఆపరేషన్ థియేటర్ లో థియేటర్ క్లీన్ చేస్తున్నాడు' అంది.

'మరి మందులు తీసుకవచ్చేడా ?' అన్నాడు.

'లేదుసార్. మానేజర్ కి మన మందుల మీద నమ్మకం లేదు. అతనికి హెర్బల్ మందుల మీద గురి. ఆ ఆసుపత్రికే వెళ్లిపోయేడు వాళ్ళవాళ్లని పిలిపించుకుని.'

రాజా సీటుకు అతుక్కుపోయేడు ఆ మాట విని.

'ఎండమావుల వెంట వీళ్ళు ఎలా పరిగెడ్తారో' అన్నమాట అతని నోటినుండి వెలువడింది

పదకొండు నించి పదకొండుంబావు దాకా విశ్వం రెస్టు తీసుకుంటాడు. ఆ టైములో రాజాని రమ్మని కబురు పెట్టాడు ఇద్దరూ లోకాభిరామాయణం మాట్లాడుతారు ఈ రోజు దేనిగురించో కాకుండా మేనేజర్ గురించే మాట్లాడసాగేరు.

'అతను వెళ్ళిపోయేడు సార్?' అన్నాడు రాజా.

'అవునట! అతనికి మన మందుల్లో అసలు గురే లేదుట !'

'అంత గురిపెట్టుకున్న ఆ మందులు కూడా యీ పెరాలిసిస్ రాకుండా చేయలేక పోయేయి సార్.'

''అని నువ్వంటావు అతనుఏంఅంటాడో తెలుసా 'హాటినించే తనకి అయిదేళ్ళ క్రిందటే రావలసిన వాతం యిన్నాళ్ళదాకా రాకుండా

నర్సింగ్ హోం

వుంది ఇంత ఆలస్యంగా వొచ్చినా ప్రాణం తీయకుండా ఉంచింది' అంటూ ఆ విధంగా చెప్పుకుని తృప్తి పడ్డాడు. జరిగే సంఘటనలో కాదు, దానికి మనం యిచ్చుకునే వ్యాఖ్యానం బట్టి ఉంటుంది మన మానసిక స్థితి వొక చిన్న ఉదాహరణ చెబుతాను. నాకు తెలిసిన వొక లెక్చరర్ ఉన్నాడు అతనికి చాలా మీదకు వొచ్చేయాలి అన్న కోరిక ఉంది. కాని ఆ కోరికకు తగిన కృషి చేసే వోపికా, శక్తీ యీ రెండూ లేవు. అలాంటి మనిషికి ఎవరో 'మీరు నీలం రాయి పెట్టుకోండి, చాలా వృద్ధిలోకి వస్తారు, మీకు ఎప్పుడూ మంచి జరుగుతుంది' అన్నారు.

ఇతను నీలం కొనుక్కుని పెట్టుకున్నాడు ఈ రాయి గురించి అనేక రకాలైన నానుడులు ఉన్నాయి ఇవి మనిషిని తీసుకు వెళ్తే తల తిరిగే ఎత్తుకు తీసుకు వెళుతుందనీ, పడేస్తే యిక మళ్ళీ కోలుకోలేని విధంగా పడేస్తుందనీ దాన్ని గురించి తెలిసినవాళ్ళు అంటూంటారు ఇతను పెట్టుకోగానే అతని జీవితంలో వొక విచిత్రమైన సంఘటన జరిగింది అతని యింటికి ప్రక్కన ఉన్న బిజినెస్‌మేన్‌కి మరొకరికీ మనస్పర్థలు వచ్చి, వొకరికి మరొకరు బుద్ధి చెప్పుకోవాలి అన్నంత వరకూ దారి తీసింది. వొకరోజు రాత్రి యితని యిల్లే బిజినెస్‌మేన్ యిల్లనుకుని నలుగురూ ప్రవేశించి కత్తులతో వొళ్ళంతా హూనంచేసి పోయేరు. ఇంకెవరు ఆ స్థానంలో ఉన్నా నీలంనించే అనేవారు. ఇతను మాత్రం ఆ రాయి పెట్టుకున్నాను కాబట్టే ప్రాణంతో అయినా ఉన్నాను లేకపోతే చావవలసినవాణ్ణే, అని అన్నాడుట ఏం చేస్తాం చెప్పు? అలానే మన మేనేజరూ! దీనికి తోడు ఇంకో సంగతి తెలుసా అతను యింటి దగ్గర హోమియోపతీ చేస్తాడు విచిత్రంగా లేదూ!"

'సార్! ప్రతీ రిటైర్డైన వారు హోమియోపతీ అంటాడు యీ కాలంలో.' "భుక్తి గడవడానికి ఏదో వొకటి అనాలిగా. అరవై ఏళ్ళు వచ్చింతరువాత వీళ్ళు పోస్టల్ ట్యూషన్ తీసుకుని అప్పటిదాకా మిష్టర్‌గా ఉన్నవాళ్ళు డాక్టర్ అని బోర్డు వేసుకుంటారు. అప్పటినించి వాళ్ళు హోమియోపతీ డాక్టరు అదీ వీళ్ళు హోమియోపతికి యిచ్చే గౌరవం. దానికి అయిదేళ్ళ కోర్సు వుందనీ, ఎంతో అనుభవం అంటూ అవసరం అని అనుకోరు. ఒక ఆరువారాల పోస్టల్ ట్యూషన్ తీసుకుంటే చాలు అంటారు ఆ ట్యూషనూ విజ్ఞానం గురించి కాదుట డిగ్రీ గురించి వొక రిజిస్ట్రేషన్ నెంబరు గురించి. మనదేశం యీ స్థితికి దిగజారింది. దేనికీ పనికిరాని వాడు స్వతంత్రం ఆ మాత్రం మందులు యిచ్చుకుని బతకలేడా ఏంటి? అంటారు. దేన్నయితే నోబెల్ ప్రొఫెషన్ అంటారో, ఏ వృత్తి తెలివితేటలున్న కొద్దిమందికే వొకప్పుడు చెందిందో దానికి యీ రోజు కావలసింది– వొక వందో రెండువందలో పెట్టుబడి ఆ డిగ్రీ తీసుకుని డేంజరస్ మందులు కూడా వాడేయొచ్చు బాగయితే మంచి హస్తవాసి అనుకుంటాడు పేషంటు. చస్తే నా దురదృష్టం అని అనుకొనే దేశం మనది ఇక్కడ ప్రాణాలతో ఆడుకోవచ్చు. మనిషి తన అజ్ఞానంతో తీయొచ్చు కూడా! దానికి గవర్నమెంటు మద్దతూ, లైసెన్సూ."

'అవునుసార్. యిక్కడి ప్రజలకు ఏం.డి అన్నా ఎం బి బి యస్ అన్నా అర్థమే తెలియదు సార్'

'ఎలా తెలుస్తుందోయ్? పోస్టల్ ట్యూషనువాళ్ళు ఏటు జెడ్ డిగ్రీలు యిస్తారు అవి అక్షరాలు బోర్డుమీద చూసి ప్రజ చూసేందుకు అలవాటుపడి ఉంటే, ఎంబిబియస్ అక్షరాలకూ, ఏండీ అక్షరాలకు విలువంటూ ఏం ఉంటుంది?'

'అవునుసార్'

ఇంతలో కాఫీ టిఫినూ వొచ్చింది. 'తీసుకో' అన్నాడు విశ్వం. టిఫిన్ తీసుకుంటూ ంటే విశ్వం వొక యిడ్లీ పూర్తిచేసి కాఫీ తాగుతూ 'డాక్టర్ మనకు యిప్పుడో ప్రాబ్లం వొచ్చింది'

'చెప్పండి?' అన్నాడు రాజా

'మన మేనేజర్ యిప్పుడు లేడు అతను తిరిగి వొచ్చేదాకా మన నర్సింగ్ హోంకి మేనేజర్ అంటూ కావాలి. నువ్వు ఎలాగూ యిక్కడే ఉంటావు తొమ్మిదిన్నర మంచి. వొకగంట మొదలు వచ్చి నువ్వు కొంచెం...'

'అలాగేసార్' అన్నాడు

'రాజా నువ్వు నాకు ఫేవర్‌గా యీ పని చేయొద్దు. నేను మానేజర్‌కి నెలకి నాలుగు వందలు యిచ్చేవాడిని. ఆ డబ్బు నువ్వు తీసుకోవాలి'

'అతను వొచ్చేదాకా నేను చూస్తానుకాని నాకు డబ్బు వద్దు.'

ధర్మ పథం

యథా మాతా తథా సుతా

— బులుసు వెంకటరమణయ్య

తండ్రి గొప్ప విద్వాంసుడయినా, కుమారుడు విద్యావిహీనుడు కావడం కానవస్తున్నది. దీన్నిబట్టి "పండితపుత్రుడు" (శుంఠ) అనే పేరు ప్రఖ్యాతికి వచ్చింది. కాని, సాధారణంగా తల్లి దుష్టురాలైతే కుమార్తెకున్నూ ఆ గుణం రావడం కానవస్తున్నది తల్లి ఉత్తమురాలయితే పుత్రిక కూడా తరచుగా ఉత్తమురాలై ఉంటుంది.

కైక దశరథుణ్ణి కోరిన వరాలు రెండు భరతుడికి పట్టాభిషేకం చెయ్యడం ఒకటి: రాముణ్ణి అడవులకు పధ్నాలుగు ఏళ్ళ వనవాసానికి పంపడం రెండూ. దశరథుడు వింత ప్రార్థించినా ఆమె పట్టుదల విడవలేదు ఆడిన మాట తప్పకూడదని నిర్బంధించింది దశరథుడు మూర్ఛపోయాడు

రాజాజ్ఞ ననుసరించి రాముణ్ణి అక్కడికి తీసుకువచ్చిన మంత్రి అయిన సుమంత్రునికి ఆమెపై కోపం వచ్చింది. అతడు "అమ్మా! నువ్వు కానిదానవమ్మా! నీ తల్లికి తగిన కుమార్తెవు" అంటూ ఇలా చెప్పాడు—

"నీకు తెలుసునో, తెలియదో కాని, నీ తల్లి నీ తండ్రి ప్రాణాలకే విసరు పెట్టింది. మీ తండ్రి ఒక మహాముని వల్ల మృగపక్షి భాషలూ, కీటక భాషలూ తెలుసుకున్నాడు. ఆ ముని మృగపక్షి కీటకాదులు ఏమి మాట్లాడుకున్నది నీవు ఎవ్వరికీ చెప్పకూడదు. అలా చెప్పినట్లయితే నీ తల పగిలి నీ ప్రాణం పోతుంది సుమా!" అని హెచ్చరించాడు. "సరే, నే నెవ్వరికీ చెప్ప"నని ఆయన అన్నాడు.

ఒకప్పుడు కేకయరాజు భార్యతో కూడా తన గదిలో కూర్చుండి మాటలాడుచుండెను. దగ్గరలో చీమలు పోవుచు, ఏమేమో మాటలాడుకొనుచుండెను. ఆ మాటలకు రాజునకు నవ్వు వచ్చెను. అతడు కారణంలేక ఎందుకు నవ్వినదీ చెప్పవలెనని నీ తల్లి నిర్బంధించెను. "ఆ సంగతి చెప్పినచో నేను తల పగిలి చత్తును" అని రాజు అనెను! ఏమయినను సరే, ఆ సమాచారము చెప్పితీరవలెనని ఆమె పట్టుపట్టెను. నీ తండ్రి ఆమె నేవగించుకొని విడువవలసి వచ్చెను. ఈ విధంగా నీ తల్లి భర్త ప్రాణాలమీదికే తెచ్చినది. నీవున్నూ మొండిపట్టు పట్టి, రాముణ్ణి అడవులకు పంపుతూ, నీ భర్తకు ప్రాణాపాయం తీసుకువచ్చావు."

రాముడు అడవికి పోయిన తర్వాత దశరథుడు బ్రతికి ఉండలేదు. ఇలా కైక అనుచిత ప్రవర్తనవల్ల దశరథుడు మరణించి ఆమెకు శాశ్వతంగా అపకీర్తిని కలిగించాడు. కైకేయి "తల్లిని మించిన కూతు"రని దీని వల్ల స్పష్టమవుతూ ఉన్నది.

'నేను ఇంకెవరైనా పెట్టుకుంటే అతను డబ్బు తీసుకోకుండా పనిచేస్తాడా చెప్పు డాక్టర్ ఆ డబ్బే నీకు యిస్తే తప్పా? ఎక్కడయితే యిలాంటి త్యాగం ఉంటుందో, అక్కడ అర్పణ మనస్ఫూర్తిగా ఉండదు.'

'సరేసార్' అన్నాడు రాజా.

'ఇంకోసంగతి, నువ్వు నాకింద సబార్డినేట్ అనుకుని, ప్రతీవిషయాన్ని నాదాకా తీసుకు రాక్కరలేదు నీదగ్గ రేవాటిని పరిష్కరించేయ్ '

'సరేసార్'

'నీకు దీన్ని యింకా వృద్ధి చేసేందుకు ఏమైనా సలహాలు ఇవ్వాలని అనిపిస్తే వెల్‌కం.'

'మంచిది సార్'

ఇంతలో లాండరు వచ్చి 'సార్ ఎవరో డాక్టరుగారికి స్కూటర్ ఆక్సిడెంట్ అయిందట, స్ట్రెచ్చర్ మీద తీసుకొచ్చేరు అతను అందర్నీ హడలగొట్టేస్తున్నాడు.'

'వస్తున్నా' అంటూ కదిలేడు విశ్వం.

విశ్వం వెళ్ళేటప్పటికి వొక యిరవై అయిదేళ్ళ వ్యక్తి స్ట్రెచ్చర్‌మీద పడుకుని 'అమ్మో —య్యో' అంటూ అరుస్తూ మూల్గుతున్నాడు.

విశ్వం వెళ్ళి 'గుడ్ మార్నింగ్ డాక్టర్' అన్నాడు.

'గుడ్‌మార్నింగ్' అని 'సార్ నా ఎముక లన్నీ విరిగిపోయినట్లున్నాయి. వొంట్లో ఏ భాగాన్నీ కదపలేక పోతున్నాను.'

'ఎట్లా అయింది— యాక్సిడెంటు ?' అన్నాడు విశ్వం.

'మీ నర్సింగ్‌హోం ఎదురుగుండా సార్! సైకిలువాడు సందులోంచి యమస్పీడులో రోడ్డుమీదకు వచ్చేడు. వాడ్ని తప్పిద్దామని అనుకుంటే స్కూటర్ కంట్రోల్ తప్పి సారుకు గుద్దేసింది సార్. ఎవరో మీ నర్సింగ్ హోంనించి స్ట్రెచర్ పంపించేరు.'

'దానిమీద ఎవరు పడుకోబెట్టేరు?'

'వొక ఆరుగురు కలసి సార్' అన్నాడు.

విశ్వం ఆ కుర్రడాక్టర్ని పరీక్షించేడు. అయిదు నిమిషాలు తర్వాత 'ఎక్కడా ఫ్రాక్చర్ లేదయ్యా, లేచి కూర్చో' అన్నాడు.

'నిజంగానా సార్!' అంటూ సంతోషంతో లేచి కూర్చొని 'ఎక్కడ ఎముకలు విరిగి పోయేయో అని బయంతో బిగతీసుకుపోయేను సార్' అంటూ నిలబడి నమస్కారం చేస్తూ 'వేను వెళ్తాను' అన్నాడు.

'ఇంజక్షను టిటిసెన్ తీసుకోండి' అన్నాడు విశ్వం

'నా క్లినిక్‌లో తీసుకుంటాను సార్' అంటూ నర్సింగ్‌హోం నించి బయటికి వచ్చి అక్కడ పార్కుచేసి ఉన్న తన స్కూటరు స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయేడు.

'అబ్బ ఏం చాదస్తపు డాక్టరు కుర్రాడు. సర్జన్ ఎముకలు విరగలేదు అని చెప్పేదాకా అలా వొంట్లో ఏ భాగాన్నీ కదపకుండా ఉంచేడు' అని నవ్వుకుంటూ బెల్ కొట్టేడు తర్వాత కేసు పంపమని.

డాక్టర్ రాజా తన గదిలో కూర్చొని ఆలోచిస్తున్నాడు. ఈ నర్సింగ్‌హోంకి యిన్నాళ్ళూ మేనేజ్‌మెంటు అంటూ లేదు. ఆ మేనేజరు జీతం తీసుకునేందుకే తప్ప యింక దేనికీ పనికిరాడు.

తను కొద్దిమంది దగ్గరనించి విన్నాడు యిక్కడ స్టాఫ్‌కి కోఆపరేషన్ అంటూ లేదని. అదొక్కటి సరిచేస్తే యింకేం పని ఉండదు అనుకుని, యిన్నాళ్ళూ తను యీ నర్సింగ్‌హోంని పూర్తిగా చూడలేదు. ఇవాళ చూద్దాం అని బయలు దేరేడు.

(ఇంకా వుంది)

డాబా మీద పక్కలేసుకున్న మిత్రులింకా నిద్రపోనేలేదు, నడిజాము దాటినా! వూరికే ఆకాశంవంక చూస్తూ ఎవరి ఆలోచనలో వాళ్ళున్నారు, ఆ వెన్నెల సోయగాన్నైనా ఆస్వాదించకుండా.

యెంతసేపయిందో వాళ్ళు కబుర్లు చెప్పుకోవడం మాని. మాటలు మరిచిపోయినట్లు, కాలం ఆగిపోయినట్లు — కదలక మెదలక శిల్పాల మాదిరిగా వుండిపోయినారు! చల్లని కాంతిని సుతారంగా చల్లుతున్నట్లున్న చందమామ కానీ, మినుకు మినుకు మంటున్న చుక్కలు గానీ వాళ్ళనేమాత్రవూ రంజింపచేయటంలేదు.

డాబా చుట్టూరా చెట్లు — విరబోసుకున్న పట్టులాంటి జుట్టు అలలుగా కదిలినట్లు — గాలికి నిదానంగా కదులుతున్నాయి.

ఓ పక్కనుంచి సంపెంగ పూవులు వాసనల్ని విరజిమ్ముతున్నాయి. అంతెత్తున రాక్షసిలా పెరిగిన వేపచెట్టు శాఖలు డాబామీద వొంగి, చాలాభాగం వెన్నెలని కబళించి నీడ నిస్తూ వూగుతున్నాయి. గాలి వీచినప్పుడల్లా గల గలా కదిలి గుత్తులు గుత్తులుగా పండుటాకులు రాలి డాబా మీద పరుచుకుంటున్నాయి...యెంతటి వేసంకాలమైనా అంత చక్కటి వాతావరణంలో ఆ డాబా మీద మేను వాలిస్తే మనసలా తేలిపోతుంది.


యింకెప్పుడన్నా ఐతే సుందరం చాలా ఆహ్లాదకరంగా వుండేవాడే, ఆ ప్రశాంతతకి. కానీ పొద్దుటిబట్టీ అతను సీతయ్య గురించే ఆలోచిస్తున్నాడు, తెంపు లేకుండా ... తన ప్రయత్నమెట్లానూ ఫలవంతమైతుంది. కానీ అది ఎంతవరకూ సబబు? స్నేహితుడి సంతోషానికి తను సైంధవుడి మల్లే ప్రవర్తిస్తున్నాడావి గుంజాటన. అక్కడికి వీలుచిక్కిన ప్రతిక్షణం విడమరిచి మాట్లాడుతూనే వున్నాడు సీతయ్యతో. అతడు కొత్తగా మారిపోయిందేమీ లేదు. అప్పటి మనిషే. వొచ్చిన తేడా అల్లా వయసు వేడిగా వాడిగా పదును తేరటమే...

"మీరిద్దరూ ఇట్లా కలిసుండటం ఏం బాగాలేదు" అన్నాడు సుందరం చిట్టచివరికి, ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

"ఎవరికి బాగాలేందీ ?"

"ఎవ్వరికీ్కాడాను..."

"అయ్యో... యెందు కట్లాను. మేవంత కష్టాల్లో లేవే ? ... హాయిగా



సంతోషంగా వుంటేను! మేవుఁ సఖ్యంగా వుంటుం అందరికీ రుచించటం లేదన్న మాట. ఐనా యవ్వరికో అసౌఖ్యమైతే మాకేమిటి లెద్దూ..."

"నీ చుట్టూవున్న సొసైటీ యేమను కుంటుంది ?"

"యావన్నా అనుకోనీ ... సొసైటీని సంతోష పెట్టడం కోసమా యేమిటి మనం ?"

"కాదేం ? మనం పది మంది మధ్యా మసలటం లేదూ"

"అట్లాగైతే పది మంది మధ్యా మసలటం మాని, యెక్కడో వూరి చివరకు వెళ్ళి మసిలితే అప్పుడు అందరికీ బావుంటుందా ?"

"కనీసం పెళ్ళి చేసుకుందావన్న ఆలోచనైనా వచ్చుండాల్సిందేనే."

"తనకిష్టం లేదు"

"యెందుకట్లా – పెళ్ళి చేసుకోకుండా యేం చేద్దామని ? సంసారం, భర్తా, సుఖ శాంతులూ అక్కరేదూ ?"

"ఇప్పుడు వాటికేవీఁ లోటు లేదను కుంటోందేవోఁ..."

"మవ్వు భర్త వెట్లాగవుతావు ?"

"ఏం ? నాలో లోపం ఏం చూశావు" అంటూ పక్క మీదనుంచి లేచాడు సీతయ్య. దాహమైనట్టుంది. తలగడ ప్రక్కనున్న మరచెంబు తీసి – గ్లాసులోకి నీళ్ళు వంపు కొని తాగాడు. మళ్ళీ వచ్చి పక్కమీద వారిగాడు.

"లోపం లేదులే – పెళ్ళి చేసుకోకుండా భర్త వెట్లాగవుతావని ?"

"భర్తని కాకపోతే ప్రియుణ్ని! చాల దేవిఁటి ?"

"యిట్లాంటి సంబంధం యావన్నా బావుందా అసలు ?"

"బాగోకేం..." కాసేపాగి అన్నాడు మళ్ళీ, "మనం మాటాడుకోడానికి ఇంకేవీఁ లేదా ? ఏవన్నా కబుర్లు చెప్పరాదూ ? అంత దూరం నుంచి వొచ్చావు. యిట్లాంటి వ్యర్థపు మాటలతో సమయాన్ని వృథా చేయడం దేనికి ?"

"వ్యర్థపు మాటలన్నమాట"

"కాకపోతే వుపయోగ నేఁవిటి ?... నువ్వెంత చెప్పినా నేను మారేవాడినా ?"

"అంటే ?"

"పోనీ లోకానికి వెరవొద్దు. తల్లిదండ్రు లన్నా లెఖ్ఖలేదా?"

"ఎందు కనుమానం? ఏప్పుడూ కూడా అట్లా ప్రవర్తించనిదే నేను."

"ఇది వాళ్ళను క్షోభ పెట్టదాని?"

సీతయ్య మాట్లాడలేదు. మళ్ళీ నిశ్శబ్దం.

సీతయ్య పేరు మాత్రమే అట్లా–ఎవరో పల్లెటూరి ఆసామిని స్ఫురణకు తెస్తుంది కానీ – ఆతనైతే చాలా నాజూకు మనిషి. అతన్ని చూసి ఎవరైనా అసలు వయసుకన్నా ఐదారేళ్ళు తక్కువ చేసే లెఖ్ఖ కడతారు. సుందరం సరిగ్గా అందుకు భిన్నమైనమనిషి. పంతొమ్మిదవ యేటనే అతనికి పెళ్ళయింది. ముగ్గురు పిల్లల తండ్రి. పెద్దమనిషితరహాగా వుంటాడు. యిద్దరూ ముప్ఫయికి దగ్గర పడ్డవారే అయినా– యిద్దరి మధ్యా బోలెడు అంతరం కనిపిస్తుంది.

చాలా మంచి స్నేహితులు. బాల్యంనాటిది ఆ స్నేహం. వారి మనస్తత్వాల్లో వైవిధ్యం అధికం. ఆలోచనా పరిధిలో సామీప్యం బహు స్వల్పం.

సుందరం సొంత ఊర్లోనే స్థిరపడ్డాడు. సీతయ్య ఉద్యోగరీత్యా పట్నంరావాల్సివచ్చింది.

చాలాకాలం తరువాత వచ్చాడు సుందరం. సీతయ్యను చూసిపోదామనే కాదు అతనేవో విర్రాకాలు పోగిస్తున్నాడని సీతయ్య తల్లి, దండ్రులు మొత్తుకుంటోండగా విని, అదేవిటో కళ్ళారా చూసి, కాస్త హితబోధ చేద్దామని వచ్చాడు. అతడు ప్రాక్టికల్ మనిషి. అనుమానం వొస్తే అంతే ఇక. ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించి— అప్పుడే దానికి యేర్పాట్లుకూడా చేసి వొచ్చాడు. ఒకవేళ తను విన్నది నిజం కాకపోయినా తను తీసుకున్న చర్యవల్ల అతని కుటుంబానికి వుపయోగవేఁ కానీ నష్టం వుండదు.

ఆ అమ్మాయి పేరు సరోజట. ఆపిల్లను చూసి, యెంత ప్రయత్నం చేతనూ దురభిప్రాయం కలిగించుకోలేకపోయాడు సుందరం. చాలా ముచ్చట వేసింది. సీతయ్యకి చక్కగా యీడైన పిల్ల. నమ్రత, మర్యాద, మన్ననా తెలుసును. అందరితోనూ పరిచయంగా మాట్లాడుతుంది. అనవసరపు సిగ్గులూ, వగలూ వంటి మిడిమేలపు వేషాలేవీఁలేవు. విడిగా వీట్లా వుంటారోకానీ— తన ముందు మాత్రం— మంచి స్నేహితులమల్లేనే ప్రవర్తించారు. మూడో వ్యక్తి ముందు తమ గొప్ప ప్రేమని బహిర్గత పరిచేందుకు పరాచికాలేవీఁ ఆడుకోలేదు!

ఇదీ ప్రేమే!

అతనొచ్చి రెండ్రోజులే ఐంది. సీతయ్య ప్రాణ స్నేహితుడే ఐనా సరోజ ముందు మాత్రం చాలా సంకోచపడ్డాడు. కానీ అది కొద్ది గంటలే. కలివిడిగా మాట్లాడి సంకోచం పోగొట్టింది.

... గాజుల చప్పుడైంది. ఏవరో మెల్లెక్కి వస్తున్నట్లు అలికిడి. ఆ ఒస్తున్నది సరోజే అని విశదమైంది, ఇద్దరికీను. ఆ అమ్మాయితో వివరంగా మాట్లాడాలనుకున్నాడు సుందరం. లేచి కూర్చున్నాడు.

సీతయ్య ప్రక్కన వొచ్చి కూర్చున్నది సరోజ.

"అబ్బబ్బ, ఈ దోమలు విసుగూ విరామమూ లేకుండా చంపేస్తున్నాయి. నిద్ర రావటంలేదు !...యింకా మీరు కూడా మెలుకువతో వున్నారేం" ... యెవ్వరూ సమాధానం చెప్పకపోయేసరికి తనే మాట్లాడింది మళ్ళీని,

"మీ వూరి కబుర్లేవన్నా చెప్పండి సుందరంగారూ"

యెంతచక్కగా, స్వచ్ఛంగా మాట్లాడుతోంది—అనుకుని పైకి "ఊఁ" అన్నాడు సుందరం.

"మీరు రాసిన ఉత్తరం అందిందటవా మీ వాళ్ళకి" సీతయ్యని అడిగింది.

"యేమో"

"యితగాడు కనీసం క్షేమసమాచారమైనా వ్రాయడని మొత్తుకుంటారమ్మా వాళ్ళు" ఫిర్యాదు చేశాడు సుందరం.

"మీరు రావటానికి రెండురోజుల ముందు చాలా పెద్ద వుత్తరం వివరంగా వ్రాశారు. అది అందిందో లేదో ?"

"యేవిఁటి, వివరాలు ?"

"అదే, వాళ్ళ అమ్మా నాన్నా యెట్లాగూ పెద్దవారైపోయినారుగదా. వాళ్ళను ఆదరించాల్సిన ధర్మం తనదే. చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు కూడా చేయాలాయెను. యింకా అక్కడ వుండి చేసేదేముంది — యిక్కడికొచ్చేయమని వ్రాశారు."

సుందరం ఆశ్చర్యపడ్డాడు.

"యిక్కడ వుండటానికి వాళ్ళు వొప్పుకోవద్దా ?"

"యేవో, వాళ్ళకి వేరేయిల్లు తీసుకుంటారట"

"రెండిళ్ళా ... వాళ్ళు వూరుకుంటారనే మీ నమ్మకం ?" కాసేపాగి అన్నాడు మళ్ళీని, "పోతే బాధ్యతలు తీర్చుకోవాలన్న చింతన వుందన్నమాట వీడికి... చూడమ్మా నీతో కాస్త వివరంగా మాట్లాడాల్సింది యేమనుకోవు గదూ."

సరోజ మాట్లాడలేదు. ఆమె కర్థమైపట్టుంది, దించిన తల యెత్తలేదు.

"తెగింపుచేసి యిట్లా వుంటున్నారు సరే. భవిష్యత్తు గురించి యేవన్నా ఆలోచిస్తున్నారా ?"

చాలాసేపటికి గొంతు పెగుల్చుకుని అంది, "రేపటి సంగతి ఆలోచించాలన్న వుద్దేశం లేనిదే అసలు !... యిప్పటికిట్లా హాయిగా వుంటున్నాం అంతే. భవిష్యత్తు గురించి ఆలోచిస్తే ఈమాత్రం నిశ్చింత వుంటుందా? ...యెవరూ హర్షించరని తెలుసు నేను దెబ్బలు తినీ తినీ బండబారాను. లోకాన్ని లెక్క చెయ్యని తనం చిన్నవిషయమైపోయింది.

"పెళ్ళి చేసుకుని ధైర్యంగా బతకొచ్చునే..." అతనట్లా అడగటంలో నిజాయితీ యేమీ లేదు.

"యిప్పుడు మీరింత దూరం ప్రయాసపడి వొచ్చి — యెందుకింత యిదవుతున్నారో, అందుకే ఆ ధైర్యం లేకపోయింది."

"అర్థం కాలేదు. వాడు యేబాదర బందీ

ఆరల్ సముద్రం ఉల్కాపాతం వల్ల ఏర్పడిందా ?

4 కోట్ల సంవత్సరాల క్రితం మధ్యాసియా ప్రాంతంపై బ్రహ్మాండమైన ఉల్కాపాతం వల్లగాని, గ్రహ పాతంవల్లగాని ఆరల్ సముద్రం ఏర్పడింది. సోవియట్ విజ్ఞానశాస్త్ర పరిషత్ భూగర్భశాస్త్ర సంస కు చెందిన ఆచార్య ఓలెగ్ బోరిసోవ్ ఈ శాస్త్రీయ వూహాగానం చేశారు

సముద్ర గర్భంపై జరిపిన భూభౌతిక పరిశోధనలు, వ్యోమ తలంనుండి తీసిన ఛాయా చిత్రాలు సమకూర్చిన వివరాలు ఆధారంగా యీ వూహాగానం చేయబడింది. ఉల్కా పాతంవల్ల పడిన గుంట మూలంగా ఆరల్ సముద్రం రూపుదాల్చినట్లు కన్పిస్తున్నది. కొద్ది సెకనుల పాటు కలిగిన అత్యంత శక్తివంతమైన వత్తిడి మూలంగా కఠిన శిలలు నుగ్గు నూచమైపోగా యీ పెద్ద గుంట ఏర్పడినట్లు తోస్తున్నది. సముద్రతలం రూపాన్ని పరిశీలిస్తే ఉల్క, లేదా గ్రహం గాలిలోనే పేలిపోయి కొన్ని లక్షల టన్నుల బరువుగల శిలా పదార్థం పతనం వల్ల యీ సముద్రం ఏర్పడి వుండవచ్చునని తోస్తున్నది. ఆరల్ సముద్రతలంలో కన్పించిన నొక్కివేయబడ్డ కఠిన శిలలవంటివే, యీ సముద్రం నుండి 700 కిలోమీటర్ల దూరంలో వున్న ప్రాంతంలో కూడా కన్పించాయని బోరిసోవ్ టాస్ విలేఖరికి తెలిపారు.

పేద ప్రజల కలలు ఫలించాయి



శ్రీమతి ఇందిరాగాంధి (ప్రధాన మంత్రి)

9 నెలల స్వల్ప కాలంలోనే ముఖ్య మంత్రి శ్రీ టి. అంజయ్య, ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని కీ.శే. సంజయ్ గాంధీ 5 సూత్రాల కార్యక్రమాన్ని అమలు జరపడానికి తీసుకున్న చర్యల కారణంగా పేద ప్రజలు కన్న కలలు ఫలించి వాస్తవ రూపాన్ని దిద్దుకున్నాయి. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి వివిధ చర్యలు తీసుకోవడం ద్వారా ఆంధ్ర ప్రదేశ్‌ను పటిష్టమైన, సౌభాగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని శ్రీ అంజయ్య కృతనిశ్చయంతో కృషి చేస్తున్నారు.



శ్రీ టి. అంజయ్య (ముఖ్యమంత్రి)

ఆయన సారథ్యంలో రాష్ట్రంలోని పేద ప్రజల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు జరుపుతోంది. వాటిలో కొన్ని ఇవి :

1. పంచాయతీరాజ్, స్థానిక సంస్థల ఎన్నికలు.
2 గుడిసెల భీమా పథకం.
3 పంటల భీమా పథకం.
4 వ్యవసాయ కూలీలు, చిన్నకారు రైతులకు వృద్ధాప్య పింఛను పథకం.
5. జూరాల, పోలవరం ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం.
6 రైతులకు రికార్డు స్థాయిలో రుణాల పంపిణీ
7. పేదలకు ఉచిత న్యాయ సహాయం
8. కరువు బాధిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికపై మంచినీరు, పశుగ్రాసం సరఫరాకు ఏర్పాట్లు.
9 వికలాంగులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలు.
10. ఇళ్ళు లేని వ్యక్తులకు ఇళ్ళస్థలాల పంపిణీ.
11. ప్రజలకు కిరోసిన్, చక్కెర, ఆహారధాన్యాలు, సిమెంటు సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు.
12 రాష్ట్రంలో సత్వర పారిశ్రామికీకరణ
13. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉచిత చర్యలు.
14 జర్నలిస్టుల ట్రస్టు ఏర్పాటుకు చర్యలు.
15. జాతీయ సమైక్యతా మండలి ఏర్పాటు.
16. "జీనెతాలీసి" ట్రస్టుకు పదివేల రూపాయల సహాయం.
17. ఉర్దూ ఆస్థాన కవి పదవి ఏర్పాటు ద్వారా ఉర్దూ భాషకు ప్రోత్సాహం.
18. హైదరాబాదు పాత నగరం సర్వతోముఖాభివృద్ధికి అభివృద్ధి మండలి ఏర్పాటు.

శ్రీమతి ఇందిరాగాంధీ ఆశీస్సులు, మార్గదర్శకత్వం లభిస్తున్న శ్రీ టి. అంజయ్య నాయకత్వంలో దూరదృష్టితో కూడిన విప్లవాత్మకమైన అనేక పథకాలను యిదివరకే అమలు జరపడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఉజ్జ్వల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి బాటలు వేశారు.

డైరెక్టరు, సమాచార, పౌర సంబంధశాఖ, హైదరాబాదు. DIPR No. 25514/Advt/CI-3/81

లేని స్వతంత్రుడైతే నాకీ గుంజాటన లేక పోను''

"సరిగా నేను ఆలోచించిందీ అదే. పెళ్లి కెదిగిన చెల్లెళ్ళున్నారు. అన్నయ్య యిల్లాంటి వాడని తెలిస్తే సంబంధాలు రావేమోననేగా మీ భయం. మరి మేవుఁ కులాంతరవివాహం చేసుకుంటే- అప్పుడైనా యిబ్బందేగా."

"ఇన్ని సమస్య లున్నాయని ఆలోచించ వలిగినప్పుడు యింతవరకూ రానివ్వకుండా వుండాల్సింది."

"ఆ జాగర్త పడాల్సింది వాళ్ళ పెద్ద వాళ్ళే. వయసొచ్చిన ఆడపిల్లల్ని వదిలించు కుందామనే కాని, మగపిల్లాడిక్కూడా పెళ్లి అవసరవని తెలుసుకోరెందుకో."

"వాళ్ళు తెలుసుకోలేక పోయారు కాబట్టి, ఋటాా చేయడవేఁ''

"అలాగని కాదు. ఎక్కువమంది తెగించ లేరు తను చేసిందదే. ఇప్పటికి మాత్రం మునిగిపోయిందేముంది? వాళ్ళ కుటుంబా న్నుంచి ఆయన్ని దూరం చేయాలన్న దుర్మార్గపు ఆలోచన లేదు నాకు. అట్లా ఆలోచించిన దాన్నయితే పెళ్ళే చేసుకునే వాళ్ళం."

"అక్కడ వాళ దిగులంతా వీడి గురించే. ఈ విషయం వాళ్ళకెటాగో తెలిసింది. పెద తనంలో వాళకీ అశాంతి యేవిటిపాపం! సాధ్యవైనంత వేగంగా పెళి చేసేయాలను కుంటున్నారు. నీ అభిప్రాయం యేవిటి?''

సరోజ మాట్లాడలేదు. కళ్ళు విలిపి చూపిందతన్ని. గుండెలో నిదానించి ఓ అగ్ని పర్వతం బద్దలవుతోంది తలతిప్పి సీతయ్యను చూసింది. అతనెప్పుడో నిద్రలోకి జారి పోయాడు. కుడి మోచేయి తల క్రింద పెట్టుకుని విడమచేతో ఆమె ముంజేతి గాజులను సవరిస్తున్నట్లు అతని వేళ్ళు.

ఆ క్షణంలోనే ఫెళాఫెళామని ఆలోచనలు.

యేవిటి జరగబోతోంది? తన చెలికాడు దూరమైతుడా? నిజమేనా? ఇదొక పరీక్షా?

అవును-అతనికి తనెంత ప్రాణమో, తన తల్లి దండ్రులూ, చెల్లాయిలూ... అంతే! తను బ్రతగ్గలదా? ఇక యీ బంధం యింతేనా?

ఆలోచనల ఉధృతి తగ్గనే లేదు.

"అడ్డు పడేందుకు నాకు హక్కేది. ఆ యింటికో కోడలు కావాలికదూ మరి''

ఇదీ ప్రేమే!

తడబడుతూ అన్నది. పెదిమలు వణుకు తున్నాయి. వొక్కి పడుతోంది.

సుందరం ఆమె మొగం చూడలేక పోయినాడు. అతనికి తెలుస్తోంది ప్రతిధ్వని

"వాడి కిష్టమైనా కాకపోయినా-వాళ్ళు వాళ తృప్తికోసమైనా పెళ్ళికి వప్పుకుంటా డన్న నమ్మకం వుంది. నీకు అన్యాయం జరుగుతోందని వ్యధ పడొచ్చు కానీ ఇది అతని ధర్మం కదా...''

"తనతో మాట్లాడేరా మరి?''

"ఇంకా లేదు. నీ గురించే ఆలోచిస్తున్నా నమ్మా. నీ సంగతులేవీ తెలీవు నాకు. తల్లి దండ్రులు ఎక్కడున్నారో యేవిటో- నీ సమస్య లేవిటో యేవీ చెప్పలేదు వాడు. తర్వాత యేం చేస్తావో మరి?''

"చేద్దామనుకున్న ప్రకారం జరగవు కదండీ. ముందే చెప్పలేదూ-రేపటి గురించి ఆలోచన లేదు. ఏం జరిగినా యింతకన్నా ఉపద్రవం ముంచుకురాదు. యెప్పటి మల్లేనే తెల్లారుతుంది సూర్యోదయవూఁ, మిట్ట మధ్యాహ్నవూఁ, సాయంకాలవూఁ, చుక్కలూ, చందమామా- అంతా చాలా సహజంగానే జరుగుతాయి. అంత సహజంగానే యీ కష్టాలూను.

"... ... ...''

"నిద్రొస్తోంది. ఇంక వెళ్లి పడు కుంటాను'' లేవబోయింది.

"ఇంకొక్క సంగతి విని పోదువుగాని వొక్క నిముషం''

అక్కడుండి నిగ్రహించుకోవడం కష్టంగా వుంది ఆమెకు.

"రేపు మధ్యాహ్నం బండికి వెళతాన్నేను'' అన్నాడు తను చుక్కల్ని చూస్తూ.

"... ... ...''

"నువ్వు నన్ను మన్నించాలమ్మా- వీడి సుఖసంతోషాలే గాక- కుటుంబ ప్రతిష్ట గూడా ముఖ్యవేఁ గనుక- తప్పనిసరైంది''

సుందరం సరిగా చెప్పలేకపోతున్నాడు. అంత వరకూ సవ్యంగా మాటాడిన వాడల్లా యిప్పుడు బిగుసుకుపోయాడు.

"చె.. ప్పం... డి.''

"యేంలేదు, సీతయ్య మా వూరు వచ్చేస్తున్నట్టే. తప్పదు ... వాళ్ళనీ వీళ్ళనీ పట్టుకుని అతని వుద్యోగం ... ట్రాన్స్ఫర్ చేయించాము! ... యింకో నాలుగైదు రోజుల్లో ఆర్డర్సు అందుతాయి. అతనిక తప్పించుకునేందుకు తోవలేదు'' ఆ మాట నెట్లాగో అనేసి తలెత్తి చూశాడు.

సరోజ అక్కడలేదు!

గబ గబా వెళ్ళిపోతోంది లేచి. వేగంగా మెట్లు దిగుతున్నట్లు మట్టిగాజులు గల గలా మని చప్పుడు...

...అంతే, మళ్ళీ నిశ్శబ్దం...

యెంతసేపో-అట్లాగే డాబా పిట్టగోడకు అతికించినట్లు కూర్చుండిపోయాడు. నిద్ర పట్టేటట్లు లేదు.

ఆగి ఆగి చెట్ల ఆకులు మాటాడు కోవడం తప్పించి అలికిడిలేదు.

సుందరానికి తన గుండె చప్పుడు వినపడు తోంది, ఆ శాంత వాతావరణంలో. తన అంతరాత్మ చేసే చప్పుడే తెలీకుండా వుంది; తను చేసింది ఘనకార్యవాఁ? దుర్మార్గవాఁ అది!

ప్రాస గోల

పుడమిపై జీవుడు
పడగానె గోల!

పుట్టాక యిందుకని
పరితాప మేల!

కష్టమొస్తే గోల
కాటికెళితే గోల

ముష్టికెళితే గోల
మూట కడితే గోల!

పిల్లలుంటే గోల
పిల్లకంటే గోల

డబ్బులేని గోల
డబ్బులుండి గోల!

పదవి పోయినందుకు గోల
పరీక్ష తప్పినందుకు గోల

పాపం చేశావనే గోల
యిందుకు పుట్టావనే గోల!

యిందెందు వెదికినా ఒకే గోల
అదే అదే పాడు గోల!!

— మంతెన సూర్యనారాయణరాజు

ఎదురుచూపు

కొండముది రుక్మిణీదేవి

పెద్ద కథ

(గత సంచిక తరువాయి)

4

తృళ్ళిపడి లేచిన మోహన్ అలారం గడియారం వైపు చూశాడు. ఎనిమిది గంటలు దాటింది. ఒళ్ళంతా ఏదో బరువు దించినట్లు తేలిగ్గా వుంది. చటుక్కున మాధవి గుర్తువచ్చింది. రాత్రి అన్నం తిన్నదో లేదో ? ఎక్కడ పడుకున్నదో ? పెద్దవాళ్ళ చాదస్తం కొద్దీ ఈ పది రోజులూ దూరంగా వుండాల్సి వచ్చింది కానీ ... ఆలోచిస్తూనే మేడ దిగి దొడ్లోకి వచ్చాడు. తల్లి మాధవికి కాఫీ, టిఫిను ఇస్తున్నది.

"అప్పుడే లేచావా మాధవీ ?" అనబోయాడు.

"ఇవ్వాళ ఇంత పొద్దెక్కిందాకా పడుకున్నావేం? తొందరగా మొహం కడుక్కుని రా! టిఫిను ఆరిపోతున్నది" అన్నది సుశీలమ్మ.

"మాధవిని తను పరామర్శించక్కర్లేదు. ఆమెకేం కావాలో తల్లి చూస్తున్నది" అనుకుని బాత్‌రూంవైపు నడిచాడు మోహన్ !

సుశీలమ్మ ఆదరణలో ఆ పదిరోజుల్లోనూ, తండ్రిపోయిన దుఃఖాన్ని కొంత మర్చిపోగలిగింది మాధవి.

కట్టుబట్టల్తో వచ్చింది. సుశీలమ్మ నడిపాత చీరెలు రెండు ఇచ్చి కట్టుకోమంది. పదకొండో రోజు పనిమనిషిచేత తలంటిపోయించి, పసుపురాసిన కొత్తవాయిల్ చీర, రవిక ఇచ్చి కట్టుకోమంది.

ఇదంతా మాధవికి "ఊహించలేని మలుపు"గా వుంది. రెండెకరాల కొబ్బరితోటలో, రెల్లుగడ్డి ఇంట్లో, తెల్లగిన్నెల్తో అన్నం వండుకు తిని, అరిగినా, చిరిగినా అతుకులేసుకుని కట్టుకునేది బట్టలు. అలాంటిది...ఈ మేడ, కారు, సుశీలమ్మగారి నగలు, చీరలు, ఇంట్లో ఖరీదయిన తనెప్పుడూ చూడని, తనకు తెలీని అనేక వస్తువులు. అన్నిటికి ఏకైక వారసుడు, మోహన్. అన్నిటికంటే విలువైనది పెద్దల ఆత్మీయత. ఇక్కడికి వచ్చి నప్పటినుంచి తల్లిలా ఆదరిస్తున్నది సుశీలమ్మ. ఒకటి రెండుసార్లు సీతారామయ్య కూడా పలక రించాడు. తనే ... మగవాళ్ళతో మాట్లాడటం అలవాటులేక తలవంచుకున్నది. దీనికంతటికీ మూలం మోహన్. అతని మంచితనమే తననీ ఇంటికి చేర్చింది. అంటే ... తండ్రి చచ్చిపోవటం ... బాధగా మూలిగింది ఏ మూలో ఆత్మ. తప్పుచేసినా తప్పించుకో చూసే వాళ్ళెంతమందిలేరు. మోహన్ అలాంటివాడు కాదు. ఈ ఆలోచన మనస్సును పరవశింపజేసింది. ఆ పరవశంతోనే తనీ ఇంట్లో మనిషిగా మసగ్గల్గుతున్నది. సుశీలమ్మకు ఎంతో చేయూతగా వుంది. అన్ని పన్లు తనవే అన్నంత బాధ్యత పెంచుకున్నది. ఎక్కడ చూసినా తనే అన్నట్లు కాఫీ టిఫిన్లు చెయ్యటం, ఇల్లంతా సర్దటం, దొడ్లోవున్న మొక్కలకు నీళ్ళుపోసి, సంరక్షణచేసి, బుట్టలతో పూలుకోసి దండలు కట్టటం మొదలయిన పన్లు మాధవిచేస్తే—వడ్డన, పూలమాలలు దేవుళ్ళకి అలంకరించి, ప్రసాదం పేరుతో, చిన్న దండ తన సిగమీద అలంకరించు కోవటం, సుశీలమ్మ పని.

"ఆ ప్రసాదం తనకెందుకివ్వదు?" అనుకున్నది మాధవి. "పూజ చేసినవాళ్ళే ప్రసాదం తీసుకోవాలేమోలే !" అనుకున్నది మళ్ళీ.

ఆ ఇంట్లో పనిచేస్తున్న పనిమనిషికి మాధవి ఎవరో అర్థం కాలేదు. మొదట్లో చుట్టాలమ్మాయి అనుకున్నది. తరువాత వంటకు సాయం తెచ్చు కున్నారు కాబోలు అనుకున్నది. అయినా అనుమానం తీరక, "అత్తయ్యా! అని పిలుస్తోంది. ఎవురండీ ఈమె" అని అడిగింది సుశీలమ్మను.

క్షణం తటపటాయించి, "మా మేనకోడలు, దూరం చుట్టాలమ్మాయి" అన్నది. తన ఊహకు ఆ సమాధానం సరిపోయినట్లుంది మళ్ళీ మాట్లాడ లేదు పనిమనిషి.

నాలుగు రోజుల తరువాత, ఎవరూ లేని సమయం చూసి, "చూడమ్మా! మాధవీ! ఆ పసుపుతాడు తీసెయ్ !" అన్నది సుశీలమ్మ.

ఆ మాటకు బెదురుగా చూసింది మాధవి.

"కామందావుకు తక్కువకాని సూత్రాలు ఆనవాయితీ ఈ ఇంట్లో... అదీకాక."

"ఏమిటీ మాట్లాడుతున్నావు ?" అంటూ వచ్చాడు సీతారామయ్య.

"ఏంలేదులెండి! ఏమో మామూలు సంగతులు" అయిష్టంగా చెప్పింది సుశీలమ్మ భర్తతో.

జరిగిన కథ – 1 : కాలేజీ ఆడిటోరియంలో జరిగిన వక్తృత్వ పోటీలో మొదటి బహుమతి మోహన్, రెండవ బహుమతి స్మిత గెల్చు కొంటారు. తన కారు క్రిందపడి మరణించిన సుబ్బయ్య కూతురు మాధవిని ఆ వూరి పెద్దల ప్రోద్బలంతో పెళ్లి చేసుకుని, ఇంటికి తీసుకు వచ్చిన మోహన్ను సాదరంగా ఆహ్వానిస్తారు అతని తల్లిదండ్రులు సుశీలమ్మ, సీతారామయ్య.

మాధవికి ఆ ఇంట్లోవాళ్ళ మనస్తత్వం పూర్తిగా అర్థం కావటంలేదు. తనను ఆప్యాయంగానే చూస్తున్నారు. తనూ ఆ ఇంటి మనిషిగానే, మసలుతున్నది. మరి... మరి... మోహన్‌తో మాట్లాడనివ్వరు. అతను లోపలికి వచ్చినప్పుడు తనను ఏదో పనిమీద బయటకు పంపిస్తారు. అతనితో కలిసి అన్నం తినటంగానీ, అతనికి ఆప్యాయంగా అన్నీ అమర్చటంగానీ ఇష్టంలేదు పెద్దవాళ్ళకు. ఒకటి రెండుసార్లు అతనితో మాట్లాడటానికి ప్రయత్నం చేసింది తను. అంతలోకే సుశీలమ్మ వచ్చేసింది. మోహన్ కళ్ళు తనకోసం వెదకటం చాలాసార్లు గమనించింది తను.

తను మాత్రం ఎంత తహతహలాడిపోతున్నది. ఆ రోజు అతనితో వచ్చేటప్పుడు అటు దుఃఖంతోనూ, ఇటు ఆనందంతోనూ తన గొంతు పూడుకుపోయి ఒక్క మాటకూడా మాట్లాడలేకపోయింది. అదీకాక అంత గొప్పవాళ్ళతో ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలీక మౌనంగా వుండిపోయింది. కొడుకు తనను పెళ్ళి చేసుకున్నానని చెబితే, పెద్దవాళ్ళు ఎంత గొడవ చేస్తారో అని భయపడ్డది. ఆమధ్య సూరమ్మ పెద్దకొడుకు ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడని ఎంత గొడవపడ్డారు ? పాపం వాళ్ళిద్దర్నీ గడప తొక్కనివ్వలేదు. వాళ్ళ మొహం కూడా చూడలేదు. ఎంతయినా గొప్పవాళ్ళు గొప్పవాళ్ళే !

రాజ్యం చెప్పింది. పెళ్ళయిన తరువాత వాళ్ళాయన ఒక్క క్షణం కూడా ఒదిలిపెట్టి వుండ లేదుట. అన్నీ తనిష్టప్రకారమే చేస్తాట్ట. సినిమాకి తీసుకెళ్ళటం తిరణాలకు తీసుకెళ్ళటం, స్నేహితుల ఇళ్ళకు తీసుకువెళ్ళటం, అదీ, ఇదీ అని ఏమిటి ? ఒక్కడూ ఎక్కడికీ వెళ్ళట్ట. రోజూ మల్లెపూలు తెస్తాట్ట. తెల్లచీర కట్టుకోందే వూరుకోట్ట... అబ్బా! ఇంకా ఏమిటేమిటో చెప్పింది. ఆ అనుభవాలన్నీ తనకేవీ ?

"మాధవీ ! త్వరగా తీసుకురామ్మా పిండి... నూనె కాగిపోతున్నది." వంట ఇంట్లోనుంచి, సుశీలమ్మ కేకవేసింది. తన ఆలోచనలకు ఆనకట్ట వేసి, పళ్ళెం గబగబా తెచ్చింది మాధవి.

5

"రా ! బాబాయి రా !" ఆప్యాయంగా, ఆనందంగా, ఆహ్వానించింది మాధవి, సుందర్రావుని.

తన తండ్రీ, ఆయన ఎంతో స్నేహంగా వుండేవారు. తనకు బాగా చనువు ఆయనదగ్గర. ఆ రోజు పట్టుపట్టి ఆ పసుపుతాడు కట్టించింది ఈయనే !

"ఏమ్మా ! కులాసాగా వున్నావా ?" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు

"ఆ ! బాగానే ఉన్నాను. పిన్ని కులాసాగా వుందా ?"

"ఆ! అదే రోజూ పోరుపెడుతున్నది. ఒక్కసారి వెళ్ళి చూసిరండి. పిల్ల ఎట్లా వున్నదో అని."

ఆ మాటకు మాధవి కళ్ళు చెమర్చినాయ్ ! పుట్టిపెరిగిన వూరు. తెలిసిన మనుషులు. ఆ ఆప్యాయతలు వేరు. ఒకరికి కష్టం వస్తే పదిమందీ నలుగురూ ఆదుకుంటారు. ఒకరి సంతోషం పదిమందీ పంచు

కుంటారు. ఆ వాతావరణం వేరు. ఆ పద్ధతులు వేరు.

"నువ్వు అదృష్టవంతురాలివి మాధవీ! మీ నాన్న పోవటం బాధాకరమే అయినా, ఎప్పటికయినా మరొక ఇంటికి వెళ్ళాల్సిన దానివేకదా! మీ నాన్న పదిజన్మలెత్తినా, ఇటువంటి సంబంధం తెచ్చేవాడా? మీ ఇంట్లో సామాను సర్ది పెట్టి గట్టిగా తాళం వేశాము. పాడిగొడ్లను నేను తోలుకెళ్ళి, ఖర్చులు పోను పాలమీద వచ్చింది బ్యాంకులో వేద్దామను కుంటున్నాను నీ పేర. తోట కౌలుకిమ్మని నలుగు రైదుగురు అడుగుతున్నారు. ఎవరికివ్వను?"

"ఆ విషయాల నాకేం తెలుసు! ఎవరికిస్తే మంచిదో ఆలోచించి నువ్వే ఇవ్వు!" అని లోపలకు వెళ్ళి పళ్ళెంలో రెండు కోవా కజ్జికాయలు, కాస్త మిక్చరు, రెండు అరటిపళ్ళు పెట్టి తీసుకువచ్చి ఇచ్చింది. కాఫీ తీసుకురావటానికి వెళ్తుంటే,

"ఇప్పుడెందుకమ్మా ఇవన్నీ" అన్నాడు సుందర్రావు.

"ఫరవాలేదు తీసుకో!" అంటూ లోపలకు వెళ్ళిపోయింది మాధవి.

"ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అందరూ ఎక్కడికి వెళ్ళారో? మాధవి ఒక్కతే ఎందు కుందో?" ఆమె రాగనే ఆ మాటే అడిగాడు.

"అంతా ఎవరున్నారు? ఆయన కాలేజీకి వెళ్ళారు. అత్తయ్య, మామగారు గుడికి వెళ్ళారు."


"అయితే ఈ ఆస్తికంతటికీ ఏకైకవారసుడన్న మాట" అవునన్నట్లు తలాడించింది.

"అదృష్టవంతురాలివమ్మా!" మరొకసారి అని కాళ్ళకు చెప్పులు తొడుక్కుని కుర్చీలోంచి లేచాడు.

"ఈ వూరు వచ్చినప్పుడు వస్తూండు బాబాయి."

"చూడమ్మా! రావటానికి నాకేంలేదు. కాని ఇది గొప్పవాళ్ళ ఇల్లు. మా రాకపోకలు నీకు ఇబ్బంది కలిగించవచ్చు. అదీకాక ఇవ్వాళ నువ్వున్నావు గనక సరిపోయింది. అతనూ నువ్వూ ... నువ్వు ఇహ ఆ మనుషుల్ని మర్చిపోవాలి తల్లీ. ఇక్కడి పద్ధతులకు, అలవాటు పడాలి. ఆ... అన్నట్లు ఎప్పుడన్నా ఒకసారి కారుమీద మీరిద్దరూ రండి. మన వూరివాళ్ళంతా సంతోషిస్తారు" అంటూ తండ్రిలాగా ఆప్యాయంగా మాట్లాడి మెట్లు దిగుతుంటే మాధవికి దుఃఖం ఆగలేదు. ఇక్కడ తన నెవరూ ఏమీ అనరు. కానీ ఏదో లోటు. ఇదీ అని చెప్పలేని బాధ. ఆ బాధ మోహన్‌కి చెప్పుకోవాలనీ, అతని గుండెలమీద వాలిపోయి, తన గుండె బరువు తగ్గించుకోవాలనీ, నూతన జీవితాన్ని ప్రసాదించిన అతనికి కృతజ్ఞతలు చెప్పుకుని, అతని సాన్నిధ్యంలో తన మనసు విప్పాలనీ, అనురాగంలో కరిగిపోవాలనీ, అతని ఒడిలో సేద తీరాలనీ, ఏవేవో ... ఎన్నెన్నో అనుకుంటుంది. కాని అతనెందుకో మౌనంగావుంటున్నాడు. తను తొందర పడకూడదు అని మనసు దిటవుచేసుకుంది మాధవి.

మోహన్‌కి తల్లిదండ్రుల మనసు అర్థంకావటం లేదు. మొదట్లో మాధవికి మైల అనీ, ఇంట్లోకి రాకూడదనీ, వరండాలో వున్న మూల గదిలో వుంచారు. మరి ఇప్పుడు? తామిద్దరికీ ఏకాంతం ఎక్కడ దొరుకుతుందోనని కనిపెట్టుకుని



వుంటున్నారు, అమ్మ క్లబ్‌కు వెళ్లటం కూడా మానేసింది. మాధవి ఏమనుకుంటుంది? ఆ రోజు తీసుకువచ్చి ఈ పంజరంలో పెట్టి మళ్ళా మొహం చూడలేదనుకోదూ ? అసలిప్పటికే తనని పిరికివాడి కింద, పాజెమ్మ క్రింద జమకట్టి వుంటుంది. ఏదన్నా, అవసరానికి మాధవిని పిల్చినా, తను వస్తుంది అమ్మ.

"నేను పిల్చింది మాధవిని" అందామని నోటి దాకా వస్తుంది కాని అనలేదు. ఏదో బలహీనత. మరేదో సంకోచం.

అనుకోకుండా మంచి ఛాన్సు వచ్చినట్లని పించింది మోహన్‌కి. అదే... వాళ్ళ పిన్ని కూతురు పెళ్ళి. తల్లి పది రోజులు ముందుగా వెళ్తుందను కున్నాడు. కనీ ఆ సూచనలేం లేవు. తీరా పెళ్ళి నాలుగు రోజులుందనగా ప్రయాణమైనారు వాళ్ళు.

"నాకు పరీక్షలు, రావటానికి కుదరదు." అన్నాడు మోహన్, మాధవితో ఏకాంతంగా గడపాలని.

"సరే ! నీ ఇష్టం. హోటల్లో భోంచెయ్యి. మేం ముగ్గురం వెళుతున్నాం" అని తమతో తీసుకు వెళ్ళారు మాధవిని. తన ప్లాను విఫలమైనందుకు ఎంతో కృంగిపోయాడు మోహన్.

అక్కడ మాధవి పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. ప్రతివాళ్ళు తినేసేలా చూస్తూ "ఎవరీ అమ్మాయి ?" అని అడుగుతుంటే, "ఆయనకు దూరం చుట్టం. వరసకు మేనకోడలు", అని చెబుతున్నది సుశీలమ్మ. ఆమె మాటలు బోధపడటం లేదు మాధవికి. మేనకోడలంటుందేమిటి ? తనా

ఎదురు చూపు

ఇంటికి కోడలు ! ఇంతవరకు ఎవరితోనూ అలా చెప్పలేదు. ఎందువల్ల ?

వాళ్ళూ బాగా డబ్బున్నవాళ్ళే. పెళ్లి చాలా ఘనంగా చేస్తున్నారు. కార్లు, బ్యాండుమేళాలు, బరువైన బంగారు నగలు, విలువైన పట్టుచీరలు, పూటకో డిపార్టుమెంటు చొప్పున డిన్నర్‌లు. మాధవికి సుశీలమ్మగారి పట్టుచీరలు మడత పెట్టటమే సరిపోతున్నది. గంటకో చీర మారుస్తూ, గడియకో నగ పెట్టుకుంటూ, మెళ్ళో వస్తువులు సవరించుకుంటూ అందరితో మాట్లాడు తున్నా 'తనకీ వేడుకలన్నీ చేతిమీదుగా చేసుకునే యోగం లేకపోయింది కదా' అని లోపల సలుపుతూనే వుంది. పెళ్ళి అయినా కాకుండానే ప్రయాణమైనారు సుశీలమ్మ, సీతారామయ్య, ఇంకా ఎక్కువ రోజులు వుంటే మాధవి సంగతి ఎక్కడ బయటపడు తుందోనని.

6

"అమ్మా ! నా ఫ్రెండు చెల్లెలు పుట్టిన రోజట. పిలిచాడు. మాధవి, నేను వెళ్ళొస్తాం !" అన్నాడు, ఆ వంకతోనన్నా మాధవితో కలిసి బయటకు వెళ్ళొచ్చన్న ఆశతో. అతని మాటలకు మాధవి మనసు ఆనంద తరంగమైంది. చేస్తున్న పని ఆపి, తలెత్తి అతనివైపు చిలిపిగా చూసింది.

"మూడామి రోజులు. ఇంతవరకు ఇద్దరూ కలిసి ఎక్కడికీ వెళ్ళలేదు. ఈ నాలుగు రోజులూ పోయాక వెళ్దురుగాన్లే !" అన్నది సుశీలమ్మ.

"ఏమిటి నీ చాదస్తం ?" అని మనసులో విసుక్కుంటూ, ఇక్కడినుంచి వెళ్ళిపోయాడు మోహన్.

సుశీలమ్మ మాటలు మాధవి మనస్సును కకావికలు చేసినయ్ !

"పెళ్ళి చేసుకున్నందుకు ఏమీ అనకపోయినా తరువాత ప్రతిదానికీ ఏమిటీ ఆంక్షలు?" అనుకున్నది మూగగా మాధవి.

మాధవి మంచితనం, అమాయకత్వం, సుశీలమ్మను నోరెత్తనీయటంలేదు. మాధవి రాక సుశీలమ్మకు ఎంతో విశ్రాంతి నిచ్చింది. ఏవో కొన్ని ముఖ్యమైన పన్లు తప్ప మిగతావన్నీ మాధవికి వదిలేసింది. ఆదివరకు క్షణం తీరిక లేనట్లుండే ఆవిడ ఇప్పుడు చీర నలగకుండా కుర్చీలో కూర్చుం టున్నది. ఒక రకంగా జీతం లేని పనిమనిషి మాధవి.

సీతారామయ్య ఇంట్లో వున్నంతసేపూ, ఆయన దగ్గరుండి, ఎక్కడెక్కడి కబుర్లు చెప్పటం, సినిమాల గురించి, చీరల గురించి, జోకులు, నవ్వులు—అలాంటప్పుడు వంట ఇంట్లో వంటరిగా వున్న మాధవి మనస్సు కలుక్కుమనేది. అంత వయసువచ్చి, అన్నీ అనుభవించిన తరువాత ఒకరికొకరు ఇంత ఆత్మీయంగా వున్నారు కదా ? కొత్తగా పెళ్ళయిన కొడుకు, కోడలికి అలాంటి సరదాలు వుంటాయని ఎందుకనుకోరో ?

ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోవటమే మహా

పాపం అన్నట్లుంది వీళ్ళ ప్రవర్తన. "ఏమైనా గొప్పవాళ్ళ మనసులు తెలుసుకోవటం కష్టమే!" అనుకున్నది మాధవి.

ఆ రోజు సీతారామయ్య దగ్గరకు ఎవరో వచ్చారు. వాళ్ళకు కాఫీలు, టిఫిన్లు అందిస్తూ, ఏవేవో మాట్లాడుకుంటున్నారు. కొంత తెలుగు, కొంత ఇంగ్లీషు సరిగా అర్థం కావటంలేదు. చివరిగా వాళ్ళు వెళ్ళిపోతూ అన్నమాటలు మాత్రం కొంత కొంత అర్థమైనాయ్ మాధవికి.

"మా వాడు చూసే పనేంలేదు. మేమిద్దరం వస్తాం. నాలుగు లక్షలకు తక్కువ మాత్రం కానివ్వకండి" సీతారామయ్య అన్నాడు.

"ఏదో లాంఛన, తరువాత అంతా అమ్మాయిదేగా! నలుగుర్లోనూ కాస్త ఘనంగా వుండాలని మరీ మరీ చెబుతున్నారు. కానీ మీకు మాత్రం లక్షలకు తక్కువా ఏమిటి?" నవ్వుతూ, అన్నాడు వచ్చినాయన.

"అంటే కొడుక్కి మళ్ళా పెళ్ళి చెయ్యాలని చూస్తున్నారన్నమాట! మోహన్! మీరంతాకలిసి నన్నెంత దగా చేశారు? ఈ ఇంటికి డబ్బులేని నౌకర్ని కుదిర్చావన్నమాట. తెలివిగలవాడివి, తెగింపుకలవాడివి, అనుకున్నాను. అడిగిన వాళ్ళందరికీ మేనకోడలిగా పరిచయం చేస్తుంటే ఆ మాటవెనకవున్న కుత్సితాన్ని అర్థం చేసుకోలేకపోయాను. నువ్వింత అసమర్థుడివని, అందరిలాగా డబ్బుకి అమ్ముడుపోయే పశువ్వని ఇప్పుడే అర్థమయింది. ఈ ఇంటికి, నీ వాళ్ళకు చేసిన చాకిరీ చాలు. మా నాన్నను పొట్టన పెట్టుకుని, గొప్ప వీరుడిలాగా నన్ను తీసుకువచ్చావు. పసుపుతాడుకట్టి నలుగురి ముందు ఏదో వాగావే! స్త్రీలు అణిగిమణిగి పడుండక్కర్లేదని, అలాంటివి నీకు నచ్చవని. ఇప్పుడు చేసిందేమిటి? మెత్తని కత్తితో నా గొంతు కోశావు. నీ కంటే తెలివైంది మీ అమ్మ. బంగారు సూత్రాలు తప్ప పసుపుకొమ్ము పనికిరాదని ఎప్పుడో తీయించింది నా చేత. ఎంత తెలివైనవాళ్ళు మీరంతా!" అనుకుని పళ్ళు పట పట లాడించింది. మనస్సు కుతకుతలాడింది. ఆ ఇల్లన్నా, ఇంట్లో మనుషులన్నా అసహ్యం కలిగింది. ఇంకొక్క క్షణం అక్కడ వుండకూడదు. వెంటనే వెళ్ళిపోవాలి అనుకుని,

"ఒక్కసారి మా వూరు వెళ్ళివస్తాను" అన్నది సుశీలమ్మతో.

"అసలే పెళ్ళిపన్ల హడావుడి. ఈ పిల్ల ఇప్పుడు వెళ్తే ఎలా?" మనసులో అనుకుని. "ఎవర్నన్నా తోడిచ్చి పంపిస్తాను. వెంటనే వచ్చేసెయ్!" అన్నది పైకి.

"నాకు తోడెందుకు? వీలయినంత త్వరగానే వస్తాను" పొడిగా అన్నది మాధవి.

"డబ్బేమన్నా కావాలా?"

"అక్కర్లేదు" నిర్లక్ష్యంగా అన్నది. వెంటనే రెండు చీరెలు సంచిలో పెట్టుకుని గడపదాటింది.

బస్సుస్టాండులో నుంచుంటే ఎంతకీ బస్సు రాలేదు. ఆ క్షణంలో ఆమె మనసు మరోవైపు తిరిగింది.

ఇంటికి వెళ్ళాలనిపించలేదు. పల్లెటూరు. అక్కడి పద్ధతులు, ఆచారాలు, అవహేళనలు కళ్ళ ముందు కనబడ్డాయ్!



జూలై రెండో వారం నెల్లూరులో జరిగిన నెఫ్జా సంగీత నృత్య పరిషత్‌లో సంగీత దర్శకుడు శ్రీ జె. వి. రాఘవులుని సన్మానిస్తున్న ఎ. ఎస్. పి. శ్రీ భాస్కరయ్య, ప్రక్కన నెఫ్జా అధ్యక్షుడు శ్రీ సుందరరామి రెడ్డి, కూచిపూడి నృత్యం (జూనియర్స్)లో ఉత్తమురాలిగా ఎన్నికైన కుమారి లావణ్యకి శ్రీమతి తుర్లపాటి కృష్ణకుమారి మెమోరియల్ షీల్డు అందజేస్తున్న సినీ నటుడు సుధాకర్‌లను చిత్రంలో చూడవచ్చు.

మొగుడు వదిలేసిన ఆడదాన్ని ఎంత నీచంగా చూస్తారో! ఉదాహరణ సుమతి! కలవారమ్మాయి అయినా ఎదురుగానూ, వెనకగానూ కూడా ఎన్నో మాటలనేవారు. "మొగుడు తాగివచ్చి కొడితే మాత్రం, ఆడది పడుండక్కర్లేదూ?" అని బుగ్గలు నొక్కుకునేవారు.

మొన్న బాబాయి అననే అన్నారు – "నువ్వూ, మీ ఆయన కలిసిరండి. ఊళ్ళో అందరం సంతోషిస్తాం!" అని. అటువంటిది ఒంటరిగా ఇలా వెళ్ళి ఆ వూళ్ళో బ్రతకలేను అనుకుని, బెజవాడ బస్సు ఎక్కింది. ఆమె ఎక్కటమే ఆలస్యమన్నట్లు బయలుదేరింది బస్సు.

బస్సుకంటే వేగంగా వున్నాయి ఆమె ఆలోచన్లు. బెజవాడ ఎప్పుడూ వెళ్ళలేదు. అక్కడ ఎవరూ తెలీదు. ఎక్కడుండాలి? ఎలా వుండాలి? ఎలా బ్రతకాలి? అన్నీ సమస్యలే! ఆలోచిస్తూనే క్రిందకు చూసింది. ఎర్రరాళ్ళ నెక్లెసు. పైకి తియ్యటానికి క్షణం తటపటాయించింది, తనను ఎవరన్నా అనుమానిస్తారేమోనని. కాని దానివంక ఎవ్వరూ చూడటంలేదు. మెల్లగా చేతిలోకి తీసుకుని గుప్పిట మూసి,

"ఎవరిదన్నా నగ పోయిందేమో చూసుకోండి" అన్నది మాధవి.

ఆమె మాటకు అందరూ మెడలు సవరించుకున్నారు. మాధవి పక్కనే కూర్చున్న భారీ శరీరం, "నా నెక్లెసు, ఎర్రరాళ్ళ నెక్లెసు పడిపోయింది." అన్నది ఆదుర్దాగా.

"పెట్టుకురావద్దంటే వినవ్" ఆమె భర్త కాబోలు విసుక్కున్నాడు.

"ఇదుగో! మీ నెక్లెసు" అంటూ ఇచ్చింది మాధవి.

అప్పటికే అందరి కళ్ళూ, ఆ వైపు తిరిగినయ్!

"ఎంత మంచిదానివమ్మా!" నవ్వుతూ అన్నది భారీ శరీరం.

"మంచివాళ్ళు కాకపోతే అంత ఖరీదయిన వస్తువు అడిగి మరీ ఎవరిస్తారు?" అన్నారెవరో.

"బంగారం కోసం రైళ్ళు, బస్సులు ఆపి, ప్రాణాలు తీస్తున్నారు. ఈ రోజుల్లో బంగారం వుండటంకూడా ప్రాణాంతకమే!"

"అయినా ఆడంగులు వూరుకుంటారా?" ఎవరో ముసలాయన అన్నాడు.

"బంగారం ధర పెరిగిపోయిందంటున్నారు. దగ్గరుంటే భయం అంటున్నారు. అయినా చేయిస్తూనే ఉన్నారు." మరొకరు లోకంపోకడ వివరించారు.

"చాలా థాంక్సండీ! మీరు చూసి వాళ్ళ వస్తువు వాళ్ళకు ఇవ్వకపోయినట్లయితే పోలీసు రిపోర్టు, కోర్టులు మా ప్రాణానికి వచ్చేది" కండక్టరు అన్నాడు.

"ఇంతకీ ఏ వూరు వెళ్తున్నావమ్మాయి?" నెక్లెసు అందుకున్న భారీ శరీరం అడిగింది ఆప్యాయంగా!

"బెజవాడ" పొడిగా సమాధానం చెప్పింది మాధవి.

"ఎవరున్నారక్కడ?" మళ్ళా ప్రశ్నించింది భారీ శరీరం.

ఏం చెప్పాలో మాధవికి తోచలేదు. "తనకు ఎవరున్నారని వెళ్తున్నది? ఎక్కడికి వెళ్ళాలో, ఎక్కడ వుండాలో, ఏం చెయ్యాలో నిర్ణయించుకోలేదు. అనాలోచితంగా, ఆవేశంలో ఈ బస్సు ఎక్కిందిగాని, ఉద్యోగం చేసుకుని బ్రతకటానికి తనేం పెద్ద చదువులు చదవలేదు" మాధవి సమాధానం ఇవ్వక పోయేసరికి మళ్ళా అడిగిందావిడ,

"ఏమ్మా! చుట్టాలింటికా?" అని.

"కాదండీ! తెల్సినవాళ్ళింటికి" అప్పటికి తోచిన జవాబు చెప్పింది.

బస్సు బెజవాడ వెళ్ళేవరకు ఆవిడ ఏదో అడుగుతూనేవుంది. కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పి, కొన్నిటికి ఆ! వూ! అంటూ కూర్చుంది మాధవి.

"బస్సు బెజవాడ చేరింతరవాత నీ కోసం

ఎవరన్నా వస్తారా ? నువ్వు ఏ పేట వెళ్ళాలి ?" అన్నది మళ్ళా ఆవిడ.

మాధవి మనస్సులో ఏదో ఆందోళన ప్రారంభ మయింది. బస్సు గమ్యం చేరింది. మరితనో...? మెరుపు లాంటి ఆలోచనవచ్చి, "ఈ వూళ్ళో ఎవరో పిల్లల సంరక్షణకు మనిషి కావాలంటే వస్తున్నాను. మా బాబాయి వాళ్ళకు ఉత్తరం రాశాడు. వాళ్ళు వచ్చి నన్ను తీసుకువెళ్తారు వాళ్ళ ఇల్లెక్కడో నాకు తెలీదు" అన్నది.

అందరూ తమ తమ సామాన్లు దింపుకుని రిక్షాలు కుదుర్చుకుంటున్నారు. చేతి సంచీతో మాధవి కూడా బస్సు దిగింది

"ఏమ్మా! వాళ్ళు వచ్చారేమో చూడు. వూరు కూడా కొత్త అంటున్నావు" అన్నాడు భారీ శరీరం భర్త.

తనకోసం వచ్చే వాళ్ళెవరూ లేరని తెలుసు. అయినా పదినిముషాలు ఎవరికోసమో చూస్తున్నట్లు నుంచుంది

"ఏమ్మా ! ఆయన రాలేదా ? పోనీ మా ఇంటికి రా ! తరవాత వాకబుచేసి, వాళ్ళింటికి పంపిస్తాను" అన్నాడాయన.

భర్త మాటకు కొరకొర చూసింది భారీశరీరం. వయసులో వున్న పిల్ల. కొంపమీదికి ఏం తెస్తుందో! లని ఆవిడ భయం అయినా అరగంట క్రితమే ఆ అమ్మాయి అందించిన నెక్లెసు గుర్తు వచ్చి, మంచిదానిలాగానే వుంది. కానీ చూద్దాం అనుకుని, "రామ్మా !" అన్నది ఆవిడ

ఆ మాట కోసమే ఎదురుచూస్తున్న మాధవి "అలాగే" అన్నట్లు తలూపి వాళ్ళను అనుసరించింది కూతుర్ని పురిటికి తీసుకువస్తున్నారు ఆ దంపతులు. వెంట చాలా సామాను వుంది. రెండు రిక్షాలు పిల్చి, ఒకదాంట్లో భార్యా, భర్తా ఎక్కి రెండోదాంట్లో కూతుర్ని, మాధవిని ఎక్కమన్నారు విశాలమైన తారురోడ్ల మీద రిక్షా చక్రాలు పరుగెడుతుంటే మాధవి మనస్సు వాటిని అనుసరిస్తున్నది.

"దిక్కులేనివారికి దేవుడే దిక్కంటే ఇదే కాబోలు. తను వాళ్ళ యింటికి చేరటానికే ఈమె నగ పోయింది కాబోలు. వీళ్ళూ బాగా వున్నవాళ్ళ లాగానే ఉన్నారు ఇక్కడ మళ్ళా సమస్యలు ఎదురు కావు గదా ? ఏమైనా మోహన్ అంత నీచులు ఇంకెవరూ వుండరేమో ! నీలాంటి చవటకి భార్యగా బ్రతికేకంటే, నీ ఇంట్లో చేసిన చాకిరీ ఎక్కడ చేసినా నా బ్రతుకు తెల్లవారుతుంది."

పెద్ద మేడ ముందు రిక్షాలు ఆగటం, ముందు రిక్షాలోనుంచి, భార్యా, భర్త దిగటం చూసి, తనూ దిగింది మాధవి. లోపలికి వస్తూ చేతికి అందిన వస్తువు తీసుకుని మరీ వచ్చింది ఇంటి తలుపులన్నీ తీసి, వంట ఇంటి పక్కగా విడిగా వున్న గది చూపించి, "నీ సంచి అందులో పెట్టుకో !" అన్నది యజమానురాలు. "మెల్లగా వాళ్ళకోసం వాకబు చేస్తాలేమ్మా ! బెంగపడకు" అన్నాడు యజమాని

మాధవి తనలో తనే నవ్వుకున్నది "తనకు బెంగా ? తండ్రి అండన ఆ పల్లెటూళ్ళో మరొక

ఎదురు చూపు

ప్రపంచం తెలీకుండా బ్రతికింది. ఆయన చావు తననీ విశాల విశ్వంలోకి విసిరేసింది. తన బ్రతుకు తను బ్రతకాలి. ఈ సమాజంలో మనుషుల తత్వాన్ని తెలుసుకోవాలి. వీలయితే మోహన్ లాంటి దగా కోరుల్ని రప్పకీడ్చి నలుగుర్లోనూ నగుబాట్లు చెయ్యాలి!" అనుకుని తనలో తనే కసిగా నవ్వుకున్నది.

7

మాధవి ఆ ఇంట్లో మనిషిలా మసలగలుగు తున్నది. విశ్వనాథం, సీతమ్మ మొదట్లో మాధవి వెళ్ళాల్సింది ఎవరింటికో అని వాకబు చేశారుగానీ, ఇప్పుడు ఎవర్ని అడిగితే వాళ్ళు "మా ఇంటికే" అంటారేమోనని, ఆ వూసు ఎత్తటంలేదు. ఆ దంపతులకు భార్గవి ఒక్కతే కూతురు. ఆమె పెళ్ళయి కాపురానికి వెళ్ళింది. ఇప్పుడు తొలిచూలు పురిటికి పుట్టింటికి వచ్చింది. పురుడుకాంగానే మళ్ళా వెళ్ళిపోతుంది. "మనకు సాయంగా ఈ పిల్ల ఇక్కడ వుంటే బాగుండు" అనుకున్నారు వాళ్ళు

మాధవికీ అలాగే అనిపించింది. "సీతమ్మగారిది మంచి మనసు. విశ్వనాథంగారు ఆయన కోర్టు గొడవలు తప్ప పట్టించుకోరు వాళ్ళిద్దరి అండన తను నిశ్చింతగా వుండొచ్చు. అంకంత ఇల్లు పైగా మూల గది తనకిచ్చేశారు. పని లేనప్పుడు పగలు, రాత్రి అక్కడే వుంటుంది తనకో మంచం, పక్క గూడా ఇచ్చారు."

"మాధవీ నాకు నీళ్ళు తోడవ్ ! స్నానం చేస్తాను" అడిగింది భార్గవి. అపురూపంగా పెరిగిన ఆ పిల్లను ఇప్పుడు మరీ అపురూపంగా చూస్తున్నారు తల్లిదండ్రి.

ఇక్కడ వంటరిగా పెరిగిన భార్గవికి అక్కడా వంటరితనమే! తను, భర్తా ఇద్దరే వుంటారు అతను పొద్దున పది గంటలకు ఆఫీసుకు వెలితే తిరిగిరావటం రాత్రి పది గంటలకే !

వంటరి జీవితంలో విసుగెత్తుతున్న భార్గవికి తనకంటే కాస్త చిన్నదయిన మాధవి అంటే ఎంతో ఇష్టం ఏర్పడింది. సరదాగా కబుర్లు చెప్పుకోటానికి,

భూదేవి దిగులు

భూదేవి
చీకటి చీరను కట్టుకొని,
శరీరాన్ని కప్పుకొంది
ఒంటికున్న చీరను చూసుకొని
క్షణంసేపు మురిసిపోయింది.
మరుక్షణమే గుండెల్లో దిగులు !
కొద్దిసేపట్లో
కొంటె సూరీడొచ్చి,
కట్టుకున్న చీరను
విప్పిపారేస్తాడని,
నగ్నంగా
పగలంతా తిరగాలని.

— బొడ్డేపల్లి నారాయణమూర్తి

తను ఏ పనిచేస్తున్నా, "మాధవీ నువ్వూ చేస్తావా?" అంటే చాలు, ఆ పని వచ్చినా రాకపోయినా, నేర్చుకోవాలన్న ఉత్సాహంతో, "అలాగే !" అంటూ తయారయ్యేది.

"మాధవీ ! నా షేవింగు సెట్టు ఎక్కడ ?" అని అడిగేవాడు విశ్వనాథం

ఆ మాటకు సీతమ్మ, "ఏమిటి ఆ బద్ధకం ఆడపిల్ల నడుగుతారేం ! ఆ మాత్రం చూసుకోలేరూ ?" అనేది మందలింపుగా.

"మాధవీ ! ఈ కాఫీ తీసుకెళ్ళి మీ బాబాయి గారికి ఇవ్వమ్మా. నిన్న చాకలి బట్టలు తెచ్చాడుగదా? ఆయన పంచెలు, డ్రాయర్లు, బనీన్లు అన్నీ వచ్చాయా ?" సీతమ్మ అడిగేది

"నువ్వు చెయ్యాల్సిన పన్లు ఆ పిల్లకు చెబుతావెందుకు ?" విసుగ్గా అనేవాడు విశ్వనాథం

"వెనకటిలాగా అన్ని పన్లు సమర్థించలేక పోతున్నాను. చేతికింద మాధవి వుందిగనక తెలీటం లేదు. అందుకే చిన్న చిన్నపన్లు, తనకేవదిలేశాను" అనేది సీతమ్మ

భార్గవి "మాధవీ ! నా ఆర్గండీ చీర ఇస్త్రీ చేశావా ? నిన్న స్వెట్టర్లు అల్లుతూ ఊలు, సూదులు ఇక్కడే పెట్టాను ఏవీ? అవును సందు చివర కిళ్ళీకొట్టతను ఇవ్వాళ కొత్తనవల వస్తుందన్నాడన్నావుగా ? వెళ్ళి తీసుకురాలేకపోయావా ? వెళ్ళేటప్పుడు చెప్పు నాలుగు కవర్లు, కార్డ్లుకూడా తెచ్చిపెడుదువుగాని" అంటూ మాధవికి ఊపిరి సలపనిచ్చేదికాదు.


ఇక్కడికి వచ్చిన తరువాత కాలం ఇట్టేగడిచి పోతున్నది మాధవికి. "తన ఇల్లు, తనవాళ్ళు" అనుకున్న మోహన్ ఇంటికంటే ఎంతో ప్రశాంతంగా, సరదాగా, సంతోషంగా వున్నది. బోనులోనుంచి బయటపడ్డట్లుంది తనకి. పగలల్లా ఇంట్లోవున్నా సాయంకాలం అయ్యేసరికి భార్గవి, మాధవికలిసి అలా సెంటరు దాకా వెళ్ళేవారు. వచ్చేటప్పుడు పూలుగానీ, పళ్ళుగానీ, కూరలుగానీ తెచ్చేవారు సీతమ్మ కూతుర్ని అడిగికొన్ని, అడక్కకొన్ని రకరకాల పిండివంటలు చేసేది. పెద్దగ్లాసు ఎత్తి మంచినీళ్ళు త్రాగటం కష్టమని చిన్నగ్లాసుతో నీళ్ళు ఇచ్చేది.

తుండుగుడ్డతో తుడుచుకుంటే ఒళ్ళు కంది పోతుందని, తను తీసేసిన నేతచీరలు ఉతికించి అవి పెట్టి తుడుచుకోమనేది వారానికి ఒకసారి ఆస్పత్రికి తీసుకువెళ్ళి చూపించుకురావటం సీతమ్మ పనయితే, డాక్టరు చెప్పిన మందులు వేళ ప్రకారం భార్గవిచేత మింగించటం మాధవి వంతు. భార్గవి, మాధవి ఎంత సన్నిహితంగా వచ్చారంటే, భార్గవిని మాధవి "అక్కా !" అని పిలిచేది

ఆ పిలుపుకు నోచుకోని భార్గవి, ఏదో ఆత్మీయతకు లోనయ్యేది. ఒక్కొక్కసారి తనకే ఆశ్చర్యం కలిగేది. "ఏమిటీ బాంధవ్యం ! ఎక్కడి నుంచి వచ్చింది ఈ అమ్మాయి" అని.

ఆ ప్రశ్న ఆ ఇంటివాళ్ళు ముగ్గురూ వేసుకున్నా, "ఎవరయితే ఏంలే ! ఇంత మంచి అమ్మాయి మనకు దొరికింది. అంతేచాలు." అని సరిపెట్టుకున్నారు

భార్గవికి నెలలు నిండుతున్నకొద్దీ మేడమెట్లు ఎక్కలేక, క్రిందనే పడుకుంటున్నది. దాంతో, మాధవి తన గదిలోనుంచి పడక భార్గవి పక్కకు



ఎదురు చూపు

మార్చింది. అలా ఒకచోట పడుకున్న వాళ్ళిద్దరి మధ్యా అనేక సంగతులు చోటు చేసుకునేవి. చివరకు భార్గవి తనకు, భర్తకు వుండే రహస్యాలు కూడా మాధవితో చెప్పేది.

"స్త్రీ, పురుషుల మధ్య ఇంత ఆకర్షణ, అనురాగం వుంటాయా ? ఈ అనురాగానికి, అనుబంధానికి ఆర్థికస్థితిగతులు తోడ్పడతాయా?" అనుకునేది మాధవి.

ఆ ఆలోచన వచ్చినప్పుడు, సమాజంమీద తిరగబడాలనీ, మోహన్ కనిపిస్తే చిత్రహింస చెయ్యాలనీ, తమ ఆనందానికి అడ్డుగా నిలిచిన పెద్దవాళ్ళిద్దర్నీ ఖూనీ చేసిపారెయ్యాలనీ ఆవేశంగా అనుకునేది. కానీ. కానీ . తను అబల. గూడు వదలిన పక్షి. తనకు ఆర్థికబలం, సాంఘికబలం ఏదీ ? ఎవరి దయాదాక్షిణ్యాలమీదనో పొట్టపోసుకుంటూంది. సీతమ్మగారు కూతురి కోసం చేసే ఆర్భాటం చూస్తుంటే "తల్లి ప్రేమ ఇంత గొప్పదా ?" అనిపిస్తుంది.

విశ్వనాథం కూతురు గురించి ఆందోళన పడుతుంటే, "పితృ హృదయం అంతే" అనుకునేది

భార్గవి తన భర్తను గురించి, అతని అలవాట్లను, ఆప్యాయతను గురించి చెప్పినప్పుడు, "సృష్టి రహస్యం అదే కాబోలు" అని వేదాంతిలా నవ్వుకునేది.

ఎవ్వరూలేని తన వంటరి బ్రతుకుని తల్చుకుని తనలో తనే కుమిలిపోయేది

అలా ఓనాటి రాత్రి వెక్కి వెక్కి ఏడుస్తున్న మాధవిని, నిద్దట్లో మొదలయిన పురిటినొప్పులకు మెలకువ వచ్చిన భార్గవి, "ఏమిటి అలా ఏడుస్తున్నావు ? ఏమైంది ?" అని అడిగితే, "అక్కా ! ఇందాకటినుంచి బాధపడుతున్నావు. వేసుకున్న మాత్రవల్ల కళ్ళు తెరిపిడి పడలేదుగాని, ఎటూ పక్క కుదరక నానా అవస్థ పడుతున్న నిన్ను చూస్తే ఎందుకో ఏడుపు వచ్చింది" అన్నది ఏం చెప్పాలో తెలీక.

ఆమె ఆప్యాయతకు భార్గవి మనస్సు పొంగిపోయింది. "ఏమిటీ అనుబంధం" అనుకున్నది మళ్లీ అంత బాధలోనూ !

(ఇంకా వుంది)

ఇప్పుడు రుచికరమైన కస్టర్డ్ క్రీమ్ బిస్కట్‌లోని శ్రేష్టమైన కోట్టయం ఏలక్కాయ మాధుర్యాన్ని ఆనందించండి



ట్రూ బిస్కట్లు తయారుచేసేవారు
అందిస్తున్న అద్భుతమైన విందు ...
గోధుమరంగు-నలుపుగల
శ్రేష్ఠమైన కోట్టయం ఏలక్కాయలలోని
నూనెసారముచేరి దశసరిగా,
పోషకశక్తితోవున్న కస్టర్డ్ క్రీమ్.
కరకరలాడే రెండు బిస్కట్ల మధ్య
అందచేయబడుతుంది.
అదే ట్రూ ఏలక్కాయ కస్టర్డ్ క్రీమ్.
ప్రకృతిలోని అత్యుత్తమమైన
దానితో అద్భుతంగా తయారుచేయ
బడింది.
ప్రత్యేకమైన సెల్లోఫేన్
ప్యాక్‌లో ఏలక్కాయల పూర్తి
సువాసనతో మీ కోసం తాజాగా
భద్రపరచబడింది.




TRUE
ఏలక్కాయ
కస్టర్డ్ క్రీమ్

మీరు మటుకే చెప్పగల ప్రత్యేక రుచి

AUROFOOD ఆరోఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్
భారతదేశపు అత్యాధునిక పిండిమర మరియు
బిస్కెట్ తయారుచేసే సముదాయం

HTM-AFL-2360



ఐదు గంటలవటంతోటే ఆఫీసు నుంచి బయటికొచ్చి, చేతిలో వున్న పంచి, గొడుగూ సరిచేసుకుని 'పార్క్' స్టేషనుకు బయలుదేరింది రాధ.

ఆ సమయంలోనే టవర్ క్లాక్...ఎంతో వినసొంపుగా అయిదు గంటల్ని మ్రోగించింది. రాధ ముఖం వికసించింది పద్మంలా. 'సరిగ్గా ఇదే సమయానికి మధు తన ఆఫీసులో బయలుదేరివుంటాడు ... ఇంటికి!' అనుకుంటూ రాధ స్టేషను ప్లాట్ ఫారంమీద కొచ్చి ఎలక్ట్రిక్ ట్రెయిన్ కోసం ఎదురు చూస్తోంది.

జనం ... ఆ కొసనుంచి ఈ కొసదాకా ప్లాట్ ఫారం నిండా నిలబడ్డారు. వీళ్ళంతా వుదయం నుంచి సాయంత్రం వరకు తనలాగా ఏదో ఆఫీసులో పనిచేసి వస్తుంటారు! సాయంత్రం కావడం ఆలస్యం ... బస్సులో, ట్రయిన్సులో ... ఎక్కడా ఖాళీ వుండదు. ఒకటే తొందర, ఏదో మించిపోతున్నట్టు! రైలు రావటంలేదు! రెండు నిముషాలకే చికాకుగా వుంది. మనస్సు త్వరపెడుతోంది.

అప్పుడు అనుకుంది ... వీళ్ళంతా ఎందుకింత ... త్వరపడుతున్నదీ! మధు రూపు ఆమె స్మృతులలో మాటిమాటికీ కదులుతోంది! అతన్ని కలుసుకోవాలని హృదయమెంతో తాపత్రయ పడుతోంది. 'వీళ్ళంతా... ఎవరినో కలుసుకునేందుకు ... ఎవరితోనో మాట్లాడేందుకు ... ఉవ్విళ్ళూరుతున్నారు!' తనూ అంతే!

ఎలక్ట్రిక్ ట్రెయిన్ పరుగెడుతూవచ్చి ... జనాన్ని ఒక నిముషం లోపలే తనలో ఇముడ్చుకుని మరో నిముషంలో కొండమీద నుంచి జారుతున్న పెద్ద నల్లరాయిలాగా ... గబగబా ముందుకు సాగిపోయింది. రాధ మధుని గురించే ఆలోచిస్తోంది ... అలాగే నిల్చొని.

ప్రక్క స్టేషనులో ట్రెయిన్ ఆగినప్పుడు చాలామంది దిగారు. ఖాళీ అయిన బెంచిమీద కూర్చుంది రాధ. మరల క్రొత్త మనుషుల్ని తనలోకి తీసుకుని రైలు సాగింది.

రాధ హృదయంలో మరలా ఏవో భావనలు కూడుకుంటున్నాయి...'తన జీవితం ధన్యం!'— ఇదే మాట రాధ ప్రతి స్నేహితురాలు పలుకుతుంది. తను ముచ్చటపడుతుంది. తన జీవితానికి నలువేపులా వెన్నెల విరజిమ్ముకొని వున్నట్లు భావిస్తుంది. నిన్న ఆఫీసులో లలిత అనే అమ్మాయి కూడా అన్నది— 'మధులాంటి సహృదయుడైన వ్యక్తి నీకు భర్తగా లభించడం అదృష్టమని. ఎవరో అన్నంత మాత్రానే తన జీవితం మధురం కాలేదు. తనకు తానుగా అవలోకించుకుంటేనే తెలుస్తుంది — తన జీవితంలో మధుర జగత్తును సృష్టించగల సమర్థుడు మధు అని.

ఊహల పల్లకీలలో విహరిస్తుండగానే తను దిగవల్సిన స్టేషను వచ్చింది. ట్రెయిను దిగేప్పుడు ఎవరో ఎదురుగా కూచున్న మనిషి — అదేపనిగా ఎప్పటినుంచో తనవేపు అదోలా చూస్తున్నాడని గ్రహించింది.

రైలు దిగి మెట్లెక్కబోతున్న రాధ — అప్రయత్నంగా అప్పుడే సాగుతున్న ట్రైను వంక చూచేటప్పటికి — రైల్లో తనవేపు అదేపనిగా చూచిన వ్యక్తి — ఇటు తిరిగి నవ్వుతూ చెయ్యి ఎగరేస్తున్నాడు — ఎరుగున్న మనిషిలాగా! అసహ్యం వేసింది. గబగబా మెట్లెక్కి అటువేపుకు వెళ్ళిపోయింది

'మధు ఆఫీసు నుంచి వచ్చివుంటాడు! ఉదయం ఆఫీసు కెళ్ళేప్పుడు మెడిసిన్ చదువుతున్న మీ స్నేహితురాలు కన్పించి వచ్చే వారం మనింటికి వస్తానన్నదని చెప్తే ఎంత సంతోషిస్తాడో? ఆదివారం నాటికి మంచి ప్రోగ్రాం నిర్ణయించుకునుంటే! మెరీనాకు వెళ్దామంటే — తల నెప్పి పుడ్తోంది ఎందుకో? ఆదివారమల్లా మినర్వాలోనో, రాక్సీలోనో — ఎక్కడో సినిమాలతో గడిపేయాల్సిందే! నాకూ అదే అలవాటయింది. మళ్ళీ వాళ్ళ మేనేజరు ఏమడిగాడో నన్నుగురించి?

'నీ భార్య బి. ఎ. చదివిందా? ఫరవాలేదే!' అన్నాట్ట ఒక రోజున. అంటే చదవకూడదు కాబోలు! మగవాళ్ళేనా బియ్యేలు చదివేది?

మరో రోజు మర్యాదగా పిలిచి 'నీ భార్య వుద్యోగం చేయడం నీ కిష్టమేనా?' అని అడిగాట్ట. ఎందుకో ఆయనకీ ధర్మసందేహం? భార్య అంటే 'పిల్లల్ని కనే యంత్రం' అనే ఆయనింకా భావిస్తున్నాడేమో? ఈ రోజుల్లో కూడా మగవాళ్ళ మనసుల్లో అంకితమైన భావాల్ని తీసేయడం చాలా కష్టం! ఎంత మంది రామలక్ష్మ లెన్నివిధాల చెబుతున్నా, రేడియోల్లో పాటలు కూడ ఆపేసి ప్రత్యేకంగా అదే పనిగా గొణుగుతూ ఘోష పెడ్తున్నా వాళ్ళ ప్రవర్తనలో యుగాంతం వరకూ మార్పు రాకపోవచ్చు. ఎక్కడైనా బహిరంగంగా చెప్పాల్సివస్తే స్త్రీ సమస్యల్ని గూర్చి ఉదాత్తతను కుండలకొద్దీ కుమ్మరిస్తారు

''నీకు తెలీదు రాధా! మా ఆఫీసరు చాల మంచివాడు!'' అని మధు చెప్పాడు. ఆయనలో వున్న మంచితనం మధుకే తెలియాలి.

తాను యింటిని సమీపిస్తున్నకొద్దీ హృదయంలో ఆనందాతిరేకాలుత్పన్నమవుతున్నాయి. ఇంట్లో అడుగు పెట్టడంతోటే — మధు ఏవో కబుర్లు చెప్పబోతాడు. ఇవాళ

వాళ్ళ మేనేజరు ఏమైనా అన్నాడేమో ? బహుశా యివ్వాళ–"ఏమయ్యా, మధుసూధనరావ్. నువ్వీ ఆఫీసులో ఐదు వందలు సంపాయిస్తున్నావు. నీ భార్య మరోవేపు నుంచి ఐదు వందలదాకా సంపాయిస్తోంది. డబ్బంతా ఏం చేస్తున్నారు ?" అని అడిగివుంటాడు. మధు ఏమి సమాధానం చెబుతాడో ? బ్యాంకి అక్కౌంటు వుందని చెబుతాడు. అప్పుడు ఆయన 'అయితే పుట్టబోయే పిల్లలకు నిలువ చేస్తున్నారన్నమాట!' అని అనివుంటాడేమో?

పిల్లలు ! చాలా సంవత్సరాలనుంచి చాల మంది — యంత్రాల్లాగా పిల్లల్ని కంటూనే వచ్చారు. ఇంకా యీ పద్ధతి కొనసాగవల్సిందేనా ? ఈ విషయంలో మధును మెచ్చుకోవల్సిందే. నేటి సామాజిక వ్యవస్థలో ఆడవాళ్ళకు కూడా ఆర్థిక స్వాతంత్ర్యం కావాలంటాడు. ఎంత కాలమని పాతగాడిలోనే ప్రయాణం చేయటం ? రాధ ఆలోచిస్తు యిల్లు చేరుకుంది.

తలుపులు తెరచివున్నాయి. గబగబా లోనికి వెళ్ళి చూచేటప్పటికి ... మధు అన్యమనస్కుడై కుర్చీలో కూర్చుని ... కనీసం తను రావటమైనా కనిపెట్టి ఇటు చూడక కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాడు. రాధ బాధపడింది. సంచీ, గొడుగూ అవతల పడేసి మధుకు దగ్గరగా వెళ్ళి అడిగింది —"ఏమిటి? ఇలా వున్నావ్ ?"

మధు రాధవైపు తిరక్కుండానే చెప్పాడు–'నేను ఉద్యోగం వదిలేసాను రాధా !' 'ఏంటి మధూ ? ఏమిటి నువ్వనేది ! నాకేమీ అర్థం కావటంలేదు. వుద్యోగమెందుకూ వదిలేయటం ?' మధు వెంటనే సమాధానం చెప్పలేదు.

రాధ బాధ, ఆదుర్దా మిళితంకగా ఆలోచనలో పడింది. ఆమె చుట్టూరా ... ఏవో లక్ష ప్రశ్నలు నిల్చున్నాయి. "భార్యాభర్తలిద్దరూ వుద్యోగం చేయటం ఎంత చక్కగా వున్నది" అని ఎంతోమంది తనను ప్రశంసించారు ! తను గడుపుతున్న జీవితాన్ని చూచి మెచ్చుకున్నారు. వాళ్ళంతా ఇప్పుడు ఏవగించుకుంటారు ... ఈ విషయం గురించి పరిపరి విధాల ఆలోచించిన రాధ తన బాధను లోలోపల అణుచుకుంటూ అడిగింది– "ఏమిటి మధూ! వుద్యోగం వదిలేయడం దేనికి ?"

మధు ఇటువేపుకు తిరిగాడు ... మొహం మొద్దుబారిపోయి వుంది! ఏదో ఆవేశం అతని శరీరాన్ని యావత్తూ బద్దలు చేసుకుని బయటికి రావాలని ప్రయత్నిస్తూంది.

'ఆ రాస్కెల్ లేడూ ? మా మేనేజరు వెధవ.'

రాధకేమీ అర్థంకాలేదు. ఒకరోజు అన్నాడు "మా మేనేజరు చాల మంచివాడు రాధా!" అని. మరలా ఈ రోజున "అతను రాస్కెల్ ! వెధవాయట ! ఏమిటో అంత విచిత్రం."

"వాణ్ణి చూస్తుండగానే నాకు పీక నులిమెయ్యాలనిపించింది. దుర్మార్గుడు. ఇవాళ కూడ రోజులాగా ఆ మాటా ఈ మాటా మాట్లాడి – ఆఖరున అన్నాడు – 'నీ భార్యా, నువ్వు కూడా ఆఫీసుకు ఉదయం వచ్చి సాయంత్రానికి తిరిగి వెళతారు కదా మరి భోజనం ఏర్పాటు ఎలాగూ ... హోటల్ భోజనం కూడా భోజనమేనా ? సరేకానీ, మీ వుభయులూ ప్రేమించి పెళ్ళి చేసుకున్నారా ఏమిటి ? రిజిష్టరు మేరేజా ? కాంట్రాక్టు మేరేజా ? నీ భార్య చాల అందంగా వుంటుందటగా? నిజమేనా?' – ఈ మాటలు ఇంకా వినలేక లావాంటి ఫైలు తీసుకుని వాడి మొహానికేసి కొట్టి రాజీనామా పత్రాన్ని పారేసి చక్కా వచ్చాను మధ్యాహ్నానికే !"

రాధ మనసు ఒక్కసారిగా దహించుకుపోయింది. ఆపాదమస్తకం వణుకుపుట్టింది.

'ఆఫీసు వ్యవహారాలతోనే అతనికి సంబంధం కాని...ఇలా నీ వ్యక్తిగత విషయాల్లోకి ప్రవేశించే అధికారం ఎవరిచ్చారు ?'

'వాడు వఠి నీచుడు.'

'దీనికి కారకుడవు నీవే! ఇదివరకల్లా అతను అడిగిన దానికల్లా నవ్వుతూ సమాధానమిచ్చావు. అతన్ని ప్రశంసించావు. ప్రత్యామ్నాయంగా ఈనాడు అతడిలా ప్రవర్తించాడు!'

'అయితే తప్పు నాదేనంటావ్! నన్నొక నీచుడిగా భావిస్తానంటావ్! ఇదేగా నీ అభిమతం?ఇతరుల చేతనేనలాంటి మాటలువిని సహించటం నీ కిష్టమేమోగాని నాకు పడదు!'

'ఎందుకలా వుద్రేకపడతావు ! ఇలా జరగటం నా కిష్టమేనని నేను చెప్పటంలేదు. అలా అనేందుకు కావల్సిన అవకాశాన్ని నీవే కల్పించావంటున్నాను. పైగా జీవితంలో మనం కొన్ని విషయాలలో ప్రతిఘటనకు పూనుకోకూడదు. నైతిక విలువల విషయంలో మరీనూ ! నీకు తెలియదు – ఉదయం లేచిన దగ్గర నుంచీ సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేంతవరకూ నా ముందు ఎన్నో విషయాలు జరిగిపోతాయి. రైలు స్టేషను ప్లాట్ ఫారం మీదా, ప్రయాణం చేసేప్పుడు ట్రెయిన్లో, ఎందరో నా వేపు చూచి పూర్వ పరిచయం వున్నట్లే నవ్వుతారు. ఇలాంటి విషయాలు సామాన్యం కావాలంటే మొదట్లో కొంత నిస్తబ్దత, నిండు జాగ్రత్త ఎంతైనా అవసరం !'

మధు కుర్చీలోంచి లేచి వాకిట్లో నిలబడ్డాడు. రాధ అతనివెనుక నించొనివుంది. వుద్రేకంగానే మధు అన్నాడు – 'నువ్వేదో పై తరహాకు చెందిన వ్యక్తివలె నాకు నీతుల బోధించనవసరంలేదు. నీలాగ నేను వ్యక్తుల మానావమానాల్ని సహించలేను !' అని అంటూనే మధు బయటికి వెళ్ళిపోయాడు. రాధ అలా చూస్తూనే వుండిపోయింది.

* * *

హోటలు నుంచి కుర్రాడు టిఫిన్ క్యారియర్ తెచ్చి లోపల పెట్టిపోయాడు. రాధ భోజనం చేయలేదు. తొమ్మిది గంటలు దాటిపోయింది. మధు తిరిగి రాలేదు.

"రేపు వుదయానికల్లా నా జీవితం అపహాస్యం పాలవుతుంది. 'నీ జీవితం బాగా వుందని' ప్రశంసించినవాళ్ళు 'నీ జీవితం భగ్నమైంది' అని సానుభూతిని ప్రకటిస్తారు 'మీ గృహస్థ జీవితం స్వర్గతుల్యం' అని నిన్నటి రోజున పలికిన లలిత మాటకు ఈ రోజున అర్థం లేదు."

ఇలాంటివెన్నో ఆలోచనలు ఆమె హృదయపు కడలిలో కల్లోలాన్ని, ఘోషను రేపాయి.


మధు నన్ను అర్థం చేసుకోటంలో పొరబడుతున్నాడేమో ? నేను వుద్యోగం చేయడం అతని కిష్టంలేదేమో ? – ఈ భావాలు రాధ హృదయంలో రేగటంతో ఆమె మొహంలో విషాదచ్ఛాయలు – కారు మేఘాల్లాగా అలుముకున్నాయి. నరాల్లోని ఆవేదన బుసలుకొట్టింది. తనలోని ఆశయాలకు సంబంధించిన స్మృతులు పడగలెత్తి పురోగమించమని ఆదేశించినాయి

* * *

మధు మరల తిరిగి రానేలేదు. యథాతథంగా రాధ తన వుద్యోగాన్ని నిర్వర్తించుకు పోతూంది.

సినిమా

—జి.వి.జి.



'కొండవీటి సింహం'లో ఎన్.టి. రామారావు, జయంతి

మిస్టర్ విజయ్‌లో తమాషా ఆచారం

అదొక ముచ్చటైన కుటుంబం. ప్రొఫెసర్ భగవంతం (గుమ్మడి) ప్రపంచ ప్రసిద్ధి పొందిన శాస్త్రజ్ఞుడు. ఆయన పెద్దకొడుకు అజయ్ (జగ్గయ్య) ఐ. పి. ఎస్. ఆఫీసరు. రెండో అబ్బాయి విజయ్ (శోభన్‌బాబు) ఎం. ఎస్‌సి. అజయ్ భార్య సీత (జయంతి). వాళ్ళకో పాప (బేబీ అంజు). ఆ ఇంట్లో అంతా కలిసి ఏర్పాటు చేసుకున్న ఓ తమాషా ఆచారముంది. ఎవరేం పని చేస్తున్నా -- ''స్టాట్యూ'' అంటే, అలా బొమ్మలా ఉండిపోవాలన్నమాట.

విజయ్ గదిలోకి జ్యోతి ''బాబాయ్, బాబాయ్!'' అంటూ పరుగున వచ్చింది.

''స్టాట్యూ!'' అన్నాడు విజయ్.

అంతే. జ్యోతి బొమ్మలా నిలుచుండిపోయింది. కొన్ని క్షణాలయ్యాక విసుగ్గా ''రిలీజ్ చెయ్, బాబాయ్! లేటవుతుంది,'' అంది.

''ఇదిగో, బంగారమ్మా. పరుగులు తీస్తే, పడతావని చెప్పానా? ఇంకెప్పుడూ అలా పరుగెట్టవు గదా?''

''పరుగెట్టను.''

''అయితే, రిలీజ్!'' అంటూ విజయ్, జ్యోతిని ఎత్తుకొని ముద్దాడాడు.


''ఏంటి, బాబాయ్! నీ ముస్తాబు ఇంకా పూర్తి కాలేదా? ఓ మైగాడ్! త్వరగా వచ్చి దేవుడికి దండం పెట్టుకో. లేకపోతే, అమ్మకు కోపం వస్తుంది. అంతే,'' అంది జ్యోతి.

''అమ్మో! అమ్మకు కోపం వస్తుందో? చెప్పవు కాదే ... ఒక క్షణం,'' అంటూ జ్యోతిని దింపి, పూజ గదివైపు విజయ్ బయలుదేరాడు.

కె. ఛటర్జీ నిర్మించే సమతా మూవీస్ ''మిస్టర్ విజయ్'' చిత్రానికి ఎ. కోదండరామిరెడ్డి దర్శకుడు.



''బంగారు భూమి''లో కృష్ణ, శ్రీదేవి.



'గిరిజా కళ్యాణం'లో శోభన్‌బాబు, సుమలత

ఘరానా గంగులులో మారిన గంగులు

మామూలుగా ప్రతి రోజూ పొద్దుపొడిచి ఎండెక్కిన తర్వాతే ఆలస్యంగా నిద్రలేచే గంగులు (శోభన్‌బాబు) ఆనాడు తెల్లవారుజామునే లేచి, ఇంటి ముందున్న బండిని రిపేరు చేయడం చూసి అంజి (చలం) తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. "గురూ! నాకు నిజంగా చాలా ఆశ్చర్యంగా ఉంది. నువ్వేంటి — మళ్ళీ బండి లాగటమేంటి? ఒక్క రోజులో ఎంత మారిపోయావు?"

"ఏం లేదురా! సీతాలు మొన్న రాత్రి నన్ను అలా దులిపేసరికి నామీద నాకే అదోలా అయి పోయిందిరా. ఒక ఆడపిల్లచేత అన్ని మాటలు పడింతర్వాత కూడా నేనెందుకిలా రౌడీ మామూళ్ళు వసూలు చేసుకుంటూ బతకడం – అనిపించి, అలా రోడ్డుమీద వెళ్తాంటే — మన రామస్వామి మేస్త్రి కనిపించాడు. మనం ఓ బండి అద్దెకు తెచ్చుకుంటే— ముసక్కావలిసిన బాడుగ అంతా తనే ఇస్తానన్నాడు. మళ్ళా వేరే బండి ఎందుకు — ఎలాగా మన చిన్నయ్య బండి ఉంది కదా... ఈ బండినే రిపేరు చేసుకుని రంగు వేసుకుంటే, చచ్చిపోయిన చిన్నయ్య కూడా మన కళ్ళముందే ఉన్నట్టు ఉంటుందని రాత్రి ఈ రంగు డబ్బాలు తీసుకొచ్చాను."

అంజి మెల్లగా విస్మయంలోంచి తేరుకున్నాడు. "బాగానే ఉంది, గురూ... మనం ఇలా బళ్ళు లాక్కుంటూ కూర్చుంటే — మా ఏరియా వాళ్ళ దగ్గర మామూళ్ళు ఎవరు వసూలు చేస్తారు?"

"నోర్ముయ్!" గంగులు గుడ్లురిమాడు. "ఈ రోజు నుంచి మనం ఈ రౌడీ జీవితానికి స్వస్తి చెప్తాం. మళ్ళీ ఆ ఊసెత్తావో—జాగ్రత్త!"

"అలాగే, గురూ! ఇక నువ్వు ఎత్తమన్నా ఎత్తను... ఆఁ... ఇక చూడు మన తడాఖా!" అంటూ అంజి ఉషారుగా బండికి రంగు వెయ్యనారంభించాడు.

ఇదంతా కిటికీగుండా గమనించిన సీతాలు (శ్రీదేవి) సంతోషంతో కిరాణా దుకాణం దగ్గరికి పరుగుతీసి — కర్పూరం, కొబ్బరికాయ తెచ్చి, ఆ బండికి హారతి ఇచ్చింది.

కట్టా సుబ్బారావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎ. పోతరాజు నిర్మించే సరిగమ ప్రొడక్షన్స్ "ఘరానా గంగులు"లో కవిత, శరత్‌బాబు, నూతన్‌ప్రసాద్, అల్లు రామలింగయ్య, మిక్కిలినేని, బాలకృష్ణ, కర్ణాటక టైగర్ ప్రభాకర్, నూతన నటీనటులు స్మిత, రవి చైతన్య పాల్గొంటున్నారు.

'మిస్టర్ విజయ్'లో చక్రవర్తి, అల్లు రామలింగయ్య, బోనా



సినిమా

బంగారు భూమిలో దోసుబాబుకు ధోకా

నీళ్ళ పంపు దగ్గర గట్టుమీద కేరియర్ పెట్టి రవి (కృష్ణ) చేతులు కడుక్కుంటూండగా పద్మ (శ్రీదేవి) మెల్లగా వచ్చి, ఆ కేరియర్ తీసుకెళ్ళి చల్లగా చెట్టెక్కి కూర్చుంది. రవి తిరిగివచ్చి చూసుకునేసరికి కేరియర్ లేదు. కిలకిలా నవ్వు వినిపించింది. తల ఎత్తి చూశాడు.

"ఏం బుల్లోడా? ఆకలిగా ఉందా?" పద్మ చిలిపిగా చూసింది.

"నువ్వా!... చూడు, బుల్లెమ్మా! ఇప్పటి దాకా కడుపుకే ఆకలైంది. నిన్ను చూస్తుంటే, కళ్ళకు కూడా ఆకలవుతోంది."

"సరే — ఇంకేం... అలా చూస్తూనే కడుపు నింపుకో. నేనీ కేరియర్ ఖాళీ చేసేస్తాను."

రవి చెట్టుకొమ్మ ఊపాడు. పద్మ జారి కింద పడబోగా, పట్టుకున్నాడు. ఇంతలో దోసుబాబు (సత్యనారాయణ) ఎక్కడ్నుంచో ఊడిపడ్డాడు. అతని పేరసలు బోసుబాబు కాని, ఎప్పుడూ దోసుమైకంలో ఉండడంవల్ల అతనికి దోసుబాబు మారుపేరయింది. అతన్ని చూడగానే పద్మ ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ ప్రాకినట్లయింది. "చచ్చాం పో. ఇక్కడ కూడా దాపరించాడే. ఇప్పుడెలా?" అంది. "ఇక మళ్ళీ నీ వెంటపడకుండా చేద్దాం. ఇలా రా!" అంటూ ఆమె చెవిలో రవి ఏదో చెప్పాడు. ఆమె తిన్నగా దోసుబాబు దగ్గరికెళ్ళి, "కల్లుపాకొదిలి పొలాలమీద పడ్డావేంటి, బావా?" అంది.

దోసుబాబు ఒళ్ళు పులకరించింది. "నీకోసమే వచ్చాను... చూడు, పద్మా! నీతో మన పెళ్ళి విషయం తేల్చుకుపోదామని వచ్చాను. నువ్వు అవునంటే, కల్లు గిల్లు మానేసి, సంసారినై పోతాను."

"నామీద నిజంగా అంత ప్రేముందా?" పద్మ క్రీగంట చూసింది.



'పల్లె పిలిచింది'లో రంగనాథ్, జ్యోతి



'మరో కురుక్షేత్రం'లో సువర్ణ, సాయిచంద్



'స్వయంవరం'లో జయప్రద

"అమ్మ నీయమ్మ... ఎంత మాటన్నావ్? నీకు నమ్మకం కలగాలంటే ఏం చేయమంటావో చెప్పు!"

"ఏం లేదు, బావా! ఇక్కడే రాయిలాగా నిలబడాలి.. ఇదుగో... ఈ గీసిన గీత దాటకుండా ఉండాలి."

"అంతే కదా? చచ్చినా దాటను," అంటూ విగ్రహంలా నిలుచుండిపోయాడు. కాని, అతని ఎదుట రవి, పద్మ పాడుతూ, డాన్స్ చేస్తూ నానా అల్లరి చేసేసరికి తిక్కరేగి, కదలబోయాడు.

"ఓడిపోయావు, బావా! ఇక నీకూ నాకూ ప్రేమ లేదు; దోమలేదు," అంది పద్మ.

వాళ్ళు తనతో ఆటపట్టించారని అప్పటికిగాని తెలిసింది కాదు దోసుబాబుకు. "అమ్మ నీయమ్మ... నన్నింత వెధవని చేస్తావా?" పళ్ళు పటపట లాడిస్తూ ఉక్రోషంతో బయలుదేరాడు.

ఎస్. పి. వెంకన్నబాబు నిర్మించే మహేశ్వరీ మూవీస్ "బంగారు భూమి" చిత్రానికి పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు.

శ్రీ సారథి స్టూడియోస్ కొత్త చిత్రం

"తయారీలో ఉన్న 'అంద ఏళునాట్కళ్' అనే భాగ్యరాజా చిత్రం చాలా గొప్పగా ఉందని విన్నాం. తయారైనంతవరకు చూశాం. వెంటనే తెలుగులో తీసేందుకు హక్కులు కొనేశాం. వెరైటీగా ఉన్న కథ. మన ప్రేక్షకులను చాలా బాగా ఆకర్షిస్తుంది," అన్నారు నిర్మాత పి. శశిభూషణ్. ఈయన, జి. డి. ప్రసాదరావు నిర్మించే ఈ చిత్రం షూటింగ్ ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 25 వరకు హైదరాబాద్‌లో ఒకే షెడ్యూల్లో పూర్తవుతుంది. భాగ్యరాజ్ కథ, ముళ్ళపూడి సంభాషణలు, కె. వి. మహదేవన్ సంగీతం, బాబా అజ్మీ ఛాయతో బాపు దర్శకుడు. చంద్రమోహన్, శరత్‌బాబు, రాధిక ఆదిగా గలవారుంటారు.



'చట్టానికి కళ్ళు లేవు'లో లక్ష్మి, మాధవి, రమణమూర్తి

సినిమా

చట్టానికి కళ్ళులేవులో ఇన్‌స్పెక్టరమ్మ హిరవు

దుర్గ (లక్ష్మి) తీక్షణంగా ఉండడం చూసి, సుభద్రమ్మ (పండరీబాయి) "ఎందుకమ్మా, అంత చిరుబురులాడుతున్నావ్? అసలేం జరిగింది?" అంది.

"ఇంకా ఏం జరుగుతుంది? తమ కుమార రత్నంగారివల్ల నాకు చెప్పుకోలేని చిన్నతనమైంది," అంది దుర్గ.

"విజయ్ వల్లనా? మళ్ళీ ఏం చేశాడమ్మా?"

"ఎవడో ఎవరికో అన్యాయం చెయ్యబోయాడట. ఈ హీరోగారు యుద్ధానికెళ్ళారు."

"అయ్యయ్యో! వాడికేం దెబ్బలు తగల్లేదు కదా? ఇంతకీ, ఏడమ్మా వాడు?"

"తల్లీ, వాడికే అపాయం జరగలేదుగాని, నువ్వు శాంతించు. హుం! ఇంకా వాడేం బాగుపడతాడు? ప్చ్! లాభంలేదు. వాడు పద్ధతులు మార్చుకోకపోతే – నేను ఉద్యోగం రిజైన్ చెయ్యడం బెటర్!" అని దుర్గ అంటూండగా విజయ్ (చిరంజీవి) "ఆ మాటన్నావ్. బాగుంది," అంటూ లోనికి వచ్చాడు.

"నోర్ముయ్!" దుర్గకు కల్గిన కోపం ఇంతా అంతాకాదు. కాని, విజయ్ వెకిలిగా నవ్వుతూ, "చూడు, ఇన్‌స్పెక్టరమ్మా! ఇది నీ స్టేషన్‌కాదు; ఇల్లు. ఇక్కడ మమకారం ఒక్కటే తప్ప – నీ అధికారం సాగదు. అర్థమైందా?" అన్నాడు.

సుభద్రమ్మ బాధతో "అసలు ఎందుకురా దాన్నలా ఉడికిస్తావ్?" అంది.

"అమ్మా, నేనేం దోపిడీలు, దొంగతనాలు చెయ్యటంలేదు. ఎవడో రౌడీ వెధవ ఒక ఆడపిల్ల



'రాణీకాసుల రంగమ్మ'లో శ్రీదేవి

చెయ్యి పట్టుకులాగితే బుద్ధి చెప్పానంతే."

అది సబబుగా తోచింది సుభద్రమ్మకు. "అందులో తప్పేముందమ్మా?" అని ప్రశ్నించింది కూతుర్ని.

"అది నీ కర్థం కాదమ్మా. అలాంటి చట్ట విరుద్ధమైనదేదైనా జరిగితే, కాపాడ్డానికి పోలీసులం ఉన్నాం. చట్టం ఉంది," అంటూ దుర్గ నచ్చజెప్పింది.

ఆ విషయాన్ని సుభద్రమ్మ ఒప్పుకున్నా – విజయ్ ఒప్పుకోవాలిగా?

అట్లూరి పూర్ణచంద్రరావు సమర్పించే శ్రీకర్ ప్రొడక్షన్స్ "చట్టానికి కళ్ళులేవు" చిత్రాన్ని ఎస్. ఎ. చంద్రశేఖర్ దర్శకత్వంలో వంకినేని సత్యనారాయణ నిర్మిస్తున్నారు.

రిజిష్టరయిన చిత్రాల పేర్లు

శ్రీ నవచక్ర పిక్చర్స్ "ఒకపూవు ప్రయాణం," ఆదిత్య పిక్చర్స్ "కార్మిక శక్తి", రూబీ మూవీస్ "జరగబోయే చరిత్ర", అరుణోదయ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ "మహిషాసుర మర్దిని", టి. జి. కె. ఫిలిమ్స్ "శివసేన విజయం", సూర్యా ఆర్ట్ మూవీస్ "బుద్ధుని చరిత్ర", మయూర ఎంటర్‌ప్రైజెస్ "చీకట్లో చంద్రుడు", రైన్‌బో సినీ ఆర్ట్స్ "కోడలు కావాలి", మహీజా ఫిలిమ్స్ "ముద్దుల మొగుడు", శ్రీ లక్ష్మి శ్రీనివాస ఫిలిమ్స్ "మన ఊరు మల్లి", సుభద్ర ఎంటర్‌ప్రైజెస్ "మాస్టారమ్మాయి", టి.బి.కె. ఫిలిమ్స్ "నా పేరే శంకర్", కనకధార ఫిలిమ్స్ "నటశేఖర సవాల్", రాజా సినీ మూవీస్ "పదుమ పెళ్ళాం–ముసలి మొగుడు," "ప్రేమ కెరటాలు", నవతరం పిక్చర్స్ "ప్రజాశక్తి", సేతు పిక్చర్స్ "శ్రీ రంగనాథ కళ్యాణం", ఉషశ్రీ క్రియేషన్స్ "సంసార స్వప్నం", జయకృష్ణ ఆర్ట్ మూవీస్ "త్రిమూర్తులు", విజయదుర్గా ఆర్ట్స్ "తప్పెవరిది".

'నాయుడుగారబ్బాయి'లో సుకుమారి, అంబిక, నాగేష్



ఇరుగు - పొరుగు

★ "సప్తపది" చిత్రంలో హరిజనుని పాత్ర ధరించిన గిరీశ్‌కు గాత్రదానం చేసింది డైరెక్టర్ కె. విశ్వనాథ్.

★ కాంగ్రెస్ 'ఐ' పార్టీకి చెందిన నరసమ్మా నాయర్ పుత్రిక నటి అంబిక ఇటీవలే తిరువనంతపురంలో బి. యె., పరీక్షలకు హాజరై వచ్చింది. ఈ నటి మలయాళంలో కొన్ని కథలు రాసింది. వాటిలో కొన్నింటిని తమిళంలోకి తర్జుమా చేస్తోందట.

★ కొందరు హిందీ తారల తల్లులు ఇంట్లో ఊరికే తింటూ కూర్చోవడంలేదు. నీతుసింగ్ తల్లి 'మై ఫేర్ లేడీ' అనే బ్యూటీ పార్లర్ నడుపుతోంది. షబ్నా ఆజ్మీ తల్లికి, సరిక తల్లికి చీరల కొట్లున్నాయి.

★ కె. రాఘవ "తూర్పు – పడమర" చిత్రాన్ని హిందీలో నిర్మిస్తారు.

★ "మాకు అబ్బాయి పుడితే రాఘవేంద్ర అని, అమ్మాయి పుడితే అనూరాధ అని పేరు పెట్టాలనుకున్నాం," అన్నారు ఇటీవల మలేషియాకు మధుచంద్ర (హనీమూన్)కు వెళ్ళొచ్చిన రజనీకాంత్ దంపతులు. 'మీసం కోసం' చిత్రం కోసం రజని తీసేసిన మీసాన్ని ఇంకా పెంచలేదు. "ఇంకా పాచ్ వర్క్ కొంత ఉంది. ఆ తర్వాత యథాప్రకారం మీసం ఉంచేస్తాను అసలు నేను బెంగళూరులో బస్ కండక్టర్‌గా పని చేస్తున్నప్పుడు మీసం ఉండేది కాదు. కొందరు ప్రయాణీకులు 'ఇదుగో, అబ్బాయీ, టిక్కెట్టు ఇవ్వు,' అని అడగడంతో రోషంతో మీసం పెంచనారంభించాను," అన్నాడతను.

★ "నా మతాన్ని ఒక ట్రెయిన్ మార్చేసింది," అంది నహాసిని నవ్వుతూ. "కొన్ని రోజుల క్రితం నేను తిరుచ్చినుంచి మద్రాసుకు తిరుగు ప్రయాణంలో స్టేషన్‌కు ఆలస్యంగా చేరుకున్నాను. ఇంకాస్సేపటికి బండి బయలుదేరబోతోంది. రిజర్వేషన్ ఛార్ట్‌లో నా పేరు కనిపించక గాభరాపడ్డాను. తర్వాత కండక్టర్ మూలంగ తెలిసింది – నా పేరు 'హాసిని' బదులు 'హాసినా బేగం'గ టైప్ చేయబడింది!" అందామె.

★ శివాజీగణేశన్ నటించే "గరుడా, సౌఖ్యమా ?" అనే తమిళ చిత్రాన్ని కె ఎస్. ప్రకాశరావు డైరెక్ట్ చేస్తున్నారు. "పాముకు, గరుత్మంతునికి బద్ధవైరం. కాని, శివుని శిరస్సులో ఉండే పాము, విష్ణువు వాహనమైన గరుత్మంతుని చూడగానే 'గరుడా, సౌఖ్యమా ? అని పలకరిస్తుందట. ఈ విషయమై తమిళనాడులో ఒక కథ చెప్పుకుంటూంటారు. ఆ టైటిల్ ఇన్‌స్పిరేషన్‌తో మేం ఒక కథను తయారుచేశాం," అన్నారు ప్రకాశరావు.

★ "మరో చరిత్ర" హిందీ చిత్రం విడుదల సందర్భంగా మాధవి బొంబాయికి వెళ్ళివచ్చింది. "రాజ్ కపూర్ గారిని కలిశాను. ఆయన నా నటనను మెచ్చుకుంటూ, 'నువ్వు అచ్చం వైజయంతిమాలలా ఉంటావు. ఆమె నెప్పుడైనా చూశావా ?' అన్నారు. లేదన్నాను. 'చూస్తే, నే చెప్పింది కరెక్టని ఒప్పుకుంటావు' అన్నారాయన. ఎప్పుడైనా వైజయంతిమాల గారిని కలుసుకొని, మాట్లాడాలి," అంది మాధవి.

సి ని మా

సి. ఐ. డి. సికిందర్‌లో మలుపు తిప్పిన మారుతి

సినీ నటి స్నేహలత భవంతి. మేడ దిగి వచ్చిన అర్జునరావు (పి. జె. శర్మ), సోఫాలో కాళ్ళు బారచాపుకొని కూర్చొనియున్న మారుతి(ఈశ్వరరావు)ని చూసి, నొసలు చిట్లించాడు. "ఎవరు నువ్వు ?"

"అది మనం అడగాలి " మారుతి నిర్లక్ష్యంగా జవాబిస్తూ, "నువ్వెవరు ?" అన్నాడు.

"ఆఁ! నేనెవరా ? మా ఇంటికొచ్చి నన్ను దబాయిస్తున్నావేంటి ? గూర్ఖా ! గూర్ఖా !"

"వాడెందుకు ?"

"మెడపట్టి బయటకు గెంటించడానికి. లేకపోతే, పిచ్చాసుపత్రికి పంపించడానికి . . ఇది సినిమా స్టార్ స్నేహలత ఇల్లు."

"అంతకుముందు పచ్చిపులుసుఅంజమ్మఇల్లు."

"ఆఁ!" అర్జునరావు అదిరిపడ్డాడు "అంజమ్మ నీకెలా తెలుసు ? అసలు నువ్వెవరు ?"

"ఎవరా ? ముందు అంజమ్మనిలా పిలువు అదే చెప్తుంది ... నేను ఈ ఇంటి ఓనర్ని అంజమ్మకు స్వయానా మేనమామ కొడుకుని. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే, ఈ ఇంటి ఓనర్ని ఆ తర్వాత మీ వనోళ్ళందరికీ మొగుడ్ని."

అర్జునరావుకి చిర్రెత్తిపోయింది. "అత్తయ్యా, అత్తయ్యా !" అని పిలిచాడు. అప్పలమ్మ (అత్తిలి లక్ష్మి) వస్తూనే మారుతిని చూసి, నివ్వెరపోయింది "ఏరా, మారుతీ ! నువ్వెప్పుడొచ్చావురా ?" అంది

"ఎందుకలా ఖంగు తింటావ్ ? నవ్వుతూ మాట్లాడొచ్చుకదా ? సరే...అంజమ్మ ఎక్కడ?"

"అమ్మాయి పేరు ఇప్పుడు అంజమ్మ కాదు, స్నేహలత."

"రోజుకో పేరు. రోజుకో మొగుడు సినిమాల్లో అవన్నీ ఎక్కడ గుర్తుంటాయ్ ? రేపు ప్రొద్దున పెళ్ళయ్యాక దాన్ని అంజూ అని పిలుస్తాను. కాని, స్నేహలతనో, నుంజాలతనో పిలుస్తానా నేను ? అవునూ – దాన్ని పిలవ్వేమిటి నువ్వు ?"

"లేదు. షూటింగ్‌కి వెళ్ళింది "

ఇంతలో అర్జునరావు "ఎవడే వీడు ?" అని అప్పలమ్మను అడిగితే, మారుతి జవాబిచ్చాడు. "చూడూ ... నీ పనేమిటంటే – వచ్చిన వాళ్ళను మర్యాదగా పలకరించడం. భోజనం చేయించడం ఆ పైన సాగనంపడం ... నా గొడవ నీకెందుకు చెప్పు. ఇది ఫామిలీ మేటరు. పర్సనల్ గొడవ–నీకు తెలియదు. ఆ రోజున మనం పొలం అమ్మి, అంజమ్మ సినిమాల్లోకి రావడానికి అయిదు వేలు ఇచ్చాం. ఆ డబ్బు ఇవ్వబట్టే ఆమె సినిమాస్టార్ అయింది సర్లే ... స్నానం చెయ్యాలి. నీళ్ళు పెట్టించు. ఆకలేస్తోంది అన్నం కూడా తినేస్తాను. రెడీ చేయించు," అని తిష్టవేసుకు కూర్చున్న మారుతి వంక అర్జునరావు, అప్పలమ్మ గుడ్లప్పగించి చూస్తూండిపోయారు.

దాసరి నారాయణరావు కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చిన నవజ్యోతి పిక్చర్స్ "సి. ఐ. డి సికిందర్" చిత్రాన్ని దుర్గా నాగేశ్వరరావు దర్శకత్వంలో ఎస్. సాంబశివరావు నిర్మిస్తున్నారు కొంపెల్ల విశ్వం సంభాషణలకర్త. చక్రవర్తి సంగీత దర్శకుడు.

పక్కింటి అమ్మాయిలో బుచ్చిబాబుకి బెడద

డాన్సు మాస్టారు (చక్రవర్తి) ట్యూషన్ అయిపోయాక వచ్చీ రాని తెలుగులో "ఇందూ, నా పాట నీకు ఎప్పిడి ఇరికి ?" అన్నాడు. ఇందు (జయసుధ) "బావుంది, మాస్టారూ ?" అని అనడమే తరువాయి అతగాడు మరింత ఉప్పొంగిపోయి, "నా పాట అంటే ఇష్టమా, ఇందూ ? రొంబ ఇష్టమా ? రొంబ రొంబ ఇష్టమా ?" అంటూ ఆమెను సమీపించబోయాడు.

ఈ దృశ్యాన్ని చూసిన పక్కింటి బుచ్చిబాబు (చంద్రమోహన్) అతని మిత్రులు గాభరాపడ్డారు

"బుచ్చీ, ఆ మాస్టారు రెచ్చిపోయి ప్రేమిస్తున్నాడు. తుమ్మజిగురులా అతుక్కుపోతున్నాడు. ఇక నువ్వా అమ్మాయిని మరిచిపోవటం మంచిది," అంటూ బాకా (చలం) ఏడ్పుముఖం పెట్టాడు.

"ఏవిట్రా ! అంతా అపశకున పక్షుల్లా కూస్తున్నారు ?" కంగారుపడ్డాడు బుచ్చిబాబు.

బాలు (ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం) ఓదార్చాడు : "బుచ్చీ, ఒక డాన్స్ మాస్టారుతో మనం ఓడిపోతే, మనం బతకడమే వృథా. వాడిని ఓడించి, నువ్వు గెలవాలి. వాడిని తప్పించి, నువ్వు ఆమె ప్రేమను పొందాలి."

బుచ్చికి కాస్త ధైర్యం కలిగింది. "నువ్వు ధైర్యమిచ్చి తోడుగా ఉంటే చాలు, గురూ ! ఒక్క డాన్సు మాస్టర్నేమిటి ? సంగీతం మాస్టర్ని ఫైట్ మాస్టర్ని – ఎవడినైనా ఓడిస్తా."

బాలు ఆశీర్వదించాడు "విజయోస్తు ! బుచ్చీ, మన పంచరత్న నాటక సమాజం విజయం తప్ప అపజయం ఎరుగదు కనక, గెలుపు నీదే ! ఆ డాన్స్ మాస్టర్‌గాడ్ని ఓడించి, కాళ్ళు విరగ్గొట్టి, కథా కళీ ఆడించాలి."

వందాన పాడారు మిత్రులంతా.

కె సి. శేఖర్‌బాబు సమర్పణలో ఎ. సారథి నిర్మించే నాగార్జున ప్రొడక్షన్స్ "పక్కింటి అమ్మాయి" చిత్రానికి కె వాసు దర్శకుడు ★


వివేకా ఫైన్ ఆర్ట్స్
జీవితరథం
ఈస్ట్‌మన్ కలర్
లక్ష్మీచిత్ర శ్రీలక్ష్మీచిత్ర
విజయవాడ సికింద్రాబాద్
SREE PUBS.
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: వి.మధుసూదనరావు
నిర్మాతలు: జి.గోపీమురళి, 'జ్యోతి' కుమారస్వామి
సంగీతం: చక్రవర్తి

సీరియల్

రాగజ్వాల



చిట్టూరెడ్డి సూర్యకుమారి

పన్నెండు గంటల వేళ, తన కోసం ఎవరో విజిటర్స్ వచ్చారని, గదిలో కూర్చున్నారని ప్యూన్ వచ్చి చెప్పాడు. అక్కడవున్న పేషంట్లను చూసి పంపేసి చేతులు కడుగుకుని ఆ గదిలోకి వెళ్లింది. అన్నయ్య, అక్కయ్యకాక మరో వ్యక్తి కూడా వున్నాడు. 'వూరక రారు మహానుభావులు' అని మనస్సులో అనుకుంది. ఇప్పుడు వారి మధ్య ఆప్యాయతలు, అనురాగాలు అట్టేలేవు. అన్నయ్య హెన్ పెక్డ్ భార్యను ప్రేమించటం కంటే భయ పడుతాడు. అక్కయ్యంత స్వార్థపరురాలిని తనెక్కడా చూడలేదు ... దానికి తోడు అందరూ ఆడపిల్లలే పుట్టారు.

"ఎప్పుడొచ్చావ్" అని అక్కను పలుకరించి వెళ్లి తన కుర్చీలో కూర్చుంది.

"వచ్చి వారం అయ్యిందిలే" అంటూ వసుంధరను పరీక్షగా చూసింది. 'ముప్పైయేళ్లు వస్తున్నా ఇంకా లేతగానే వుంది' అనుకుంది.

"వదినవాళ్లు బాగున్నారా ..." అంటూ అన్నయ్యను చూస్తూ, అతని ప్రక్కన వున్నతని వైపు చూపు మరల్చింది నలభై, నలభైఅయిదు సంవత్సరాలు వుండవచ్చు — బట్టతల — కళ్ళజోడు పనిచేసి చేసి, అలసిపోయిన డాక్టరులాగా వున్నాడు తెల్లటి షర్ట్ టక్ చేశాడు ఏ మాత్రం బొజ్జ లేదు

"వసుంధరా! వీరు డాక్టర్ శ్రీనివాస్ చెప్పాలంటే బోలెడన్ని డిగ్రీలు వున్నాయి. అవి నాకు గుర్తులేవు ఫారిన్ రిటర్న్డ్ . ." అని చెప్పాడు

నమస్కార ప్రతి నమస్కారాలు అయ్యాయి. వారి మధ్య మరేమి మాటలు జరుగలేదు అన్నయ్య ఏదో చెప్పాలనుకుంటూ చెప్పలేనట్లు చూస్తున్నాడు

"వసుంధరతెలివిగలది. నాన్నతెలివి—అన్నయ్యకు రాలేదు కాని దీనికి వచ్చాయి తన వాటా అలాగే ఖర్చుకాకుండా వుంది పైగా సంపాదన బోలెడంత వున్నట్లు వింది పెళ్లి పెటాకులు లేవు ఆస్తి అంతా ఎవరు తినాలి? ఎవరికి పోతుందో" అన్న ఆలోచనలో వుంది అక్క. ఆ సమయాన మల్లమ్మ టిఫెన్ క్యారియర్ పట్టుకువచ్చింది. మల్లమ్మను చూడగానే వసుంధర విషయాలు తెలుసుకోటానికి, కబుర్లు వేయటానికి లేచివెళ్లింది — మల్లమ్మ బల్లపై క్యారియర్ సర్దుతూ వుంది.

"మల్లమ్మా బాగున్నావా?" అంటూ ప్రక్కకు తీసుకువెళ్లింది. "మా వసుంధర సంగతి ఏమిటి? మళ్లీ పెళ్లి చేసుకుంటుందటనా ?"

(గత సంచిక తరువాయి)

ఒకసారి పెళ్లి అయినట్లు మళ్లీ పెళ్లిఏమిటి? ఈవిడకు స్వంత తోబుట్టువు సంగతి తెలియదా! అన్నట్లు లోపల కోపంగా చూస్తుంది మల్లమ్మ పైకి "నాకేం తెలుసమ్మ! అక్కగారికే తెలియాలి" అంది.

దీని తెలివి మండిపోను — ఒక్కమాట కూడ రాబట్టలేము దీని దగ్గర. ధర్మరాజు శాపం పని చేసినట్లులేదు — పైకి "ఈ రోజు ఏమి వండావు. ఆ . . త్వరలో పెళ్లి భోజనం వండాల్సి వస్తుంది పనివాళ్ళకి ప్రేమను, బాధ్యతలు వుంటాయా? నీవే చెప్పు మా వసుంధరను చూస్తూ చూస్తూ అలా వదిలేయలేము. రక్తపాశం వూరుకోదుగా — అందుకే అన్నయ్య వసుంధరకు పెళ్లి చేయాలని వున్నాడు. అక్కడ కూర్చున్నాడే ఆయనే వరుడు. వసుంధర విషయాలన్నీ దాపరికం లేకుండా చెప్పేశాము. అన్నింటికి వప్పేసుకున్నాడు. కట్నం అవసరం లేదు. అతనికే బోలెడంత వుంది. కాకపోతే ఇండియాలో ప్రాక్టీసు పెట్టుకోవాలనుకున్నాడు డాక్టరు భార్య అయితే బాగుంటుంది. ఇద్దరు కలసి స్వంత ఆసుపత్రిలో పనిచేసుకోవచ్చు, అని అనుకున్నాడు .. ఎలావున్నాడు? నీకు నచ్చాడా?" అంటూ మల్లమ్మ ముఖంలోకి చూసింది. ఆ మాట వినగానే మల్లమ్మ వెళ్లి అతన్ని ఎగాదిగ చూసింది. అతను మెల్లిగా వసుంధరతో ఏదో మాట్లాడుతున్నాడు.

మల్లమ్మ ముఖం ముడుచుకుని వచ్చింది.

"మల్లమ్మా! నీకు నచ్చలేదు కదూ ?"

"ఆయనకి పెళ్లి అయిన డాక్టరమ్మే కావాలి నేను డాక్టరిని అయి బాగా ప్రాక్టీసు వుంటే — దెవ్వరినైనా చేసుకునేలాగా వున్నాడు. సగం వయస్సు అయిపోయింది. ఇంక పెళ్లాం ఎందుకు ?"

"మంచి మాట చెప్పావ్ మల్లమ్మా! నాకు నచ్చలేదు. మొగుడే కావాలనుకుంటే — దొరకడా! ఎవ్వరూ లేనప్పుడు, అక్క మొగుడే దిక్కు! మరదళ్లకు పెళ్లి కానంతవరకు బావలకు ఆశగానే వుంటుందంట... చెప్పొద్దు. నాకా మగపిల్లలులేరు అందుకే వసుంధరని మావారికిచ్చివేద్దామనుకుంటున్నాను. ఈ మధ్య రాజకీయాలలో చేరిపోయారు. రేపో మాపో మంత్రి అయిపోతారు .. చూడు నా సౌభాగ్యాన్ని నా చెల్లెలికి పంచాలనుకుంటున్నాను. దానికి నేనంటే చిన్నప్పటి నుండి గిట్టదు మల్లమ్మా..." మల్లమ్మవైపు చూసింది అక్కడ మల్లమ్మ లేదు. ఎప్పుడు వెళ్లిపోయిందో.. ఆమె మూతి మూడు వంకరలు తిప్పుకుంటూ తిరిగి వారి దగ్గరకు వచ్చింది.

* * *

మల్లమ్మ హాస్పిటల్‌కి వచ్చేముందు టైం అయ్యిందని, సుందర్‌కి అన్నం పెట్టి — బల్లమీద మూర్తికి సర్ది "మీ డాడీకి భోజనం పెట్టు ... జాగ్రత్తగా వుంటావుగా..." అని చెప్పి హాస్పిటల్‌కి వచ్చేసింది.

మల్లమ్మ అటుపోగానే ఇటు లిల్లి వచ్చింది ఆడుకోటానికి. లిల్లి ముందు సుందర్, మూర్తిలు కొడుకు తండ్రుల నాటకం మొదలుపెట్టారు. లిల్లి వేసే ప్రశ్నలకు నుదురు కొట్టుకోసాగాడు మూర్తి

భోజనం చేసి తన గదికి వెళుతుంటే, "సుందర్! మీ డాడీ ఎప్పుడు క్రిందనే వుంటాడు? ఇక్కడ నీవు, మీ మమ్మీ వుంటారెందుకు!?"

లిల్లి మాటలకు సుందర్ ప్రశ్నార్థకంగా మూర్తివైపు చూశాడు. వెళుతున్న వాడల్లా ఆగి చొక్కా విప్పి మంచంమీదకు విసిరి —

"సుందర్! నా సిగరెట్ పెట్టె తీసుకురా" అని హుకుం జారీచేసి మంచంపై పడుకున్నాడు

జరిగిన కథ — 9 : నాగయ్య, అమరేశ్వరిలకు ముగ్గురు కూతుళ్లు, ఒక్క కొడుకు విష్ణు. పెద్ద కూతుళ్లిద్దరు ఉద్యోగాలు చేస్తున్నారు. మూడవ కూతురు రమ్య, ఎదురింటి శ్రీకాంత్ ప్రేమించుకొంటారు. వాళ్లొకరోజు లేచిపోయి గుళ్ళో పెళ్లి చేసుకొని, కొత్త జీవితం ప్రారంభిస్తారు. ఇంటి యజమాని వెంకట్రావ్ భార్య సుగుణ రమ్యను తన సొంత చెల్లెలుగా చూసుకొంటుంటుంది రమ్యకు గర్భం వస్తుంది ఈ వార్త పిల్లలు పుట్టని సుగుణకు బాధ కలిగిస్తుంది. కానీ ఆమె కూడా గర్భవతి అవుతుంది. వెంకట్రావ్‌కు కూతురు పుడుతుంది. శ్రీకాంత్ చిన్ననాటి స్నేహితురాలు డా॥ వసుంధర అతనితో అంత క్లోజ్‌గా ఉండడం సహించలేకపోతుంది రమ్య. రమ్య కొడుకు సుందర్‌కి ఓ రోజు జబ్బుచేస్తే వసుంధరే ఆదుకొంటుంది. అప్పట్నుంచీ వసుంధరను చేరదీస్తుంది రమ్య. వసుంధర శ్రీకాంత్‌ను తనవాడిగా చేసుకోవటానికి ప్రయత్నిస్తూంటుంది. తన వాడనుకొన్న శ్రీకాంత్ వసుంధర సొంతమైనాడని అనుమానించిన రమ్య, బాబుని వసుంధరకు అప్పగించి ఎటో వెళ్లిపోతుంది శ్రీకాంత్ ఆ షాక్ నుంచి తేరుకొని తన దగ్గరకు వస్తాడన్న ఆశతో ఎదురు చూస్తూంటుంది వసుంధర. ఆమెకు వుత్తరం ద్వారా తెల్పి శ్రీకాంత్ కూడా ఎటో వెళ్లిపోతాడు. మెడికల్ రిప్రజెంటేటివ్ మూర్తి వసుంధర ఇంట్లో అద్దెకు దిగుతాడు. అతనితో చనువుగా వుంటుంటాడు సుందర్ సుందర్ తన గర్ల్ ఫ్రెండ్ లిల్లీకి ఇల్లు మొత్తం చూపిస్తాడు. లిల్లీతో తన తండ్రి మూర్తేనని అబద్ధం చెప్పి, మూర్తిని నప్పించుతాడు. ఫైర్ ఆక్సిడెంట్‌కి గురైన వసుంధరను రక్షించుతాడు మూర్తి.

సుందర్ వెంట నడుస్తూ లిల్లి–మీ డాడీ సిగరెట్లు కాలుస్తాడా ! మీ మమ్మి వూరుకుంటుందా ? మీ డాడి సిగరెట్లు కాలుస్తా(ని మీ మమ్మికి చెప్పేయ్."

సిగరెట్టు ప్యాకెట్టు పట్టుకుని పరుగెత్తుకుంటూ వచ్చి పొట్టమీద కూర్చుని "డడీ ! సిగరెట్టు కాలుస్తున్నావా ? ఎప్పటినుంచి. మమ్మికి చెప్పమంది లిల్లి" అన్నాడు గుక్క తిప్పకోకుండ.

"సెకండ్ ఫారమ్ నుండి కాలుస్తున్నాను. ఏదీ నీవు ఒక దమ్ములాగు" అంటూ సిగరెట్ వెలిగించి – ఒకసారి పీల్చి - సుందర్ నోట్లో పెట్టాడు. సుందర్ ఒకసారి తాగి–పొగ వదులుతూ "భలే భలే" అంటూ చప్పట్లు కొట్టాడు. వాళ్ళిద్దరూ నవ్వుకుంటూ వుంటే లిల్లికి కోపం వచ్చి బయటికి వెళ్ళింది.

రెండు గంటల ప్రాంతంలో వసుంధర ఇంటికి కారులో ముగ్గురు ఆడవాళ్ళు వచ్చారు. ఆ ఇంటికి ఆడవాళ్ళు యే వేళప్పుడైనా వస్తుంటారు. అందులో కొత్త లేదు. వాళ్ళు నేరుగ పైకి వచ్చారు. బయట కూర్చుని బొమ్మతో ఆడుకుంటున్న లిల్లితో "వసుంధర వుందా ?" అని ఒకామె ప్రశ్నించింది.

"డాక్టరమ్మగారు లేదు. ఆమె అబ్బాయి – వాన్నగారు లోపల నిద్రపోతున్నారు" అని చెప్పింది. వాళ్ళు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"అమ్మాయ్ నీ వెవరు" మరొకామె ప్రశ్నించింది.

"ముకుందరావుగారి అమ్మాయిని. అదే మా యిల్లు."

"ఆహా .. డాక్టరమ్మగారి అబ్బాయి -- ఆమె మొగుడు వున్నారంటావ్" వ సు ం ధ ర వదినగారు క్రిందకు వంగి అడిగింది

ఆమె తల్లి బుగ్గలు నొక్కుకుంటూ "వసుంధరకు పిల్లాడేకాని – మొగుడు లేడని చెప్పావ్ !" అంది.

అవును అన్నట్లుగా తలవూపి మెల్లగా లోపలికి వెళ్ళింది. సుందర్, మూర్తిపై కాలువేసి పడుకున్నాడు. మూర్తి మంచి నిద్రలోవున్నాడు. నిదానంగా, బాగ గమనించి చూసి, వెళ్ళినంత మెల్లగా బయటికి వచ్చింది.

"వాడెవ్వడు ?" ఆమె వెనకాలే వున్న ఆమె తల్లి పెద్ద గొంతుకతో అడిగింది.

"ఏమో ! ఇతను మాత్రం అతను కాదు ఇతను చిన్నవాడుగా వున్నాడు ..."

"చిన్నవాడో – చితకవాడో – మగాడు. అవసరానికి పనికివస్తాడు. హవ్వ ! ఎంత డాక్టరమ్మ అయితే మాత్రం ఇంతగ తెగిస్తుందా ! చెల్లెలు బజారుకు ఎక్కితే నీ మొగుడు ఎలా వూరుకున్నాడు. మీకు పరువు, ప్రతిష్టలు ఇంకేమి మిగిలాయి. రేపు నీ కూతుళ్ళకి పెళ్ళిళ్ళు ఎలా చేస్తావో – మేనత్త చేస్తున్న పనిని ఎత్తి చూపించరా ? తగుదునమ్మా అంటూ ఈ భోగం కొంపకి పిలుచుకు వచ్చావు. పద ... పద ... మనల్ని ఎవ్వరూ చూడకముందే వెళ్ళడం మంచిది" అంటూ వెనక్కి తిరిగింది.

అంతవరకూ ఏమి మాట్లాడక వారి వెనుక నిలుచున్న వృద్ధురాలు–ముందుకు వచ్చి బెడ్‌రూం గదిలోకి వెళ్ళింది.

బయటివారి మాటలకు మేల్కొన్న మూర్తికి పూర్తిగా నిద్రమత్తు వదలిపోయింది. కళ్ళు పెద్దవి చేసి ద్వారం వైపుకు చూస్తున్నాడు. అతడు వారి మాటలన్నీ విన్నట్లుగా వుంది. కళ్ళు ఎర్రబడ్డాయి. లోపలికి వచ్చిన ఆ వృద్ధురాలిని చూసి పైకి లేచి నిలుచున్నాడు. అప్రయత్నంగ చొక్కా కొరకు చూసుకున్నాడు. సుందర్ క్రింద ఆ చొక్కా నలిగిపోయింది.

"అబ్బాయ్ ! నీ వెవరు ? నీవు ఇక్కడ వసుంధర పడక గదిలో ఎందుకు వున్నావ్" ఎందు గొంతుతో చూపుడు వేలు చూపిస్తూ అడిగింది.

ఆవిడ అరుపులకు వులిక్కిపడి లేచాడు సుందర్. చొక్కా తీసి వేసుకున్నాడు మూర్తి. ఆమెకు జవాబు చెప్పలేదు.

"ఏం ? మాట్లాడవేం ?? అడిగే హక్కు నాకుంది. నేను వసుంధర అత్తను మేనత్తను – దానిని పెంచింది నేనే ..."

"అతడు ఏమని చెపుతాడు? వసుంధర ప్రియుడ్ని అని చెపుతాడా ?" వసుంధర వదిన అందుకుంది.

చివ్వున చూశాడు. కళ్ళు నిప్పు కణాల్లా భగ్గుమంటున్నాయి. అప్రయత్నంగ మూర్తి ఒకడుగు ముందుకు వేసి –


"ఆడదానివి కాబట్టి బ్రతికిపోయావు మగాడివైతే ఈపాటికి " పళ్ళు పటపట లాడించాడు

"కొట్టావా? ఏది? కొట్టు. వున్న మాటంటే వుల కెక్కువ. ఆమెకు జవాబు చెప్పలేదే ?"

"ఈ పిల్లాడు నీకేమవుతాడు ? వసుంధర నీకేమవుతుంది ?. చెప్పు" సవాలు చేస్తున్నట్లుగ తల ఎగురవేసింది.

సుందర్ బిక్క చచ్చినట్లు కూర్చున్నాడు. వాడి కళ్ళన్ని బొమ్మని పట్టుకుని కూర్చున్న లిల్లి పైనే కేంద్రీకరించి వున్నాయి. బొమ్మ పట్టుకుని కూర్చున్న లిల్లి ఎవ్వరు మాట్లాడుతుంటే వారి వైపు గమనింపుగా చూస్తూంది – మాటలన్నీ ఆకలింపు చేసుకుంటూ మూర్తి ఏమి జవాబు చెప్పతాడో అన్నట్లుగా తలెత్తి మూర్తివైపు చూస్తూవుంది

వదిన ఎగతాళిగా నవ్వుతోంది – వృద్ధురాలు హుంకాగా, జడ్జిలాగ చూస్తూంది తను చెప్పే




దానిపై వసుంధరకు ఇచ్చే తీర్పు — ఆధారపడి వుంటుంది. వదిన అమ్మగారు ఆ ఇంట్లోకి అడుగు పెడితే పాపం అంటుకుంటుందన్నట్లుగా అసహ్యంగ చూస్తోంది.

తను చెప్పేదాన్నిబట్టే వసుంధర పరువు, మానం—సుందర్ గౌరవాలు ఆధారపడి వుంటాయని గ్రహించాడు. ఆ చిన్నవాడి గుండె వేగంగా కొట్టుకుంటుందేమో! అని అనుకోగానే అక్కడ నిలుచున్న వారందరిపై కోపం వచ్చింది. వారి నోళ్ళు నొక్కాలనిపించింది. వీరందరూ వసుంధర కాలిగోటికి సరితూగరు. ఆమె మంచితనం — ప్రేమ ఆమెకు పెట్టని ఆభరణాలు. వీళ్లా వసుంధరను వేలెత్తి చూపేది ?

"మీకు జవాబు చెప్పే అవసరం నాకు లేదు. అయినా మీ నోళ్ళు మూయించాలి కదా! మానవత్వం, నాగరికతలేని నోటికి హద్దువుండదు...

ఇన్‌క్రిమిన్ బాలలు
కేవలం పెద్దగాకాదు, ఎంతో చక్కగా పెరిగే పిల్లలు!






ఇన్‌క్రిమిన్ టానిక్ పెరిగే వయసులో ఎంతో పెద్ద... పెద్ద తేడాను తెస్తుంది. నిజానికి అసలు విషయం ఏమిటంటే ఇన్‌క్రిమిన్ టానిక్ ఇతర టానిక్‌లకన్న ఓ మెట్టు పైనుంది. ఎందుకంటే, ఆరోగ్యమైన పెరుగుదలకోసం అత్యవసరమైన విటమిన్లతోపాటు ఇన్‌క్రిమిన్‌లో లైసిన్ కూడా ఉంది గనక. ఆ లైసిన్ ఆకలిని పుట్టిస్తుంది.

పిల్లలు చక్కగా పెరగాలంటే బాగా తినాలన్న మాట ప్రతి తల్లికీ తెలుసు. ఈ ఇన్‌క్రిమిన్ అలా బాగా తినే ఆహారాన్ని మేలైన పెరుగుదలకు తోడ్పడేలా మారుస్తుంది మరి.

Lederle ఉత్పాదన
అమెరికన్ సయానమిడ్ కంపెనీవారి రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్



ఇన్‌క్రిమిన్* టానిక్
తినేమంచి ఆహారాన్ని తీరైనపెరుగుదలగా మారుస్తుంది.

Sista s-INC-1064/80 TEL

వీడు నా కొడుకు — వసుంధర నా భార్య .. మీకు తెలుగువచ్చు కదా! ఇక బయటికి వెళ్లండి'' అని తిరిగి మంచంపై కూర్చుని, సిగరెట్ వెలిగించి పొగలాగి — శిలలా కూర్చున్న సుందర్ నోటికి సిగరెట్ అందించాడు. నేరుగా మూర్తిని చూసి — వచ్చి మెడ కౌగిలించుకున్నాడు సుందర్. సుందర్ వీపు నిమురుతూ వుండిపోయాడు మూర్తి.

వసుంధర వదిన వెళుతూ ''వీడ్ని ఎప్పుడు కట్టుకుందో తెలియదు నాకేదో అనుమానంగా వుంది. వసుంధర పెళ్లి చేసుకుంటే ఎందుకు దాచుకుంటుంది...?'' గొణుగుతూ తల్లి వెంట నడిచింది ద్వారంలోనే వసుంధర ఎదురైంది. వసుంధర, వెనుక మల్లమ్మ - ఆ ప్రక్క అక్కగారు, అన్నగారు — ఓ ప్రక్కన విడిగా నిలుచున్న డాక్టర్ శ్రీనివాసరావు వున్నారు. వదినగారు వసుంధరను చూసింది.

''ఆ అబ్బాయిని వుంచుకున్నావా? కట్టుకున్నావా?'' అని అడిగింది.

వసుంధర ముఖం వివర్ణమైపోయింది. గోడను ఆధారంగా చేసుకుని నిలుచుంది. తను చూస్తున్నదేమిటి? విన్నదేమిటి? ఆమెకే తెలియలేదు వదినగారు పోతూ పోతూ హుంకరించి భర్తను లాక్కుపోయింది అలా ఎంతసేపు నిలుచుందో తనకే తెలియదు. చిన్నప్పుడు తనను పెంచిన అత్త ''వసుంధరా'' అని పిలుస్తే తల ఎత్తింది ఎదుట ఆమె తప్ప ఎవ్వరూ లేరు. తనను చేసుకుంటానని చెప్పి తన విషయాలన్నీ తెలుసుకుని వచ్చిన డాక్టర్ శ్రీనివాసరావూ లేడు.

''వసుంధరా'' అని మళ్లీ పిలిచింది అత్తమ్మ

''మీ అమ్మ పతివ్రత భర్తను తప్పితే మరో మగాడివైపు కన్నెత్తి చూడలేదు — అలాంటి దాని కడుపున చెడపుట్టావు నీ గురించి బెంగతోనే మీ నాన్నకు గుండె జబ్బు వచ్చింది. వంశానికి మచ్చ తెచ్చావు ఒక తప్పు తెలిసో తెలియకో చేశావు అది దిద్దుకోవాలేగాని — మరొకటి మరొకటి చేయకూడదు నీవు తెలివిగల దానివని-వంశానికి వన్నె — తెస్తావని, నీ గురించి ఎంతో గొప్పగా చెప్పుకునేవాడు మీ నాన్న నీకేం తక్కువ చేశాడని నీవు ఇలాగ చేస్తున్నావు. తక్కువ జాతి దానిలా బ్రతుకుతున్నావు నీకు పెళ్లి అయ్యింది, మరి చాటుగ కాపురం చేయవలసిన ఖర్మ నీకేం పట్టింది? ఇప్పుడు వయస్సు ఎవ్వరు చూస్తున్నారు — మీ మామయ్య కంటే నేనే పెద్దదాన్ని మంచి సంబంధం పోతుందని వయస్సు తగ్గించి చెప్పి పెళ్లి చేశారు ఈ కాలంలో అది మామూలే! జరిగిందేదో జరిగిపోయింది తప్పు దిద్దుకుని తలెత్తుకుని తిరగండి ఇంటి మర్యాదను నిలుపు మీ నాన్న ఆత్మ సంతోషిస్తుంది వసుంధరా . బయలుదేరు''

''ఎక్కడికి?'' అన్నట్లు చూసింది

''అబ్బాయ్! నీ పేరు ఏమిటి?''

''మూర్తి ''

''మూర్తీ! నీవు, వసుంధర ఒకసారి నాతో రండి'' అని చెప్పి బయలుదేరింది. ఎలావున్నారో అలాగే బయలుదేరి ఆమె వెంట వెళ్లారు. వారి

రా గ జ్వా ల

వెంట వెళ్లనున్న సుందర్‌ని, మల్లమ్మ వద్దని వారించింది.

మూర్తి, వసుంధరను కారులో ఎక్కించుకుని నేరుగ రామాలయానికి తీసుకువెళ్లింది. దారిలో నేవున్నా పురోహితుని ఇంటి దగ్గర ఆగి అతన్ని కూడా ఎక్కించుకుంది. తీరా దేవాలయంలోకి ప్రవేశించాక ఆమె పూజారితో ''స్వామి! వీరిద్దరికి ఈ పవిత్ర దేవాలయంలో పెళ్ళి చేయండి. వారిద్దరు భార్యాభర్తలం అని భయపడకుండా గర్వంగా చాటించుకునేలా వారిని ముడివేయండి'' అని చెబుతుంటే వసుంధర తెల్లబోయింది, అతడు వారిస్తాడన్న ఆశతో. మూర్తి అతి మామూలుగ విగ్రహాలను చూస్తూ 'కూల్'గ నిలుచుంటే ఆశ్చర్యపోయింది. అతనితో మనస్సు విప్పి మాట్లాడే అవకాశమే దొరకలేదు. మేనత్త పోలీసులా దగ్గరే నిలుచుంది. మూర్తి ఎట్టి పరిస్థితుల్లో ఇలా చేయవలసివచ్చిందో ఆమెకు తెలుసు. మానవత్వాన్ని నింపుకున్న దేవుడు ఈ మనిషి — అని తలచింది సుందర్‌ని అంతగా ప్రేమిస్తున్నాడా? పిల్లలు దేవుడితో సమానమంటారు పిచ్చిగా, మూఢ విశ్వాసంతో పూజించే దేవుడి కొరకు ఆత్మార్పణ చేస్తారు. అలాగే తనను నమ్మిన సుందర్‌ని విడిచిపోలేదు. మోసం చేయలేదు. ఎంతో వున్నతుడుగా, ఎదుట వున్న దేవుని విగ్రహం కంటె అతడే విలువైన వ్యక్తిగా గోచరించసాగాడు

ఆ డాక్టర్ శ్రీనివాస్‌కి కావలసింది భార్య కాదు. పేరుప్రతిష్టలు వున్న లేడీ డాక్టరు కావాలి. తనకు భర్త కాదు కావలసింది తన కొడుక్కి డాడీ కావాలి. అందుకే అతన్ని చేసుకుంటానికి వప్పుకుంది అతని గుణగణాలు తెలియవు అందచందాలు చూడలేదు అతనితో తన జీవితం ఎలా వుంటుందోకూడ వూహించలేదు. అన్నయ్య తెచ్చాడు గుడ్డిగా వప్పేసుకుంది — కాని తానొకటి తలిస్తే దేవుడొకటి చేస్తున్నాడు. మూర్తి తనకంటె చిన్నవాడు — మల్లమ్మ అన్నట్లు చిన్నవాడో చితకవాడో తనకు కావలసింది మొగుడు కాదు సుందర్‌కి డాడి ... ఆలోచిస్తూ మూర్తి వైపు చూసింది అప్పుడే గుర్తుకు వచ్చింది అతనికి పెళ్ళయ్యిందని గుండె ఆగినట్లయ్యింది. భగవాన్ రేపు అతని భార్య వస్తే — యే తప్పు చేయబోయి ఇన్నాళ్లు శిక్ష అనుభవించిందో మళ్లీ అదే తప్పు .. గిరుక్కున వెనక్కి తిరిగింది. వెళ్ళిపోతున్న వసుంధరను మేనత్త చూడలేదు పురోహితుడితో మాట్లాడుతోంది. మూర్తి ఒక్క అంగలో వెళ్లి వసుంధరను పట్టుకున్నాడు. ద్వారపాలకుడ్లా నిలుచున్న విగ్రహం ప్రక్కకు లాక్కువచ్చాడు.

''ఎక్కడికీ?!''

''మూర్తీ! ఈ పెళ్లికి ఎందుకు తలవంచి వచ్చానో తెలుసు. సుందర్ కొరకు మనమీ నాటకం ఆడుతున్నాం - ఇంత దూరం వచ్చాం, వెనక్కి పోలేం ఇది వట్టి నాటకమని మనిద్దరికి తెలుసు... కాని ... కాని ... రేపు నీ భార్య వస్తే ఆమె నమ్ముతుందా? విపరీతాలకు దారితీస్తే, వాటిని ఎదుర్కొనే ఓపిక, ధైర్యం నాకు లేవు ఈ అవమానాలు నాకు అలవాటే నీవు నా కంటే చిన్నవాడివైనా చేతులెత్తి నమస్కరిస్తున్నాను'' అంటూ చేతులు జోడించింది. తలెత్తి తనవైపు చూస్తూ అంజలి ఘటిస్తున్న వసుంధరను నిముషంసేపు అలాగే చూశాడు తన భుజాలవరకు రాలేదు. 'పొట్టి పిల్ల' అనుకుంటే నవ్వు వచ్చింది జోడించిన చేతులను ఒకచేత్తో పట్టుకున్నాడు మరో చెయ్యి భుజం చుట్టూవేసి, దగ్గరకు తీసుకుని, నింపాదిగా ముద్దు పెట్టుకుని, ''ఐ లవ్ యు ... ఐ లవ్ యు వసూ! అందుకే పెళ్ళి చేసుకుంటున్నాను. నాకు మొదటి పెళ్లి చివరి పెళ్లి ఇదే ఇప్పటి వరకు ఘోటక బ్రహ్మచారిని ఇక ముందు నీ దయ నా ప్రాప్తం. '' అంటూ నవ్వాడు

వసుంధర కళ్లు విప్పారించి చూసింది ''నీ కంటే పొడుగాటి వాడిని నిన్ను గుప్పెట్లో ఇముడ్చుకోగల బలవంతుడ్ని కాకపోతే నీ కంటే బీదవాడ్ని'' అంతలో ''వసుంధరా ... వసుంధరా'' అంటూ పిలుస్తూ మేనత్త బయటికి వచ్చింది - వాళ్లిద్దరు మెల్లగా జారుకోలేదు కదా అని అనుమానిస్తూ

''వసూ! మనస్పూర్తిగా నేను నిన్ను స్వీకరిస్తున్నాను. అలాగే నీవు నన్ను స్వీకరిస్తే ధన్యుడనవుతాను . '' అంటూ వసుంధర చెయ్యి పట్టుకుని విగ్రహం ప్రక్కనుంచి వచ్చాడు

గుడి పూజారి, గృహ పురోహితుడు కలసి, వసుంధర — మూర్తిల వివాహం జరిపించారు మేనత్త తన మెడలో నల్లపూసల దండ వసుంధర మెడలో వేసింది తన వుంగరం మూర్తికి పెట్టమని వసుంధరకు ఇచ్చింది. మూర్తి తన వుంగరం తీసి వసుంధర వ్రేలికి పెట్టాడు. హాదులుగా వుంటే భుజాలు ఎగురవేశాడు. తరువాత ఇద్దరూ వసుంధర మేనత్తకు నమస్కరించారు.

ఆమె దీవిస్తూ ''ఇప్పటికి నా వేదన తీరింది మీ నాన్న ఆత్మ శాంతించి వుంటుంది'' అంటూ కన్నీళ్ళు తుడుచుకుంది

మూర్తి, వసుంధర ఇంటికి వచ్చేసరికి ప్రొద్దు ఏట్రవాలింది. సుందర్ రోడ్డు చూస్తూ నిలుచున్నాడు. పరుగున వెళ్లి మూర్తి చంకలో ఎక్కాడు. వాడి కళ్ళు మెరుస్తున్నాయి ఎన్నో ప్రశ్నలతో వుక్కిరి బిక్కిరి అవుతున్నాడు

''అంకుల్ '' అని ఏదో చెప్పబోతుంటే -

''అంకుల్ కాదు ... డాడీని. నిజంగా డాడీని మీ మమ్మీని పెళ్లిచేసుకున్నాను. నీకు ఇష్టమేనా?''

''డా...డీ'' అంటూ మెడ కౌగిలించుకున్నాడు

''కాంతీ'' అని మెత్తగా పిలిచింది వసుంధర


''మమ్మీ'' సుందర్ నవ్వాడు

మూర్తి వారిద్దరిని చెరొక చేత్తో పట్టుకుని — తన గదిలోకి పోతూ ''వసుంధరా కుడికాలు పెట్టు'' అన్నాడు వసుంధరకు సిగ్గు ముంచుకువస్తోంది సిగ్గును పారద్రోలి అతి హుందాగా, మామూలుగ వుండాలని ప్రయత్నిస్తూ చిరునవ్వుతో కుడికాలు పెట్టింది.

''నేనే కాలుపెట్టాలి?'' అని సుందర్ అడిగితే అందరూ అతిహాసం చేశారు.


(ఇంకా వుంది)

తాజా వార్తలకు, వ్యాఖ్యలకు, కొంగ్రొత్త ప్రత్యేక శీర్షికలకు ఆంధ్రపత్రిక దిన పత్రిక
పెట్టింది పేరు...మీరు మీ కాపీ మీ ఊరి ఏజెంటుద్వారాగాని లేదా మానేజరు,
గాంధీనగరం, విజయవాడ-3 లేదా మానేజరు, బషీర్‌బాగ్,
హైదరాబాద్-29 కి గాని వ్రాసి పోస్టులో తెప్పించుకొనండి.





సామాన్యుని సణుగుడు



మధ్య తరగతి "డై"!

అక్టోబర్‌లో యింకోసారి పెట్రోలియం వస్తువుల ధరలు పెరుగుతాయట! — యిది ప్రముఖ పత్రికా విలేఖరి కొట్టిన "స్కూప్" కానక్కరలేదు. ఈ దేశంలో మామూలు మనిషికి యిట్లాంటివి సులువుగానే తడతాయి! అడ్డమైన పాట్లుపడి, అష్టకష్టాలు నోచి, "వంటగ్యాస్" స్టౌ సంపాదించుకుంటే — అది ఒక భోగ వస్తువై పోయింది!

జీతాలు ఏడదికోసారి పెరుగుతాయి! యిళ్ల అద్దెలు సరే వాటితోపాటు ఏడాదికోసారి పెరుగుతాయి కాని అన్ని ధరలూ నెల నెలా వారం వారం, దిన దినం పెరుగుతూ వుంటే. .దేశంలోఅందరూ సామాన్యులై పోతారు!

బొగ్గుల అబ్బి చెప్పేశాడు— "ఏమ్మా! గ్యాస్ పెరిగిందంటే నోరు మూసుకుని చేతులు కట్టుకుని గ్యాస్‌వాణ్ణి 'కాకా' పట్టి, "సిలెండర్" లాటరీ టిక్కెట్‌కి ప్రయిజు వొస్తే తెచ్చుకున్నట్లు తెచ్చుకుంటారే?.. బొగ్గులకి మాత్రం మీ యింటి కాడి కొచ్చి వేస్తాం కనుక మరో రెండు రూపాయలు యివ్వమంటే ఎందుకట్లా రచ్చపరుసలాడతారు? నేను మీకు బొగ్గులు వాడుకగా వెయ్యడం ఆపేద్దాం అనుకుంటున్నాను" అని.

కారున్నవాడికన్నా అది లేనివాడు ధన్యుడు అన్నాడో సంపన్నుడు! స్కూటర్‌ని మూలబెట్టి డొక్కుసైకిలెక్కి ఆఫీసుకి వెళ్తున్న, వో ఆఫీసర్ "స్కూటరుంది... కాని పెట్రోలు కొనలేక" అని అందరికీ చెబుతున్నాడు

రిక్షావాడు గట్టిగా కోప్పడ్డాడు— "సిటీ బస్‌లో ఎక్కి ఫర్లాంగు దూరంలో దిగండి. మీ కుటుంబానికి నూటయిరవై పైసలు అవుద్ది మాకు మైలు దూరానికి ఛార్జీలు లేకుండా రూపాయి పావలా యివ్వడానికి "వో యిదై పోతారేంటి?" "కిరాణా కొట్టు కెంతవుతుంది? అంటే పోయిన్నెల రెండొందలైంది— యీ నెల ఎంతవుతుందో?" అన్నది నలుగురున్న మధ్యతరగతి కుటుంబీకురాలు!


రూపాయి మార్చే అవసరం తీరిపోయింది— తల నొప్పి వచ్చి — బిళ్లొకటి కొనుక్కోవాలీ అంటే దాని వెల కూడా వారానికోసారి పెరిగి పోకొంది

పెట్రోలు పెరిగితే మామూలు మనిషికేం బెంగ? అనొద్దు కిరసనాయిలు, బొగ్గులు, కట్టెలు, బస్ ఛార్జీలు, రిక్షా ఖర్చులు, లాండ్రి బజట్, యివన్నీ పెరుగుతాయి 'కరెంట్ ఖరీదు' పెరిగితే సినిమా టికెట్ ధర పెరుగుతుంది — నూనె ఖరీదు, పంచదార ఖరీదు పెరిగితే దాంతోపాటె బజ్జీలు, మైసూరుపాకు తినాలన్న కోరిక పెరుగుతుంది- వానాకాలం వచ్చిందిగాని కిలో కూరగాయల ఖరీదు 'రెండు రూపాయల' కాయితాన్ని మార్చకుండా అలాగే యిమ్మంటుంది . హోటలు రేట్లు — జనాలు బజారునపడ్డారు—విద్యార్థులు అల్లరి పడ్డారేతప్ప, అడపా తడపా పెరుగుతూనేవున్నాయి — మంచి భోజనం ఐదు రూపాయలు—

'మధ్య తరగతి' లాంటివి దేశంలో అంతరించిపోయి—రెండు క్లాసులే మిగులుతాయి కాబోలు! పూరిపాకలుకీ జై!! మేడలుకీ జై!!! పెంకుటిళ్లూ, డాబాలు "డై"! మధ్య తరగతి డై!

[వీరాజీ]





నోటిగాలి క్లోస్ అప్‌లో వలె తాజాగా
పళ్ళపై తెలుపు క్లోస్ అప్‌లో అంత తెల్లగా
పారదర్శకమైన ఎరుపు
క్లోస్-అప్
టూత్ పేస్ట్ మరియు మౌత్ వాష్ ఒకే దానిలో
Close-up
Close-up
Close-up
ఇటువంటి సన్నిహితమైన సన్నివేశాలలోనూ, మీకు చేరువగ
ఉండేవాళ్ళు దగ్గరగా వున్నప్పుడూ మీక్కావాలి, క్లోస్-అప్—యిది
టూత్ పేస్ట్‌లలోనే ఒక కొత్త పద్ధతి, ఆలోచన. దీనిలో గల అసలైన
మౌత్ వాష్, మీ నోటి గాలిని క్లోస్-అప్‌లో వలె తాజాగా
ఉంచుతుంది—దీనిలో గల రెండు ప్రత్యేకమైన పదార్థాలు, మీ పళ్ళను
క్లోస్-అప్‌లో అంత తెల్లగా చేస్తాయి
క్లోస్-అప్
సన్నిహితులకోసం
హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి
ఒంటాస్-CX-35-2316 TL

బురద గుంటలు

పాలడుగు వెంకటేశ్వరరావు



'రాండి రాండి' అంటూ కళ్ళజోడుని సర్దుకుంటూ ఆహ్వానించిన ఆనందాన్ని చూస్తూ నిలబడిపోయాడు అంజయ్య.

'రాండి కూర్చోండి. అదేంటి ? అల్లాగే నిలబడిపోయేరూ ? మీతో చాలా విషయాలు చెప్పాలి' అంటూ చిర్నవ్వు నవ్వేడు ఆనందం. అంజయ్య అలాగే నిలబడిపోయేడు.

'-నాకూ కోర్టుకి టయిమయి పోయిందనుకోండి అయినా మీతో మాట్లాడాల్సిన ఈ విషయం యొక్క ప్రాముఖ్యతని గురించి తెల్సినవాడ్ని గనుకా— పెద్దలయిన మీ యెడల నాకు వున్న గవురవం దృష్ట్యానూ — నేను ఆగిపోయేను రాండి.మరీ... మనం మాట్లాడుకోవాలి.'

'చెప్పండి' అన్నాడు అంజయ్య నిలబడే

'అయ్యో. పెదలు, మీరలాగే నిలబడిపోయేరు నేను కూర్చుండిపోయి మీతో ఇలాగే విషయాలు ముచ్చటించనా?' నొచ్చుకున్నాడు ఆనందం.

'ఫర్వాలేదు. చెప్పండి' అంటూ గుచ్చి గుచ్చి చూసేడు అంజయ్య. ఆ చూపులు ముళ్ళే సుమా !

'మీరు అత్యంత ముఖ్యమయిన ఆ పని మీదే ఇక్కడికి వచ్చారని నాకు తెలుసును.'

'అంత ముఖ్యమయిన పని కాదనుకోండి. ధాన్యం అమ్మిన పైకం రావలిసి వుంటేను —ఆ పని మీద ఈ వూరు వచ్చాను. మీరు రమ్మన్నారని అమ్మణమ్మ చెప్పింది. సరే, ఏమిటో కనుక్కుని పోదాము. ఇలాగూ వచ్చాముగదా అనీ-'

'వచ్చారు. అవునా ? శుభం. పోతే — అసలు విషయానికి వద్దాము. ఆ అబద్ధాలరావున్నాడు చూసారూ ?'

'ఏ అబద్ధాలరావ్ ?'

'అబ్బ ! వాడేనండీ అబద్ధపు సాక్ష్యాలు చెప్పించడంలో పేరు పొందిన మనూరి ఆ కుళ్ళుగాడి కొడుకూ— నాకు ప్రత్యర్థిగా నిలిచి— నా కంట్లో ముల్లులాగ బాధ పెడుతూ వున్న పేరు మోపిన దొంగ ప్లీడరు అబద్ధాలరావు, మనవాడ్ని పట్టేసాడు పట్టేసాడండీ!'

'పట్టేసాడా ?' అంటే ఏమిటీ ?

'అవునండీ' వాడు మనవాడ్ని పట్టేసి మీ మీద వ్యాజ్యం వేయించే ప్రయత్నంలో వున్నట్టు రూఢిగా తెలిసింది. మొత్తం మన మన ఆస్తిపాస్తులన్నిటిమీదా బైండోవరు తెచ్చే ప్రయత్నంలో ఆ కాగితాలన్నిటి మీదా మనవాడి చేత సంతకాలు చేయించుకుని ఇవాళో రేపో కోర్టులో దాఖలు చేస్తాడని

నలుగురూ చెప్పుకుంటూ వున్నారు. ఇది ఏమికాలం ? కలికాలమా ? ! అయితే మాత్రం ? ఇంత దారుణమా ? కని, పెంచి విద్యాబుద్ధులు చెప్పించి అంతవాడ్ని చేసిన స్వంత తల్లిదండ్రుల మీదే అంత దారుణ మయిన పగా ? అని ఎంతో విచారించి — ఏదో–తెలిసినవాడ్నిగనుకా ఉడతాభక్తిగా మీకు గనుక నాకు తోచిన సాయం చేద్దామనిపించి— కుమ్మ అమ్మణమ్మ మనూరుకి ట్రిప్పు వేస్తుంటే ఆ పెద్దాయన్ని ఒకసారి రమ్మని చెప్పమని చెప్పిపంపించా '

అంజయ్య నిట్టూర్చాడు. ఆనందం కంటిన్యూ చేశాడు.

'అంతెగాదు, మొన్న ఆ పేట వయిపు వెళ్ళినప్పుడు–మనాడు గదా ఒకసారి చూసి కష్టం సుఖం విచారించి వద్దామని — ఆ ఇంట్లో అడుగు పెట్టానా ? ఆ అబద్ధాలావుతో గుస గుసలాడ్తూ వుండే వాడల్లా— మనాడు–అదే మనసత్యం,మొహాన్ని క్రూరంగా పెట్టి నన్ను పురుగున్నిసి పారేసినట్టు విదిలించికొట్టి— మిమ్మల్నిగురించి అవాకులూ చవాకులూ పేలి — మీ అంతు చూస్తానని భీషణ మయిన ప్రతిజ్ఞ చేసేడు. పిత్రార్జితాన్ని అలాగ ముడ్డికింద వేసుకుని ఇష్టమొచ్చి నట్టు గంతులు వేయటానికి మీకేమీఅధికారం లేదనీ– అవసరమయితే కోర్టుల్లోనే బలా బలాలు తేల్చుకుంటామనీ మన సత్యం అంటూంటే ఆ అబద్ధాలావుగాడు ఒకటే ముసి ముసి నవ్వులూ! పెద్దాచిన్నా అంటూ వుందీ, మంచీ చెడూ గమనించాలీ, కన్నతండ్రిని అలాగ దూషించి కోర్టుకి ఎక్కుతాననటం నీకు తగదు నాయనా. కానీ, పెద్దా చిన్నా తారతమ్యం నీకు లేకపోయినా నాకు వుంది. అందువలన — అవసరమయితే పూజ్యులయిన మీ నాన్నగారి తరపున ఒక కొమ్ము కాసి ధర్మరక్షణకి నడుం కట్టడానికి నేనయితే వెనుకాడేది లేదూ' అని చెప్పి చక్కా వచ్చేసి మీకు కబురు చేసాను. ఇరవయి ఎకరాల సుక్షేత్ర మయిన భూమి తల్లి— అది ఏటేటా అందించే పసుపూ, పొగాకూ, ప్రత్తి మరియు ధాన్యరాశులూ — హాట్నే కని పెట్టుకుని వుండి, మూడు పువ్వులూ ఆరుకాయలుగా పచ్చగా సాగుతున్న ఈ సంసారం ఇనాగా ఈనాటికి గొడవలుపడి కోర్టుకి ఎక్కి నలుగురి నోళ్ళలో పడటం అన్న విషయం నాకు హృదయ శల్య వాయి నేను మూడుదినాల్నుండి సరిగా నిద్రయినా పోలేదు. అదలావుంచితే — ఈ వ్యవహారంలో మనం ఇక ఏమాత్రం వెనుకడుగు వేసి నలుగుర్లోనూ తల వంచుకొనటానికి అసలు వీలే లేదని తీర్మానించుకుని అందుకు సంబం ధించిన కాగితాలన్నీ తయారుచేసి...

అంజయ్య వెనుదిరిగి నాలుగడుగులు వేసాడు.

'ఆగండి. అంజయ్యగారూ. ఏమయిందీ? మనం నిదానంగా ఆలోచించాలి — '

'ఏంకాలేదు. సాయంత్రం వస్తాను. ఇంకా పైకం అందలేదు. అది తీసుకుని —'

'అల్లాగా ? సరే. అలాగే అన్నీ సమకూర్చు కునే మనమూ రంగంలోనికి వురుకుదాం. మీరేం కంగారు పడవద్దు. అవటానికి పిత్రార్జితమే అయినా అందుమీద మీకు గల సంపూర్ణమయిన హక్కుల్ని బలపరిచే మద్రాసు హైకోర్టు జడ్జిమెంట్సుని కాపీలు తీసి రడీగా వుంచాను. విజయం మనదే. దీంతో వాళ్ళ పొగరణిగి...'

ఆసరికి అంజయ్య గేటుదాటి పోయాడు. 'దొంగ ముండా కొడుకు! ఏమీ తెలియనట్లు నీరుకావి పంచా లాల్చీ ధరించి — ముడ్డి కింద చేరిన ఆ లక్షల్ని గట్టిగా పట్టుకుని కూర్చున్న — ఎంత వున్నా ఏమీ లేనట్టుగా కూతలు కూసే ఈ బంగారు బాతుని పట్టి మచ్చికచేసి దారికి తెచ్చే రకరకాల పద్ధతుల గురించి ఆలోచనలో సద్దానందం–ముందు ముందు గొప్పగొప్ప కేసుల్ని పట్టి యుమగా వాదించి గెల్చి లక్షల్నార్జించాలన్న పట్టుదల గలిగిన లాయరానందం — మళ్ళీ వస్తాడుగా ముసలాడు! అని సంతోషించగా–మధ్యాహ్నపు ఎండ దంచేస్తూ వుంది.

* * *

ముందు వరండాలో ఏదో చప్పుడయితే తలుపుని వారగా తీసి చూసిన సత్యవతి వులిక్కి పడింది. గుండె దడదడలాడింది. ఎగిసిపడే గుండెల్ని అదిమి పట్టుకుని గబగబా వెనుక వరండాలోకి వెళ్ళి చెంబుతో నీళ్ళూ, గ్లాసుతో మంచినీళ్ళూ, తుడుచుకోవటానికి తువ్వాలూ తెచ్చింది.

కాళ్ళు కడుక్కుని, గటగటా మంచినీళ్ళు తాగి ఉస్సురంటూ తువ్వాలుతో మొహం తుడ్చుకుని సోఫాలో కూర్చున్నాడు. ఫ్యాను వేసింది సత్యవతి.

'అబ్బాయి ఏడీ ?'

'హాస్పటల్‌కి వెళ్ళారండి

భోజనానికి రాడా ?'

'ఆపరేషన్లున్నాయి. సాయంత్రానికే వస్తాను. క్యారియరు పంపించ' మన్నారండి.

'సర్లే. అతను వచ్చేదాకా కూర్చుంటాను.'

'మీ భోజనం ? రెండు నిమిషాల్లో తయారుచేస్తాను.'

'అవసరం లేదమ్మా చేసే వచ్చాను. ఇదుగో ఇందులో సున్నుండలున్నాయి. వాడికి ఇష్టమని మీ అత్త చేసి ఇచ్చింది లోప లుంచమ్మా '

అవి తీసుకెళ్ళి లోపలుంచి ఆశ్చర్యంలో మునిగిపోయింది సత్యవతి. ఎన్నో ఆశలు పెట్టుకున్న కొడుకు ప్రేమించి పెళ్ళిచేసుకుని వంశప్రతిష్ఠని మంట గలిపాడని నానాగొడవా చేసి, రాకపోకలు నిలిపేసి, సంబంధాల్ని తెంపేసుకుని, రెండు సంవత్సరాల్నించీ దూరంగా వుంటున్నా ముసలాయనవని గట్టు కుని రావటంలో గల విశేషమేమిటా అన్న ఆలోచనలో పడింది సత్యవతి. ఫ్యానుగాలికి అలసిపోయిన ముసలాయన నిద్రలోకి జారి పోయాడు.

'అమ్మాయీ. ఏం చేస్తున్నావూ ?'

'ఏం లేదండి '

'మీ ముసలాయన వచ్చినట్టున్నాడే ? తగని మనిషి సుమా ! ఇన్నాళ్ళూ కోతి గంతులు వేసి తగుదునమ్మా అంటూ ఇప్పు డెందుకు తగలడినట్లో ? మనిషన్నాక ఆ మాత్రం పౌరుషమన్నా వుండద్దా ? అన్నట్టు ఆ మధ్య మనూరుకి పోయివచ్చానమ్మాయీ.

వి లు వ లు

అవినీతిపరుడు అప్పుడు
తులసివనంలో గంజాయిమొక్క
తులసిని నమ్ముకుంటే
నోట్లో దుమ్మేనని
దమ్ మారో దమ్ అంటూ
గంజాయినెందరో
గర్వంగా అమ్ముతుంటే
నీతిపరుడు యిపుడు
గంజాయివనంలో తులసి మొక్క !

— పిప్పళ్ళ సూర్యప్రకాశరావు

బురదగుంటలు

మీా అత్త అగుపించింది రామరామ అది నోరా ?! నిన్నూ, మీా ఆయన్నీ ఒకటే తిట్టటం. వినలేక 'అలాగ అనటం నీకు తగదమ్మా వదినా' అన్నానా – నా మీద ఇంత ఎత్తున ఎగిరింది మీ అత్త! పోన్లే 'పెద్దవాళ్ళు ఎప్పుడూ చెడ్డ వాళ్ళు కారూ అనుకుని నేనే వూరుకున్నాను. వాళ్ళు 'మీా ఆయన్ని పట్టుకుని మనసు విరిచేసి– మళ్ళీ పెళ్ళి చేసే ప్రయత్నాలు వాళ్ళు ముమ్మరంగా సాగిస్తున్నట్లు నలుగురూ అనుకుంటున్నారమ్మా అది విని ఆపుకోలేక నీకు చెపుదామని వచ్చాను. పోన్లే అలాగు కన్నీరు పెట్టుకోవద్దమ్మా, భగవంతుడ్ని ప్రార్థించు. రోజూ తులసిపూజ చెయ్యి. నీ భర్త మంచి వాడవాలిగాని నిన్ను ఎవరేం చెయ్యగలరూ? ధైర్యంగా వుండమ్మా. బహుశా ముసలాయన ఆ ప్రయత్నాల్లో వచ్చినట్టుగా నా కనిపిస్తూ వుంది జాగర్త. నువ్వలా ఏడవవద్దు తల్లీ. ఒకవేళ అవసరమయితే- కోర్టు పరంగా ని తరఫున చర్యలు తీసుకుంటానికి మా బాబాయి ఆనందం వున్నాడు చెపుతాను మరి వస్తానమ్మాయి. ధయిర్యంగా వుండు మరి!'

ఒక కలలో లాగ లీలగా ఆ మాటలు వినిపించి– గభాలున కళ్ళు తెరిచాడు అంజయ్య ఆసరికి గేటు దీసుకుని రోడ్డు ఎక్కిన అమ్మణమ్మ అతనికి కనపడలేదు

సత్యవతి చాలా సేపు దుఃఖించింది. లోలోపలే కుంపటిలాగ కుమిలిపోయింది.

తనకి అన్యాయం చేయవద్దని భగవంతుడ్ని ప్రార్థించింది.

ఎంత వద్దనుకున్నా- ఆ వెక్కిళ్ళు తలుపు సందుల్లోంచి అంజయ్య చెవుల్లోకా వచ్చాయి. చుట్ట ముట్టించుకుందామనుకున్న అంజయ్య ఆ ప్రయత్నాన్ని ఆపి తలుపు దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు.

'అమ్మాయీా?' అని బొంగురుగొంతుతో పిలిచాడు అంజయ్య.

సత్యవతి ఉలిక్కిపడింది. లేచి నిలబడి తడిసిన మొహాన్ని చీర చెఱగుతో తుడుచుకుంది.

'అమ్మాయీా? ఎందుకు ఏడుస్తున్నావు? ఏమయింది?' అన్నాడు.

ఆ ప్రశ్నకి శోకం కట్టలు తెంచుకుంది. గబగబ వచ్చి అతని పాదాలు పట్టుకుని–

'మామగారూ! నేను తప్పుచేస్తే నన్ను మీ యిష్టం వచ్చినట్టు అనండి. కాని - నాకు అన్యాయం చేయకండి. నా కడుపులో పెరుగుతూ వున్న మీ వంశోద్ధారకుడ్ని దిక్కులేనివాడ్ని చెయ్యకండి' అంది దీనంగా చూసింది. వెక్కిళ్ళు పెట్టింది.

అంజయ్య నిరుత్తరుడయిపోయాడు.

ఆమె అన్న వంశోద్ధారకుడి మాట అతని నరనరాల్లో నూ పుత్రోత్సాహాన్ని ఉత్తేజాన్ని కలిగించింది. కాని- విచిత్రమయిన ఈ పరిస్థితి అయోమయంగానూ అనిపించింది.

'వూరుకోమ్మా ఏడవకు లే లేచిమొహం కడుక్కో. నువ్వు నా బిడలాంటి దానివి. ఏ పరిస్థితిలోనూ ఏ తండ్రీ తన బిడకి అన్యాయం చెయ్యడు. తనకడుపునే చించుకుని కాళ్ళమీద పడనేసుకోరు' అని పరిస్థితిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేశాడు, అంజయ్య.

సత్యవతి లేచి- ఎగబిలుస్తూ లోపలికి వెళ్ళి మొహం కడుక్కుని వచ్చింది. వస్తూ గ్లాసు నిండా మజ్జిగ తెచ్చి అందించింది. అగి గుటుక్కున తాగి గ్లాసు పక్కన పెట్టి- త్రేన్చి-

'అమ్మాయీ! నేనూ మీ అత్తా వెర్రి పిచ్చిమనుషులం. బోళాశంకరుళ్ళం. పాత కాలపు వాళ్ళం. అయితే మాత్రం- మాతో మీకు ఈ ఆటలేమిటి తల్లీ?' అన్నాడు.

సత్యవతి కళ్ళు పెద్దవి చేసి అర్పలార్చింది ఆశ్చర్యంగా!

'ఇందాక నేను నిద్రలో బడ్డప్పుడు ఏవో మాటలు లీలగా వినిపించాయి. అదంతా కలేమోనని అనుకున్నాను ఎవరా వచ్చింది?'

'మనూరే'

'అమ్మాణమ్మా?'

అవునని తలూపింది సత్యవతి.

'అర్థమయిందమ్మాయి. అంతా అర్థమయింది. ఆవిడ సామాన్యురాలు గాదు గుడ్డముక్కల్తో బొమ్మలాడిస్తుంది జాగర్త! ఇకనించి ఆ తల్లిని నీ గడపదొక్కనీకు ఇప్పటి నీ ఏడ్పుకి అసలు కారణం ఆ తల్లి మాటలు అవునుగదా! ఆ తల్లి నీళ్ళతోనే కొంపలంటించగలదు. సంసారాల్ని బజారికి లాగగలదు. వేనిక జరూరుగా మనూరు పోవాలి. అవతల పొలం పన్లు! అబ్బాయొస్తే, నేనొచ్చివెళ్ళానని చెప్పు. ఈ వుత్తరం అతనికియ్యి.' అని- సాష్టాంగపడిన సత్యవతిని ఆశీర్వదించి బయట పడ్డాడు.

సాయంత్రం సత్యం - ఇల్లు చేరేదాకా ఆత్రంగా ఎదురు చూసింది సత్యవతి.

టూటిక్కు సేపాలూ, పళ్ళు ఫలాలూ తీసుకుని ఇల్లు చేరిన సత్యాన్ని ఆ త్రంగా కౌగిలిలో బిగించింది సత్యవతి. ఆమె మొహంలో కొత్త వెలుగుల్ని చూసి గ్రహించి-

'ఏమిటి విశేషం?' అన్నాడు సత్యం నవ్వి.

'ఏమిలేదు'అంది అతని చొక్కా గుండీలు తీస్తూ, సత్యవతి.

'ఏమీ లేకపోవటమేమిటి? ఏదో వుందని అమ్మాయిగారి కళ్ళు చెప్తుంటే!'


సత్యవతి నవ్వింది. 'మీ నాన్నగారు వచ్చి వెళ్ళారు' అని చెప్పి - ఆ వుత్తరం అతనికి అందించింది.

''ఒరే అబ్బాయీ! కడుపుతీపి నాపుకోలేక ముసలామె గోలబెట్టింది. అందువలన పంతాలూ పట్టింపులూ ఇకవద్దని స్వయంగా చెప్పుదామని నేనే పనిగట్టుకుని వచ్చాను. ఈ స్పర్థలూ ద్వేషాలూ రొచ్చుగుంటలు. చిలిపివాళ్ళు కావాలని వాటిల్లో వుచ్చపోస్తారు. స్వార్థపరులు కొంతమంది ఆ గుంటల్లోనే చేపలు పడదామని గాలాలు వేసుకుని తయారవుతారు మనూరు మనూరు అంటూ - మన కళ్ళల్లో కారం చల్లి నిప్పు పెట్టాలని చూసిన ఆ ఆనందం, అమ్మాణమ్మా, అబద్ధాలాన్నా అటువంటోళ్ళే. నవ్వడిగితే-అసలు తప్పు మనదే. తప్పులు చేయటం మనిషన్నవాడికి తప్పదు గని ఆ తప్పుల్ని సరిదిద్దుకుంటంలోనే అసలు గొప్పదనం వుంది అందువలన ఆ తప్పుల్ని సరిదిద్దుకొని- మనం పుట్టించుకున్న ఆ బురదగుంటల్ని పూడ్చుకుని సుభమయిన గాలిని పీల్చుకోవటాన్కి ప్రయత్నించటం మన ధర్మం గదా ఆ ప్రయత్నమే ఇవాళ నేను రావటం మన మన గొడవలు ఎట్టా వుండిచచ్చినా- మనల్ని కట్టుకున్న కర్మానికి నీ తల్లినీ, మా కోడలు పిల్లనీ – ఏడిపించకుండా నడవాలనేదే నా సంకల్పం అలా కాపోతే మనిద్దరం కూడా - రేపు కోడలు పిల్ల అందించబోయే 'ఆ బుడ్డాడి'కి సంజాయిషీ ఇచ్చుకోవాల, తప్పదు. అందువలన నువ్వు గతమంతా మర్చిపోయి ఎల్లుండి శ్రావణ శుక్రవారం నాటికి అమ్మాయిని తీసుకుని మనింటికొచ్చి మనాడివి అని అనిపించుకోమని నా ఆజ్ఞ్తరు. మేమిద్దరం మీ ఇద్దరి కోసం ఆవాళ ఎదురు తెన్నులు చూస్తూ వుంటాము చాలాచాలా రాశాను. ఇకవుంటారా అబ్బాయీ, - ఇట్లు నీ తండ్రి నూరపనేని సీతారామాంజనేయ చౌదరి వ్రాలు'

ఉత్తరం చదివి తలెత్తి చూసాడు సత్యం. అతని కళ్ళనిండా మెరుపులు!

సత్యవతి అతన్నే చూస్తూ వుంది.

అతని మొహంలో చిరునవ్వుల మొలకలు. ఆ నవ్వులు పువ్వుల్లా విరిసి సత్యవతిని ముట్టడించగా – సత్యవతి సర్వం మరచి కిలకిలా నవ్వింది.



★ వారఫలం

14-8-1981 శుక్రవారం మొదలు
20-8-1981 గురువారం వరకు

మేషం : చాల విషయాలు, నూతనంగా తెలిసికొనే అవకాశమున్నది. నూతన పరిచయాలు ఏర్పడుతున్నాయి. వ్యాపారాను కూలత, చేసిన ప్రయత్నాలకు అభినందన లభించగల వారమని గ్రహించండి. గోచార గ్రహానుకూలతవల్ల ధన లబ్ధిని పొందగలుగుతారు. స్త్రీలకు: ఉద్యోగవృత్తులు సుగమంగా సాగిపోవటం, సంపాదనకు మార్గాలు ఏర్పడటం గమనించదగిన అంశం.

వృషభం : ఆదాయమున్నది. వ్యవసాయమందు ఏదో మార్పులు చేయబోతున్నారు. కొందరకు, కళారంగంలో సదవకాశాలు లభించగలవు, కొందరకు క్రీడా రంగావకాశాలు అప్రయత్నంగా లభించగలవు. స్త్రీలకు: ఉన్నత విద్యావకాశాలు లభించుటయే గాక, దూర ప్రయాణాలకు అవకాశాలు లభించగలవు. ఆరోగ్యలోపం లేదు.

మిథునం : వస్తు వాహన సేకరణ అనుకూలత, గృహ నిర్మాణ యోగ్యత సిద్ధించటం, భూవసతి ఏర్పడే అవకాశం లభించటం. శుభకార్యాలోచనలు గావించటం, ఉద్యోగ వృత్తులందు ఆదరం లభించటం గమనించదగిన అంశం. స్త్రీలకు : ఉద్యోగాలందు ప్రమోషన్ లభించటం, నూతన విషయాలు పలురీతుల తెలిసికోవటానికి అవకాశం గల వారమని గ్రహించాలి.

కర్కాటకం : ఏ వృత్తిలోని వారికైనా సదవకాశాలుంటాయి. వైద్య వృత్తి యందు, న్యాయవాద వృత్తియందు, రచనా విద్య మందు చాల మందికి అవకాశాలు చిక్కుతాయి. ఆదాయంలో లోపముండదు. స్త్రీలకు : కళా సాహిత్య రంగాలలో ప్రతిభ రాణించటమేగాక, ఉన్నత విద్యాభ్యాసానికి, పై విద్యకు ప్రయత్నిస్తే సీట్లు చిక్కే అవకాశమున్నది.

సింహం : వృత్తియందు అధికారపరం లభించటం, ఉద్యోగమందు పై యంత్రాంగం కుదరని మార్గముండటం, కార్యాను కూలత సంపాదించటం, పరమిత్రుల మూలాన లాభదాయకమైన సలహాలు ఏర్పడటం గమనించదగిన అంశం. స్త్రీలకు : నూతన గృహాలకు, భూవసతియో, ఇలు కొనటమో లభ్యం

కన్య : గ్రహించి, శ్రద్ధాసక్తులతో, ఉద్యోగ వృత్తులందు బాధ్యత వహించే, ముందుముందు పేరు లభించే మార్గమున్నది. ఆదాయానికి లోపం లేకపోయినా ప్రయోజనం లేని అధిక వ్యయం కూడా జరిగినదే. స్త్రీలకు : బంధుమిత్రాదులతో, అధికారుల మూలాన తగిన కార్యాలందు అనుకూలత చేకూరగలదు.

తుల : ఎవరినీ అతిగా నమ్మి ప్రయోజనం లేదు. ఏదీ సుకరంగా సాగదు. అధిక వ్యయం చేయవలసి ఉంటుంది రాబడి అంతంత మాత్రమే. ఇందుకు కారణం, వ్యయభావమందున్న శని గ్రహమే! కాలం కాదని ఏ పనీ అలక్ష్యం చేయకుండా, శ్రద్ధాసక్తులతో జరుపుకొనుట న్యాయం. స్త్రీలకు : అనుకూలవారంగాదు. ఆదాయం ఆశించినంత లేదు. జాగ్రత్త లోపించకూడదు.

వృశ్చికం : ఇటీవల చేసిన వ్యయ ప్రస్తావన ప్రతిదినం మనసుకు రావటం, బాధాకరంగా ఉండటం గ్రహింపగలరు. చుట్టు ప్రక్కల వారితో గొడవలకు దిగకుండ వ్యాపారం బాగా పటిష్టంగా సాగించవలసిన దినాలని గ్రహించాలి. స్త్రీలకు: కార్య విజయం, ఉన్నత విద్యకై ప్రాకులాట, నూతనోద్యోగాలు ఫలించటం చెప్పదగిన అంశాలు. ఆదాయంలో అభివృద్ధి కనిపించి తీరుతుంది

ధనుస్సు : పదిమందిలో ప్రాకులాడి, పేరు ప్రతిష్ఠలు సంపాదించే పరిస్థితులుంటాయి. నూతన వ్యాపారం కొందరు చేపట్టే అవకాశమున్నది. ఆరోగ్యలోపం లేదు నిర్దిష్ట కార్యక్రమం సాఫీగా సాగిపోతుంది స్త్రీలకు చాల మందికి శుభ కార్య ప్రస్తావనలుండటం, ఇండ్లు మారే ప్రయత్నాలకు దిగటం, వృత్తిలో కించిత్తు లాభం పొందటం విశేషం.

మకరం : దాయాదులను గూర్చి బెడద చెప్పదగినవారం, కొని తెచ్చుకొన్నట్లు అనవసరంగా పేచీలు రావచ్చు. అందువలన జాగ్రత్త పడటం అవసరమే గదా! నూతన విషయాలు తెలిసికొనే అవకాశం కూడా సంభవమే. వ్యాపారంలో లోపం కనిపించదు. స్త్రీలకు: వృత్తిలో ప్రగతి, ఆదాయం అభివృద్ధి చెందే కార్యక్రమంలో నిమగ్నత చెప్పదగిన అంశాలు.

కుంభం : కళా సాహిత్య రంగాలలో సదవకాశాలు లభించటం, పోయిన వస్తువులు దొరుకగలవనే ధోరణి కనిపించటం, రోడ్డు ప్రమాదం నుండి తప్పించుకొని బయటపడటం గ్రహింపదగిన అంశాలు. చాలాకాలంగా చేతికి రాక తనఖా పడిన రొక్కం ఈ వారం అందుతుంది. స్త్రీలకు: గాయక వర్గంలో వారికి, కథా రచనలో పరిచయమున్న వారికి, పత్రికా ప్రకటనలో అభిని వేశమున్న వారికీ మంచివారమే.

మీనం : మీకు సంబంధించిన ముఖ్యమైన కాగితాలో, డబ్బో పోగొట్టుకొనే అవకాశమున్నది. వాహన ప్రమాదం ఉంటుందేమో జాగ్రత్త! మిత్ర బంధువులలో మనస్పర్థలు కలిగించే సమయంలో పొరపాట్లు జరుగుతాయేమో జాగ్రత్త! స్త్రీలకు : వస్తు వాహన సేకరణ యత్నం, నూతన పరిచయాలేర్పడటం, పెద్దల ఆదరం సంపాదించటం గమనింపదగిన అంశాలు. గ్రహించండి.

— విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి



శ్రీవిరించి

బెంగళూర్ వెళ్ళవలసి వుంటుందని తెలిసినప్పుడే అనుకున్నాడు శేఖర్ — యీమారు 'డబుల్ డెకర్' లో ప్రయాణం చేయాలని. బృందావన్ ఎక్స్‌ప్రెస్‌ను మించింది మరొకటి లేదు, అతని దృష్టిలో చురుకుగా నడిచే రైలు; దారి పొడుగునా 'సీట్'లో నుండి కదలనక్కర్లేకుండా కాఫీ, టీ, తినగల వోపిక వుంటే ఘనపదార్థం, స్వీట్స్, కూల్ డ్రింక్స్, యింక రకరకాల పదార్థాలు !

ప్రయాణాన్ని మరింత సుఖకరం చేయడానికి 'డబుల్ డెకర్' ప్రవేశ పెటారని చూచాడు పేపర్లలో. మనది 'డెవలపింగ్ కంట్రీ' అయినా అత్యాధునిక సౌకర్యాలు అమర్చుకోవడంలో మనమేం తీసిపోవడంలేదు. బృందావన్ ఎక్స్‌ప్రెస్‌లోను చే బెంగుళూరుకు —మ దానుకు టెలిఫోన్ చేసి మాట్లాడగల అవకాశం కల్పిస్తామని వాగ్దానాలు కూడా చేస్తున్నారు.

తండ్రిగారి మంచి బెంగుళూరుకు వెళ్ళి పిల్లను చూచి వచ్చి వెంటనే అభిప్రాయం వ్రాయమని ఆదేశం రావడం తరువాయిగా టికెట్ కోసం 'ట్రావెల్ ఏజెంట్'కు టెలిఫోన్ చేస్తూ 'డబుల్ డెకర్'లో సీట్ సంపాదించమని చెప్పాడు.

'పైనా కిందా సార్' అని అడిగాడు ఏజన్సీ తాలూకు మనిషి.

ఒక్క క్షణం యేం జవాబు చెప్పాలో తోచలేదు శేఖర్‌కు. తరువాత 'పైన' అన్నాడు.

ట్రెయిన్ కోసం ప్లాట్‌ఫాం మీదకు రావడంతోటే పాతరకం 'బోగీ' కనిపించడంతోటే కాస్త నిరాశ అనిపించింది. కాని తనకు చోటు కేటాయించిన కంపార్ట్‌మెంట్ దగ్గరకు చేరుకునేటప్పటికి 'జేగురు' రంగులో కొత్త రకం పెట్టె ఆహ్వానిస్తూ నిలబడివుంది.

ప్లాట్‌ఫాంకు దిగువగా కిటికీలు కనిపిస్తున్నాయి.

కంపార్ట్‌మెంట్‌లో ప్రవేశించి తన 'నెంబర్' వెతుక్కుంటూ ముందుకు అడుగులువేశాడు. చిన్న చిన్న అటకలు — వాటిని చేరుకుందుకు రెండు మూడు మెట్లు సీట్లు. 'మీ తల జాగ్రత్త సుమా' అని యింగ్లీషులో నోటీస్‌లు తరచుగా కనిపించాయి

మెల్లగా లోపలకు దూరాడు

పంజరంలో యిరుక్కున్న పక్షుల్లా కూర్చున్నారు అంతా 'సింగిల్ సీట్' వున్న చోటువ అయితే యీ మాట అంత 'ఉత్ప్రేక్ష' కాదు అనిపించింది

రెండు సీటు జంటగా వున్న చోట తన నెంబర్ చూచుకున్నాడు శేఖర్ బ్రీఫ్‌కేస్ ఆ సీటులో జాగ్రతగా వుంచి పక్కకు తిరిగి చేతి రుమాలుతో నుదురు తుడుచుకున్నాడు.

ఎదురుగా సీట్ వయిపు చూచాడు. ముగ్గురు కూర్చునే జాగ. ఓ మధ్యవయసు దంపతులు కూర్చున్నారు

లోపలకు వచ్చే ప్రయాణీకుల రద్దీ ఎక్కువవుతోంది. సూట్‌కేస్‌లు, భారీ ట్రంకు పెట్టెలు జొరబడుతున్నాయి. పోర్టర్లు 'పక్కకు తొలగండి, దారి యివ్వండి' అని పలుభాషల్లో పదే పదే అరుస్తూ తోసుకుంటు ముందుకు పోతున్నారు.

శేఖర్ మళ్ళీ కిందకు దిగాడు.

ఇంకా అయిదు నిమిషాల విరామం వుంది.

న్యూస్ పేపర్ కోసరం అటు యిటు చూచాడు. ఎక్కడా స్టాల్ కనిపించలేదు. సిగరెట్లు, కాఫీలు, ఆటవస్తువులు యివన్నీ తోపుడు బళ్ళలో వస్తున్నాయి గాని న్యూస్ పేపరు దర్శనం కాలేదు. పత్రికల కుర్రాడు ఓ బండి తోసుకుంటూ పోవడం కనిపించింది కొద్ది దూరంలో గబగబ నడిచి ఆ బండిని పట్టుకున్నాడు. న్యూస్ పేపర్ కోసం చూస్తే లేదు ఇంగ్లీషు, హిందీ, కన్నడం పత్రికలు— పుస్తకాలు, క్రైం, రొమాన్స్ పేపర్ బాక్స్ విరివిగా వున్నాయి.

'న్యూస్ పేపర్ లేదా ?'

అడ్డంగా తల ఆడించాడు బండితాలూకు మనిషి.

'ఎక్కడ దొరుకుతుంది ?'

'నేనేం ఎంక్వయిరీ ఆఫీసు కాదు' అన్నట్లుగా ముఖం పెట్టి అతడు చేయి బారజాపి దూరంగా 'ఎంట్రెన్స్ గేట్' వంక చూపాడు.

శేఖరానికి ఉసూరు మనిపించింది. ఇప్పుడు అంత దూరం వెళ్ళిరావటానికి సమయం చాలదు తమ స్టేషన్‌కు వస్తూ వున్నప్పుడే దారిలో 'పికప్' చేసుకుంటే సరిపోయేది హడావిడిలో మరచిపోయాడు పొద్దున్నే ఇడ్లీ కాఫీలకు

వున్న 'డిమాండ్' న్యూస్ పేపర్లకు లేకపోవడం మన దేశ దౌర్భాగ్యం అనుకున్నాడు. ప్రతివాడూ తప్పనిసరిగా దినపత్రిక కొనుక్కుంటే- పేపరు కుర్రాళ్లు బిలబిలలాడుతూ తిరుగాడుతూ వుండేవాళ్ళు !

అతను తిరిగి సీట్లోనికి వచ్చి కూర్చోవడంతోటే ఎదురుగా 'హిందూ' పేపర్ కనిపించింది ఆశగా దానివంక చూచాడు. అతని ముఖంలో 'ఆశ' కొట్టవచ్చినట్టుగా కనిపించివుంటుంది – ఎదురు ప్రయాణీకుడు 'కావాలంటే తీసుకోండి' అని అందించాడు, శేఖర్ అడగకుండానే

'థాంక్స్! పేపర్ కోసం కిందికి వెళ్ళాను, దొరకలేదు' అన్నాడు ఎపోలొజెటిక్‌గా.

'ఫరవాలేదు, చదువుకోండి' అన్నాడతను.

ట్రెయిన్ బయలుదేరిన తరువాత చాల సేపటి వరకూ పేపర్ చదువుకుంటూ వుండిపోయాడు. శనివారం అవడంవల్ల 'ఓపెన్ పేజ్'లో వచ్చిన వ్యాసాలు అభిరుచిదాయకంగా ఆలోచింపజేసేవిగా వున్నాయి. సంపాదకీయం, మిడిల్ పేజీ వ్యాసాలు సరేసరి !

చాలదూరం వెళ్ళిన తరవాత కాఫీ వస్తే ఆ కేకకు వులిక్కిపడి ఓ కప్పు అడిగి పుచ్చుకున్నాడు.

ఇలాంటి చోట కూడా 'బేరర్' ఎందుకట్టా బిగ్గరగా అరుస్తాడో అర్థం కాలేదు శేఖర్‌కు. బహుశ 'అలవాటు దోషం' అయి వుంటుంది.

ఎదురుగా కూర్చున్న ఆసామి కాస్త పరిచయముగా నవ్వి 'బృందావన్ డబుల్ డెకర్‌మీద మీ అభిప్రాయం యేమిటీ?' అన్నప్పుడు కొన్ని నెలల క్రితం టి. వి. లో చూచిన ఇంటర్‌వ్యూ గుర్తువచ్చింది శేఖర్‌కు.

'బాగుంది' అన్నాడు ముక్తసరిగా.

'చాలమంది ప్రయాణీకులు దీన్ని సపోర్ట్ చేయడం లేదు కష్టాల పరంపర చెబుతున్నారు' అన్నాడు ఆయన.

'కొత్త పద్ధతి! మార్పు జనానికి ఇష్టం వుండదు. వాళ్ళ అంగీకారం దొరకటానికి చాల టైం పడుతుంది.'

'సామానుతో ప్రయాణం చేసే వాళ్ళకు యిబ్బంది వెయిట్ లగేజ్‌కుకూడా అరలేదు, హెవీ లగేజ్ వున్నవాళ్ల గోల పరమాత్ముడికే తెలియాలి.'

'తక్కువ సామానుతో ఎక్కువ సౌకర్యంగ ప్రయాణం చేయండి—అని దాదాపు మూడు సంవత్సరాల నుండి ప్రచారం చేశారు గదా—రైల్వేవాళ్లు. ఈపరికి జనం యీ మార్పుకు సరిపడిపోయి వుంటారనుకున్నారు !'

'ఎంత తక్కువ సామాను అయినా- కొంత తప్పదు గదా! సూట్ కేస్, చేతిసంచి, నీళ్ళసీసా .. పిల్లలతో ప్రయాణం చేస్తుంటే పాలసీసాల కిట్... యివన్నీ తప్పనిసరిగా వుండవలసిన సరంజామా కదండీ' అన్నాడు అతను.

'అవునవును' అన్నాడు శేఖర్ ఆయన చెప్పేది కాదంటే సంభాషణ హనుమంతుడి తోకలాగ యింకా పెరిగిపోతుందేమోనని భయపడిపోయి. ప్రయాణాలలో మనుషులతో పూసుకుని కలివిడిగా మాట్లాడడం, కొత్త పరిచయాలు చేసుకోవడం – పెంచుకోవడం శేఖర్‌కు అలవాటు లేదు. అయినా అతని ప్రమేయం లేకుండానే ప్రయాణాలన్నీ కులాసాగా ఎక్కువ ప్రయాస లేకుండా నడిచిపోతాయి.

'మద్రాసులో వుంటారా మీరు బెంగుళూరా ?' అనడిగాడు, ఎదురుప్రయాణీకుడు.

'మద్రాసేనండీ. పనిమీద బెంగుళూరు వెడుతున్నాను '

'అలాగాండీ ! మాది మద్రాస్. వారం రోజులు వుందామని వెడుతున్నాను బెంగుళూరుకు. మా తోడి అల్లుడు వున్నాడు అక్కడ.'

కొంతసేపు నిశ్శబ్దం.

తరువాత ఆయనే అన్నాడు 'ఇంకకొన్నాళ్ళకు రెండు బృందావనాలు వేస్తారుట ! అటు యిటు కూడా ! అప్పుడు ప్రయాణం మరింత హాయిగా వుంటుందేమో !'


'ఇప్పటికే బెంగుళూరు, మద్రాసు ట్విన్ సిటీస్ అనుకుంటున్నారు చాలమంది.'

'రాజకీయంగా ఎలా వున్నా- పరస్పర సంబంధ బాంధవ్యాలు, ఆఫీసు కార్యకలాపాలు, పరిశ్రమల దోహదం... యీ రెండూ నగరాలకు ఎక్కువ మద్రాసులో వున్న ప్రతి వాళ్ళకూ దాదాపు బెంగుళూరుతో పరిచయం వుంటుంది. అలాగే బెంగుళూరు వాళ్ళకు కూడా !'

'సాంస్కృతికంగా రెండూ దగ్గర భరత నాట్యం ట్రూప్స్, సంగీత కచేరి వాళ్ళు మదరాసు నుంచి బెంగుళూరుకు తరచుగా వెడుతూ వుంటారు ఇంజనీరింగ్ సంస్థలకు బ్రాంచీలు వున్నాయి గానే వాటి యజమానులకు వుద్యోగులకు రెండు చోట్లా బంధు బలగం వుంటుంది— సహజం '

'మద్రాసులోవున్న యువకులు చాలమంది తమ అత్తవారి ఊరు బెంగుళూరు అని చెబుతూ వుంటారు ' అంది ఆమె అప్పుడే వాళ్ల సంభాషణలో ప్రవేశిస్తూ

శేఖర్ అంతవరకూ ఆమెను గమనించలేదు అంటే ఆమె అస్తిత్వాన్ని గుర్తించలేదని కాదు. స్త్రీలపట్ల సూటిగా- తరుచుగా చూడడం సభ్యత కాదు గనుక తల అటువైపు తిప్పకుండా ప్రయత్నపూర్వకంగా తప్పించుకుంటూ వచ్చాడు యింతవరకూ. 'యువకులు – అత్తవారూ' అనడంతో ఒక్కసారుగా ఆమె ముఖం వయిపు చూచాడు. ఆడవాళకు సిక్స్త్ సెన్స్ వుంటుందని చదివాడు శేఖర్– పుస్తకాలలో. ఆమెను



చూడడంతోటే యీ విషయం స్ఫురణకు వచ్చింది. కొంపతీసి యీమె కూడా ఆకోవకు చెందింది కాదుగదా! తను పెళ్ళిచూపులకు బెంగుళూరు వెడుతున్నాడని పసిగట్టిందా యేంటి? అనుకున్నాడు.

'అలా ఉలిక్కిపడ్డారేం? మీ అత్తవారి వూరు బెంగుళూరా?' అన్నాడు అతను.

శేఖర్ మళ్ళీ ఉలిక్కిపడి 'కాదండీ' అన్నాడు. అతని బుగ్గలు ఎర్రబడడం ఆమెకు స్పష్టంగా కనిపించింది.

'ఇంకా పెళ్ళి కాలేదేమో. మీ రేమిటి అంతా తెలిసినట్లు అడుగుతారు-' అంది ఆమె భర్తతో కాస్త కోపంగా.

శేఖర్‌కు యీమెకు సిక్స్త్ సెన్స్ వున్నదన్న విషయం రూఢి అయిపోయింది తను జాగ్రత్త పడకపోతే లాభంలేదనుకున్నాడు

'మీరు చెప్పిందే కరెక్టు!' అన్నాడు

'అయితే మీరు పెళ్ళికొడుకుల జాబితాలో వున్నారన్నమాట!'

శేఖర్ నవ్వి వూరుకున్నాడు.

'ఈ రోజుల్లో - కుర్రాళ్ళు ఉద్యోగంలో స్థిరపడి ఆర్థికంగా హంగు చిక్కితేగాని వివాహానికి ఒప్పుకోవడంలేదు. నన్ను అడిగితే అదే మంచి పని అంటాను. మంచి బాధ్యత అయినపని. వెనకటి రోజుల్లో మీ ఆంధ్ర దేశం మంచి పెళ్ళిళయి సంసారం మొదలు పెట్టినవాళ్ళు కాలేజిచదువులకోసం మద్రాసులో భార్యలతో సహా కాపురం పెట్టటం నాకు తెలుసు' అన్నారాయన

తను యేమీ అనకపోతే యీ సంభాషణ యింకా పెళ్ళిళ్ళనుగురించి యింతదూరం పోతుందోనని భయపడ్డాడు శేఖర్.

ఏదో అబద్ధం చెప్పయినా విషయం మార్చకపోతే ప్రమాదంలో చిక్కుకుపోవడం తప్పదు.

'నాకింక యిద్దరు అన్నయ్యలూ, యిద్దరు చెల్లెళ్ళూ వున్నారండీ పెళ్ళి కావలసినవాళ్ళు. మరో అయిదు సంవత్సరాలదాకా నాకు ఆ ఆలోచన లేదనుకుంటాను' అన్నాడు గబగబ.

'అదృష్టవంతులు' అన్నాడు ఆయన. ఈ లోపల మీ సంపాదనతో జీవితానికి కావలసినవన్నీ సేకరించుకోవచ్చును.'

శేఖర్ మరోమారు తాపీగా ఆమెవంక చూశాడు. వలభయ్యేళ్ళు దాటుతున్న మనిషి

ఒకటి రెండుసార్లు చూడాలనిపించే ఆకారం ఆమెది- అనుకున్నాడు ముఖం మంచి వర్ఛస్సుతో నిండుగా వుంది

ఆయన్ను, ఆమెను చూస్తూ వుంటే మంచి చలాకీ అయిన దంపతులు అనిపించింది. ఒకళ్ళకోసం ఒకళ్ళు - అన్నట్టుగా బాగా అర్థంచేసుకుని సజావయిన సంసారం వెడుపుతున్న జంట- అనుకున్నాడు. శేఖరానికి యిలా స్వాప్నికంగా ఊహాలోకంలో యితరుల సుఖసంతోషాలను గురించి అంచనా వేసుకోవడం యిష్టమయిన ఊహ

రైలు యేదో స్టేషన్లో ఆగింది.

జనం కంపార్ట్‌మెంట్ నుంచి కిందకు దిగుతున్నారు ఎక్కేవాళ్ళు యెవరూలేరు — యీ ద్వారం నుంచి. అందువల్ల యేమంత రద్దీ అనిపించలేదు

శేఖర్ కిందకు వెళ్ళాడు డబుల్ డెకర్ బేస్‌మెంట్‌లోకి భూగృహంలో ప్రవేశిస్తున్నట్టు వుంది

అక్కడ నుంచి ప్లాట్‌ఫారం వయిపు చూస్తే ఉరుకులు పరుగులు పెడుతున్న జన ప్రవాహం మీద పడబోతున్నట్లు అనిపించింది! వెలుతురు తక్కువ బెడ్డింగు సామానులకు చోటే లేదు.

రైలంతా బాగానే వుంది కాని- 'లగేజ్ రూం' ప్రత్యేకంగా యేర్పాటు చేసి అందరి సామన్లు 'రీడింగ్ మెటీరియల్' తప్ప అక్కడ చేర్చి- మనుషులు హాయిగా ప్రయాణం చేయడానికి వీలు కల్పిస్తే బృందావనం ఎప్పటిలాగ సుఖ ప్రయాణానికి అనువయిన ట్రెయిన్‌గా వుండిపోతుంది— అనిపించింది శేఖర్‌కు.

అతను మళ్ళీ తన సీటుకు వచ్చి కూర్చునే టపటికి రైలు బయలుదేరింది.

ఆ దంపతులు మాట్లాడుకుంటున్నారు.

రహస్యాలు కాదు గాబోలు- పెద్దగానే వినిపిస్తున్నాయి వాళ్ళ మాటలు; శేఖర్ ఏమీ ప్రయత్నం చేయకుండానే వాళ్ళ సంభాషణ వినగలుగుతున్నాడు.

'మీ అక్కగారి కారు వస్తుందను కుంటాను స్టేషన్‌కు.'

'ఆ! సుమిత్ర తనే డ్రయివ్ చేసుకు వస్తుంది, చూస్తూ వుండండి.'

'అన్నట్టు మీ సుమిత్ర పెళ్ళియేమయింది?' శేఖరానికి అనిపించింది. యీ పెద్దమనిషికి యెంతసేపూ పెళ్ళిళ్ళగొడవ తప్ప యింకేం పట్టదా యేమిటని !

''చూస్తున్నారు !''

'ఇంకా ఎం. ఏ ఫస్టియర్‌లోనే వుంది గదూ ?'

-శేఖర్‌కు మనసులో యేదో కదలబారినట్లయింది యం ఏ ఫస్టియర్ సుమిత్ర !

'చదువు విషయం అంత పట్టింపు లేదు మా అక్కయ్యకు, బావగారికీ కూడా. మంచి సంబంధం దొరకడంతోటే పెళ్ళి చేసేయాలని చూస్తున్నారు, కాని సుమిత్రే పేచీ పెడుతోందట !'

'యేమని ?'

'యేమిటో నాకూ వివరంగా తెలియదు సుమండీ ! కనుక్కుందాంగా వెళ్ళాక.

'పోనీ నీకు తెలిసినంతవరకు చెప్పు ... కాలక్షేపం అవాలిగా!'

'సుమిత్ర వాళ్ళ కాలేజిలో ఓ కుర్ర లెక్చరర్‌ను ప్రేమించిందట. వ్యవహారం పెళ్ళిదాకా వెళ్ళింది. కాని, బావగారూ...'

'కూడదన్నారా ?'

'లెక్చరర్ ఉద్యోగం యేమంత గొప్పది కాదని తటపటాయిస్తున్నారు కాస్తోకూస్తో కట్నం యివ్వాల స్తోమతు వున్నప్పుడు పెద్ద ఉద్యోగస్తుడని, భారీ ఆస్తిపాస్తులు వున్న వాడిని సంపాదించే అవకాశం వుందిగదా అని ఆయన ఊహ !'

'వేరే సంబంధాలు చూస్తున్నారా మరి ?'

'అవును.'

'మరి సుమిత్ర వూరుకుందా? ప్రేమ, గీమ అని అల్లరి చేయడంలా ?'

'చేయకేం చేస్తూనే వుందిట. ఆస్తి పాస్తులు- గొప్ప హోదా వున్న వరుడు తక్కువ కట్నంతో దొరికితే అలాగే చేసుకుంటుంది. తన చదువూ చక్కదనమే కట్నంగా వస్తేవాడు ఉంటే- పాత ప్రేమ కథలన్నీ గుంటపెట్టి గంట వాయిస్తానని అక్కయ్యతో చెప్పిందిట !'

ఆయన ఆలోచనలో పడినట్టున్నాడు. ఏదురు ప్రశ్న యేమీ వేయలేదు


'ఈ చదువు పూర్తయే లోపల మరో మంచి సంబంధం దొరికితే సరేసరి. లేకపోతే ఆ లెక్చరర్ వుండనే వున్నాడు- అని మా అక్కయ్యగూడా సమాధాన పడ్డానని వ్రాసింది మొన్న' అంది ఆమె

ప్రేమించి పక్కన పెట్టుకుంటే— వీప టెకయినా పనికి వస్తుందని- అన్నమాట! అయితే మీ సుమిత్ర మంచి గడుసు పిల్లే!'

శేఖర్‌కు మనసంతా వికలం అయిపోయింది.

బెంగుళూరు స్టేషన్లో రైలు ఆగీ ఆగడంతోటే, ద్వారం ముందు వి. ఐ పి. ఎడ్వర్ టైజ్‌మెంట్ లాగ పేర్చిన సూట్ కేసులు, బ్రీఫ్ కేసులు దాటుకుంటూ ప్లాట్ ఫాంమీదకు దూకి బయటకు వెళి-టిక్కెట్ కౌంటర్ ముందు 'క్యూ'లో నిలబడాడు; మదరాసుకు ముఖం పెట్టి

[ఈ కథ వ్రాసిన తర్వాత రైల్వే వాళ్ళు 'డబుల్ డెకర్' విత్‌డ్రా చేసేసారు. అందుకని వాళ్ళకు అంకితం.]



హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

ఆయుర్వేదంలో పాఠ్యపుస్తకాలు :

అనాదిగా మన దేశంలో మనుతూ విదేశాలలో వైద్య శాస్త్రానికి మాతృక అయిన ఆయుర్వేదం నేటి అలోపతీతో పోటీపడాలంటే సాంకేతికంగా ఎంతో కృషి అవసరం. తగిన పాఠ్య పుస్తకాలే లేనప్పుడు ప్రగతి ఎలా! ఆయుర్వేద కోర్సులకు తగిన పాఠ్య గ్రంథాలు కరువయ్యాయని అఖిల భారత ఆయుర్వేద కాంగ్రెసు ఉపాధ్యక్షులు డాక్టరు కె. సత్యనారాయణ స్వామి ఆందోళన పడడం ఎంతైనా ఉంది. అందు వల్లనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆయుర్వేద పాఠ్య గ్రంథాలు, పరామర్శ గ్రంథాలు, అనువాదాలు ప్రచురిస్తున్నరీతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకూడా కృషి సాగించాలనిఆయుర్వేద కాంగ్రెస్ అఖిలభారత శాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో అర్ధ శతాబ్దికి పైగా శిక్షణలోను, ఆచరణలోను అనుభవం కల ఆయుర్వేద విద్వాంసులు డాక్టర్ వేటూరు శంకరశాస్త్రి వంటివారు పాఠ్య పుస్తక రచనాచణులు ఎందరో ఉన్నారు. వారి సేవలను ప్రభుత్వం తగిన ప్రతిఫలంతో వినియోగించుకో వచ్చు. డాక్టరు శంకరశాస్త్రి ఇదివరకే కొన్ని ఆయుర్వేద పాఠ్య పుస్తకాలు వ్రాశారు. వాటిని వాడుకోవచ్చు. రాజతలుచుకొంటే డబ్బుకు కొరవా?

డాక్టర్ చంద్రశేఖరం ఫోటోల ప్రదర్శన :

నటుడు, ఏకపాత్రాభినేత, ఆహార్య నిపుణుడు ధ్వన్యనుకరణ చణుడు, రచయిత, నాటక కర్త, నాట్య తత్త్వవేత్త డాక్టర్ వైద్యుల చంద్రశేఖరం వివిధ ఆహార్య భంగిమల ఛాయా చిత్రాల ప్రదర్శనం జులై 5, 6, 7, 8 తేదీలలో కళాభవన్‌లో జరిగింది. దాదాపు ఆరు దశాబ్దాలుగా డాక్టర్ చంద్రశేఖరం కార్యకలాపాలు తెలిపే ఈ ప్రదర్శనం ప్రజలను విశేషంగా ఆకర్షించింది. ప్రదర్శనంలో శౌరేంద్రనాథ చట్టోపాధ్యాయ ఆంగ్ల గీతం ప్రదర్శనకు అపూర్వం శోభ తెచ్చింది. జులై 8వ తేదీన పోతుకూచి గ్రూప్ డాక్టర్ చంద్రశేఖరంను రవీంద్ర భారతి మినీ థియేటర్‌లో సన్మానించింది. అధ్యక్షుడు శ్రీ పోతుకూచి సభను ప్రారంభిస్తూ, చంద్రశేఖరం కళకు షష్టి పూర్తి చేసుకున్నారని, ఇది సామాన్య విషయం కాదని అన్నారు. ముఖ్య అతిథిగా శ్రీ కోన ప్రభాకరరావు, అధికార భాషా కమీషన్ కార్యదర్శి శ్రీ గోవింద రాజుల రామకృష్ణారావు, జనతా పార్టీ నాయకుడు శ్రీ బాబుల్‌రెడ్డి, సర్వోదయ నాయకుడు శ్రీ చుండి జగన్నాథం, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం డాక్టర్ చంద్రశేఖరం వివిధ కళా ప్రక్రియలను ప్రశంసించారు. డాక్టర్ చంద్రశేఖరం కృతజ్ఞత తెలుపుతూ, అసత్యమైన నటన మంచి సత్యాన్ని కనుగొనడం తన లక్ష్యం అని, త్యాగయ్యగారు సంగీతం ద్వారా మోక్షం సాధిస్తే, తాను నటన ద్వారా ప్రజలకు ఆనందం కలిగించి మోక్షం సాధించదలచానని ప్రజానందమే పరమాత్మ అని తన లక్ష్యాలు, ఆదర్శాలు వివరించారు. పిదప అక్కడికక్కడే, ఆయన ఆహార్యంతో క్షణాల మీద జట్టి రామచంద్రన్, కరుణానిధి, ముస్లిం వారిని ప్రదర్శించారు. తర్వాత శ్రీమతులు శీతా అనసూయులు జానపదశైలిలో చంద్రశేఖరంపై రచించిన గీతం ఆలపించారు. డాక్టర్ చంద్రశేఖరం జులై మూడవ వారంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో— విజయనగర్ కాలనీ— ఐ డి పి ఎల్., స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఎక్సైజ్ కార్యాలయం ముఖ్యంగా ప్రాంతాలలో— ప్రజల మధ్య ఎలాటి రంగ స్థలాదులు లేకుండా ఏకపాత్రాభినయ, ఆహార్య ప్రదర్శనలు చేసి, ప్రజల అపారాదరం చూరగొన్నారు.

చిత్రాల సమాధులు :

మెదక్‌జిల్లా గద్వేల్ తాలూకా వర్గల్ గ్రామం లో బృహచ్ఛిలా సమాధులు, ప్రాచీన శిలా చిత్రాలు హెచ్చుగా కనుగొనబడ్డాయి. రాష్ట్ర పురాతత్వశాఖ సాగించిన త్రవ్వకాలలో ఇవి కను గొనబడ్డాయి. వర్గల్ బహుశా వీరగల్లు అయి ఉంటుందని, ఈ శిలా సమాధుల మధ్యన ఉన్న రాతి తిన్నెమీది గుహ వంటి దాని కప్పు లోపల ఎర్ర జేగురు చిత్రాలు అపర బ్రహ్మ శాసనాలు ఉన్నాయని, వాననీటి వల్ల లిపి చెడిపోయిందని, వర్గల్ బహుశా వీరగల్లు కావచ్చు అని పురాతత్త్వవేత్త డాక్టర్ వి. వి. కృష్ణశాస్త్రి తెలిపారు. ఈ చిత్రాలలో పెద్ద కొమ్ములున్న దుప్పులు, జ్యామితీయ మానవ రూపాలు, నెమలి, బాతుల వంటి పక్షులు ఉన్నవని, కొన్నిటి చిత్రాలలో ప్రముఖంగా పురుషత్వం కానవస్తుందని ఆయన తెలిపారు. వర్గల్ పివారులలో కొన్ని వీరగల్లులు, సతీ కల్లులు కనిపించాయని ఆయన అన్నారు.

ఇక్ష్వాకులనాటి చరిత్రాధారాలు :

భారత ప్రభుత్వ పురాతత్త్వ పర్యవేక్షణశాఖ ఆగ్నేయ మండలం అధికారి డాక్టర్ కె. కృష్ణమూర్తి పత్రికా ప్రతినిధులతో ముచ్చటిస్తూ, గుంటూరు జిల్లా గురజాల తాలూకా గుత్తి కొండలో ఇక్ష్వాకు వంశ రాజుల చరిత్రాధారాలు విశేషంగా బయట పడ్డాయని తెలిపారు. తాము దాదాపు 150 యకరాల ప్రాంతంలో జరిపిన త్రవ్వకాలలో వివిధ మృణ్మయపాత్రలు, ఇక్ష్వాకు వంశీయుల పెక్కు సీసపు నాణేలు, మృణ్మయ గాజులు, క్రీడనకాలు లభించాయన్నారు. గుర్రపు బొమ్మకు జీను, కళ్లెం వలె ముఖంపై బిళ్ల మంచి పనితనంతో ఉన్నదని ఆయన తెలిపారు. జింక బొమ్మలున్న కర్రపతకాలు దొరికాయని ఇలాటివే అమరావతి, నాగార్జున కొండలలోను దొరికాయని, వీటికి లవణ కల్యాణి అని గాంధార కళా సంప్రదాయనామమని ఆయన తెలిపారు. ఏనుగు బొమ్మకు పెక్కు అలంకరణలు లేక పోయినా, మెడలో అర్ధ చంద్రపతకాల దండ, చెవులకు కర్ణ కుండలాలు ఉండడం విశేషమని ఆయన తెలిపారు.

ఒకదఫా మాత్రమే !

రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి నిలయంలో జూన్ 25 సాయంత్రం స్థానిక పత్రికా, వార్తాసంస్థల సంపాదకులకు, విలేఖరులకు విందు చేసిన సందర్భంలో ముచ్చటిస్తూ, దేశ రాష్ట్రపతిగా ఎవరయినా ఒక పర్యాయం మాత్రమే పదవిలో ఉండాలని చేసిన సూచన అధికార రోగ పీడితులకు కనువిప్పు కాగలదనడం నిస్సందేహం. ఏ పెద్ద పదవి అయినా ఐదేళ్లపాటు చాలు ఆ పదవీ కాలంలో దేశ ప్రగతికి సిద్ధ పరచిన ప్రణాళికలను, పథకాలను అనంతర పదవీ ప్రాప్తులు గౌరవించి ఆచరణలో పెట్టాలి. పూర్వుడు ఏ పార్టీవాడైనా, దీనివల్ల పదవీ వ్యామోహం తరడమే కాక, అవినీతికి కూడా ఆస్కారం తక్కువవుతుంది. ఒకరే అధికార పీఠం చూరు పట్టుకుని వ్రేలాడడం వల్ల అరిషడ్వర్గాలలోని లోభమోహ మద మాత్సర్యాలు ఆవేశించి, ప్రజలలో అగౌరవభాజనుడవుతున్నాడు. ప్రస్తుతం కొన్ని విశ్వవిద్యాలయాలలో పర్యాయ పద్ధతిలో శాఖాధ్యక్షులను నియమించడం వల్ల పలుపురి అహంకారం, అవినీతి సన్నగిల్లినట్లు తెలుస్తున్నది. దేశ పరిపాలనలో కూడ ఈ పద్ధతి వాంఛనీయమే.

ఉపశ్రుతి :

ఏమిటిసార్ మలేషియా దుస్తులతో మహా మురిసిపోతున్నారు? అవడిగారు ఒకరు, మలేషియా తెలుగు మహా సభలకు వెళ్లివచ్చిన ఒక మహానుభావుణ్ని. మహాసభకు అధికార ప్రతినిధిగా వెళ్లినా, ప్రతినిధుల జిప్ బ్యాగ్‌గాని, పతకంగాని, కీ చెయిన్‌గాని దొరకలేదు. కొన్న గుడ్డలతోనన్నా మురిసిపోనీండి పాపం! అన్నారు మరొకరు సానుభూతితో.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

రమేష్ - ఆదోని

మధురమైన జీవితానికి మగువే ఒక అందమైన మల్లె పందిరి అంటాను. ఏమంటారు ?

హంబగ్ అంటా. యీ మగువా, మల్లెపూల పందిరీ— మధుర జీవనం . . . ఉట్టి చాల్లె కబుర్లు! సారీ!

కనిపించని దేవుడు కనిపిస్తే హృదయం ఎలా ఉంటుంది ?

ఏ మడగాలి ? ఎలా ఆడగాలి ? ఏది ముందు ? ఏది వెనుక— అంటూ తత్తరపడి పోతూ ఉంటుందనుకుంటాను.

గణేశ్వర్ - టిట్లాఘర్

భారతనారికి దేశం ఎంతవరకు రక్షణయిస్తున్నది ?

చూడ్డం లేదా పేపర్లు? ఆడదానికి దేశం ఎంతటి దౌర్భాగ్యపు స్థితి కల్పిస్తోందో కథలు కథలుగా వస్తున్న రేపులు, గాంగ్ రేపులు, హత్యలు, దొమ్మీలు— యివన్నీ ఏమిటి? ఇవి చాలవన్నట్టు కొత్త కొత్త రకాలుగా స్త్రీలపై అత్యాచారాలను — పంచ వర్ణపు కలలుగా చలన చిత్రాలు చిత్రీకరిస్తున్నాయి. సాహిత్యం గుబాళిస్తోంది. ఇవి ఎలా దృష్టిని తప్పించుకు పోతాయో చూస్తున్నట్టు— గోడల మీద పోస్టర్లు— దేశం నలుచెరగులా స్త్రీ అంటే సెక్సు. ఆమెపై అత్యాచారం — దొరికిపోతేనే— తప్పు. కోర్టులో అందమైన కేసులు, అంతకంటే గంభీరంగా వాదించే సినిమా లాయర్లు. అత్యాచారం ఎంత అందంగా చేయించాడు దర్శకుడు? అతని ప్రతిభకు జోహార్లు అంటూ పొంగి పోయే చీప్ సినిమా వార్తలు. చ చ. ఇదీ ఒక దేశం?దీన్లో ఆడదానికి స్థానం—రక్షణా? !

వి. ఎస్. ఎమ్.—సికింద్రాబాదు

యవ్వనంలో వున్న కుర్రవాడి తలిదండ్రుల ఒత్తిడి వల్ల వయసు పెరిగాక బాధపడేది కుర్రవాడేనని ఎందుకు గ్రహించరు?

ఎందుకు గ్రహించరూ? అందుకే యవ్వనములో పెళ్లి చేద్దామని తాపత్రయ పడతారు. పాతికేళ్ల వాడి బుద్ధి మాంద్యానికి కారణం యవ్వనం అనవచ్చు గాని, నలభైలో ఇదే బుద్ధి మాంద్యం ప్రదర్శిస్తే— దాన్ని బుద్ధి లేకపోవడమే అంటారని పెద్దలకి తెలుసు. కనుకే తొందర పడతారు.

మనసు బాగుండక పోతే?

ఏముంది? మంచి నిద్రకు నోచుకోరు!

ప్రశ్నావళి

ఏ. ఎస్ కె — జెంషెడ్‌పూరు

మీకు దేవుని మీద నమ్మకం వుందా?

ఉందండీ. మీకు లేదా?. . . నా నమ్మకం బొత్తిగా గుడ్డి విశ్వాసం కాదు. నా పాట్లు నేను పడుతూ వుంటే.. తను కూలిపోకుండా నిల బెడతాడనే నమ్మకం. కాలు మీద కాలేసుక్కూర్చుని దేవుణ్ణి 'రూపాయిస్తా' నంటూ పురమాయించ లేను!

కె.వి.ఎస్; ఎల్.ఎస్ ఆర్. — కొండేపూడి

ఒక స్త్రీ పతనానికి కారణం మరొక స్త్రీ. కామెంట్ ?

ఆ యిద్దరు స్త్రీల పతనానికి కారణం పురుషుడే నాస్వామీ! అది మరిచి పోకండి.

రమణ — మధిర

నేనీ మధ్య వో పాత తెలుగు సినిమా చూశాను. దానిలో కత్తి యుద్ధం చేయడం, హాయిగా డ్యూయెట్లు పాడడం, ఏదో ఒక సాహస కృత్యం చేయడం, నిధి సంపాదించడం —ఇలా వుంటే ఎంత బాగుండేది కదండీ ?

ఇప్పుడూ ఇంతకు మించి ఏమున్నాయండీ— కత్తి యుద్ధానికి బదులు కరాటే, డ్యూయెట్లలో బూతులూ, సాహస కృత్యం, అమ్మాయి వేటా, నిధి సంపాదన, గాంగ్ రేపు కాక పాతే-దోపిడీ ఫార్ములా ఒకటే— బ్రాండు మారింది. అంతే.

ఎస్. జె. ఏ.- కర్నూలు

జీవితంలో మంచి మనసుకు పరిపూర్ణమైన శాంతి సౌఖ్యం ఎప్పుడు లభిస్తుంది?

మంచికైనా చెడుకైనా శాంతి సౌఖ్యాలు అవీ సంపూర్ణమైనవి లభించేది—మానవులు కన్ను మూశాకనే.

పి. ఎస్. ఎస్. — చెల్లూరు

అంబ పలకవే. . . జగదంబ పలకవే. . .
నరుడా ! యేమి నీ కోరిక?!

విజేంద్ర — ఆదోని

ఒక వ్యక్తి బ్రతికి ఉండగా అతని మంచి చెడులను గుర్తించని యీ లోకం అతను చని పోయాక గొప్పగా చెప్పుకుంటుంది ఎందుచేత?

చచ్చేదాకా మంచి చెడులు బేరీజు వేయవల సిన అవసరం రాదు. తీరా చచ్చాక — చెడులు చెప్పుకోడం మానవత్వం కాదు.

ఒక పత్రికలో సెన్సారుపై మీ వ్యాసం చదివాను. మీ నిజాయితీని మనసారా అభినం దిస్తున్నాను మేడమ్.

థాంక్యూ డియర్ సర్ ! అసలు సెన్సారు నిబంధనలు, వాటి విస్తరణలు, పరివర్తనలు చర్చిస్తూ వ్యాసాలు రాద్దామనుకుంటున్నాను . . . సెన్సారు కి సంబంధించిన ప్రాథమిక సూత్రాలు కూడా పాఠకులు అర్థం చేసుకుని చర్చించు కుంటే బాగుంటుందని నా అభిప్రాయం.

డి జె ఆర్ - హైదరాబాదు

వివాహం చేసుకొని మగవాడు స్వేచ్ఛను పోగొట్టుకుంటున్నాడు. . . ఆడది శాశ్వతమైన నీడ సంపాదించుకుంటూంది. ఏమంటారు?

వివాహంలో ఏ ఒక్కరికో కష్టమూ, ఏ ఒక్కరికో సుఖం వచ్చే మాటుంటే— ఏ మగాడూ ఏ ఆడదీ కూడా పెళ్లి తలపెట్టరు. ఒక్కటి జ్ఞాపకం వుంచాలి. సంపాదించుకున్న ప్రతిదానికీ ఏదో పోగొట్టుకోక తప్పదు. పోగొట్టుకున్న ప్రతిదానికీ ఏదో రాకా తప్పదు. పెళ్లి చేసుకుని మీరు ఆడదాన్ని ఉద్ధరించా ననుకుంటున్నారేమో . . మీ సుఖం కోసం మీరు చేసుకున్నారు. దీన్లో పోగొట్టు కోడం ఏముంది?

జీవితం ఏమిటి?

తరుక్కుంటూ వస్తున్న కొవ్వొత్తి.

వి కె - పాలమూరు

పెళ్లంటే నూరేళ్ల పంట. ఎలా ?

దిన దిన గండం నూరేళ్లాయుష్షుగా గడుస్తుంది కనుక!

వెంకట్ - ఉరవకొండ

స్వేచ్ఛను తాకట్టు పెట్టి డబ్బు కోసం అడ్డమైన రాతలు రాసిచ్చే యీ నాటి రచయితలకు రచయిత్రిగా మీ సలహా ?

అలా తాకట్టు పెట్టే అడ్డమైన రాతలూ రాయవలసిన అవసరం లేని వాళ్లే, రచయితలు. ఆత్మతృప్తి కోసం రాసేవాళ్లు, అచ్చులో పేరు చూసుకొందుకు రాసే వాళ్లు, డబ్బు కోసం రాసే వాళ్లు— ఎవరికేనా సరే స్వేచ్ఛ వక్కచే— ఎవరూ అరికట్టలేంది.

పి ఆర్ ఆర్. — వైజాగ్

స్వరాజ్యం వచ్చి 33 సం.లు అయింది. పితామహుని మరిచి పోయినా పిల్లల చదువుల వల్ల జ్ఞాపకం వస్తున్నారు.

అందుకే బాపూజీ తరిమి కొట్టిన "బ్రిటిషు వాడే" వారి జీవితం చిత్రీకరిస్తున్నాడు! మనకి దొరల మీదున్న గౌరవం మన వాళ్ల మీదలేదు అని మళ్లీ మళ్లీ నిరూపించుకుంటున్నారు. పాపం బాపూజీ! వాళ్ల దేశం వెళ్లి వారి తిండి తినని వాడు, వారి బట్ట కట్టనివాడు— వారి సింహాసనాన్ని వూపి వదలిన వాడు. అయితేనేం? ప్రస్తుతం "దొర"తన వేషం కట్టితే— భరించి చూస్తున్నారు!! నాకు ఒకొక్కప్పుడు అనిపిస్తుంది— జాతిపిత కథ ఏ భారత చలన చిత్ర నిర్మాతా చేపట్టలేదా అని! కాని ఇంకొకటి. ఒట్టినే చూపెట్టినా మన వాళ్ల మంచి సినిమాలను చూడరని ది స్టోరీ ఆఫ్ మహాత్మా నిరూపించింది కదా. ఇప్పుడు "ఫారిన్" వాడు తీస్తున్నాడు కనుక ఎగబడి చూస్తారేమో చూడాలి !!

ఎన్. జె. — కుప్పం

భక్తికీ-ఆరాధనకు తేడా ఏమిటి?

భక్తిలో మూర్ఖత్వం, ఆరాధనలో ప్రేమ ఎక్కువగా తొంగి చూస్తాయి. ●

★ వంటలు ★

ద్రాక్ష లడ్డూ

కావలసినవి :— గోధుమలు - 250 గ్రా , చక్కెర — 250 గ్రా., నెయ్యి లేక డాల్డా — 500 గ్రా.

చేయువిధానం :— గోధుమలు ఒక రోజు ముందుగా నానపెట్టవలయును. మరుసటి రోజు గోధుమలు తడిలేకుండా వడకట్టి, రోట్లోవేసి దంచినచో సులభమగును. లేదా రుబ్బుకోవచ్చు. కానీ, నీళ్లు పోయకూడదు. దంచిన తరువాత నీళ్లలోవేసి కడగవలయును. పొట్టు అంతయు పోవును పిండి పోదు. మిగిలిన పిండిని పొడిగుడ్డ మీద కాసేపు వుంచినచో తడిసి గుడ్డ పీల్చివేయును. కొద్దిగా నెయ్యి చేతికి తీసుకొని, పిండిని చిన్న చిన్న గోలీలుగా చేసి బట్టమీద వేయవలెను. ఒకదాని కొకటి అంటుకొనకుండా చూడవలయును

ఒక గిన్నెలో చక్కెరవేసి, స్టవ్‌మీద పెట్టి తీగపాకం వచ్చేటట్లు చూడాలి చక్కెర తడిచేటట్లు నీళ్లు పోయాలి. పాకం లోనికి రంగు యిష్టమున్నచో వేసికొనవచ్చును. పై గోలీలను నెయ్యిలో బాగా వేయించి వీరిఅగయిన తర్వాత పాకంలోనికి వేయాలి.

గోలీలన్ని పాకంలోనికి వేసిన తర్వాత, ఒక పొడవాటి గ్లాసుకు నెయ్యి రాసి పాకంతోసహా దానిలో పోసి, ఆరిన తర్వాత బోర్లించినగ్లాసు ఆకారం వచ్చును. నిల్వ వారం రోజులు.

కొంచెం శ్రమ అయినా మంచి వంటకం. రుచిగా వుండును. చేసి చూస్తారు కదూ?

— పి పద్మా వెంకటేశులు

అరటికాయ కోఫ్తా

కావలసినసామాన్లు :— అరటికాయలు—4, శనగపిండి — 50 గ్రా., ఉల్లిపాయలు—2, గరమ్ మసాలా పొడి - కొద్దిగా, ఉప్పు — తగినంత, మిరపపొడి — 1 చెంచా, చింత పండు — కొద్దిగా, నూనె ...

రుబ్బటానికి :— జీలకఱ్ఱ—2 చెంచాలు, ధనియాలు—ఒక చెమ్చా, మిరియాలు—10, పెద్ద యాలకులు-2, లవంగాలు-2, దాల్చిన చెక్కలు-2, వెల్లుల్లిపాయలు — 2, వులి పాయలు — 2, పచ్చిమిరపకాయలు — 6 వీటన్నిటినీ మెత్తగా రుబ్బుకోవాలి

తయారుచేయు విధము:— అరటికాయల పది నిముషాలు కాయల వళంగానే ఉడికించి తర్వాత చెక్కుతీసి, కొబ్బరి కోరాముత కోరాలి ఒక వుల్లిపాయ కూడా కోరి రెండ కలిపి వీటిలో తగినంత ఉప్పు, మిరపపొడి శనగపిండి ఓ చెంచా, గరమ్ మసాలా పొడి వేసి బాగా కలిపి, మనకి కావలసిన సైజులో వుండలు చేసుకోవాలి. నూనెలో వీటిని బంగారురంగు వచ్చేవరకు వేయించితీసుకోవాలి. బాణలిలో నూనె కొద్దిగా వేసి మిగిలిన వుల్లిపాయ సన్నగా తరిగి అది, రుబ్బి వుంచుకున్న మసాలాముద్ద వేసి ఎర్రగా వేయించాలి. వేగాక చింతపండు రసం, ఒక గ్లాసు నీళు పోసి మసాలాను వుడికించాలి. సగం వుడికాక కోఫ్తాలువేసి మూత పెట్టి మధ్యమధ్య కలుపుతూ వుండాలి సన్నటి సెగమీద. దగ్గర పడుతుండగా దింపి దాని మీద కొత్తిమీర సన్నగా తరిగి జల్లాలి.

ఆలుదమ్


కావలసిన వస్తువులు : బంగాళాదుంపలు — 250 గ్రా, పెద్ద వుల్లిపాయలు — 4, పచ్చిమిరపకాయలు - 6, చిన్నఅల్లంముక్క, వెల్లుల్లి రెబ్బలు - 2, మసాలా ఆకులు (తేజ్‌పతా) - 2, రిఫైండ్ ఆయిల్ - 4 పెద్ద చెంచాలు, తగినంత ఉప్పు

తయారుచేయు విధము :— బంగాళా దుంపలు వుడక పెట్టి తొక్కుతీసుకుని 4కాని 6కాని ముక్కలుగా కోయాలి. వుల్లిపాయలు, పచ్చిమిరపకాయలు, అల్లం, వెల్లుల్లి అన్నీ కలిపి మెత్తగా నూరుకోవాలి. ఇప్పుడు స్టీలు కాని అల్యూమినియం బాణలికాని తీసుకుని దాంట్లో నూనెవేసి కాగాక మసాలా ఆకులు వేసి, నూరిన ముద్దవేసి ఎర్రగా వేపాలి వేగింతర్వాత బంగాళాదుంప ముక్కలు, ఉప్పు పసుపువేసి, ఓ గ్లాసు నీళ్లు పోసి మూత పెట్టాలి పదినిముషాలు. ముద్దగా అవుతుండగా దింపుకోవాలి. ఇది చపాతీలలో. పూరీలో బాగుంటుంది.

— ఎం. వ రాణి

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor . S. Radhakrishna.

(గత సంచిక తరువాయి)



[ఇంకా ఉంది]

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA

